# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 86 | హైదరాబాద్ | బుధవారం 17-09-2025 | పేజీలు : 12 | వెల : 1.00


12లో

ఎల్బీనగర్ ప్రజలకు శుభవార్త

: మధు యాష్కిగౌడ్..

## నేటి భారతం

- సమాజం అద్దంలాంటిది, మనం ఏదైతే చూస్తామో.. ఆ విషయాన్నే పదే పదే మనకు చూపిస్తుంది.. మన మొహాన్ని మనకి అద్దం ఎలా చూపిస్తుందో అలాగే..
- అందుకే కనిపించే దానిని నువ్వు ఆధారంగా చేసుకోకు.. కేవలం మంచి మీద మాత్రమే దృష్టి పెట్టు..
- మనం చేసే ప్రతి చిన్న మంచి పని సమాజంలో ఒక పెద్ద మార్పుకు నాంది పలుకుతుంది..
- ఒక్కటి గుర్తుంచుకోండి సమాజాన్ని విమర్శించడం చాలా సులువు.. కానీ దాన్ని మార్చడం కోసం ముందడుగు వేయగలిగిన వాడే గొప్పవాడు..
- ఎందుకంటే మనిషి ఎప్పుడు కూడా ఒంటరిగా జీవించలేడు.. సమాజమే అతని శ్వాస, అతనికి బలం..
- సమాజం పట్ల బాధ్యత లేకపోతే స్వేచ్ఛ అనే పదానికి అర్థం ఉండదు.

# మహిళా సంఘాలకు బతుకమ్మ కానుక

- మహిళా సంఘాలకు బతుకమ్మ కానుక
- చీరల పంపిణీకి సర్వం సిద్ధం
- ఒకే రకమైన డిజైన్, రంగుల్లో తయారీ...
- ఒక్కో చీర విలువ సుమారు రూ.800
- గ్రామాల వారీగా అందజేసేందుకు ఏర్పాట్లు



11లో


11లో

## సాంప్రదాయ యుద్ధాలు ముగిశాయి..


కొత్త సవాళ్లకు సిద్ధంగా ఉండండి

## మెడికల్ కౌన్సిలింగ్ లో అవకాశం కల్పించాలి

- మెడికల్ కౌన్సిలింగ్ లో అవకాశం కల్పించాలి
- లోకల్, నాన్ లోకల్ సమస్యపై సడలింపు ఇవ్వాలి
- ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద విద్యార్థుల నిరసన


11లో

## హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను వణికించిన క్లౌడ్ బరస్ట్


11లో

- హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌ను ముంచెత్తిన భారీ వర్షా లు
- కొండచరియలు విరిగిపడి హిమాచల్‌లో ముగ్గురు దుర్మరణం



## బతుకమ్మ ఉత్సవాలకు.. బతుకమ్మ కుంట సిద్ధం

- 25న బతుకమ్మకుంటలో బతుకమ్మ సంబురాలు..
- ఈ ఉత్సవాల్లో పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి..
- ఏర్పాట్లను పరిశీలించిన నేతలు, ఉన్నతాధికారులు..
- సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్న బతుకమ్మకుంట..

12లో

## నేడు లండన్‌లో 150 మంది సీఈఓలతో మంత్రి రోడ్ షో


11లో

- విశాఖ పార్టనర్‌షిప్ సమ్మిట్-2025కు గ్లోబల్ లీడర్లకు ఆహ్వానం
- ఏపీలో పెట్టుబడి అనుకూల విధానాలను వివరించనున్న మంత్రి

## ప్రజలకు మరింత చేరువలో పాస్‌పోర్టు సేవలు

- ప్రజలకు మరింత చేరువలో పాస్‌పోర్టు సేవలు
- రాయదుర్గంలో సరికొత్త పాస్‌పోర్టు సేవా కేంద్రం ఏర్పాటు
- ప్రారంభించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు


10లో

# సంపాదకీయం

## మణిపూర్ లో మార్పు సాధ్యమేనా

మణిపూర్‌లో కుకీ, మైతీ తెగల మధ్య రెండేళ్లుగా సాగుతున్న ఘర్షణ నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. రెండు తెగల మధ్య ఘర్షణ కారణంగా అల్లర్లు చెలరేగిన తర్వాత మోదీ మణిపూర్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో మణిపూర్‌లో తిరిగి శాంతిని నెలకొల్పేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని మోదీ చెప్పడం ముదావహం. అల్లర్లలో అట్టుడికిన మణిపూర్‌లో రెండేళ్ల తరువాత పర్యటిస్తున్న ప్రధాని మోదీకి తమ గోడును వెళ్లబోసుకున్నారు స్థానికులు. అల్లర్ల కారణంగా సర్వం కోల్పోయామని ప్రధానికి వెల్లడించారు బాధితులు. స్కూళ్లు మూతపడడంతో విద్యకు దూరమయ్యామని చిన్నారులు ప్రధాని మోదీ ముందు కంటతడి పెట్టారు. చిన్నారుల బాధను చూసి మోదీ చలించిపోయారు.. మణిపూర్ ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని , మోదీ మీకు అండగా ఉంటాడని వాళ్లను భరోసా ఇచ్చారు. శాంతి తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. మణిపూర్ ప్రజలకు కేంద్రం అన్నివిధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు మోదీ.కుకీలు ఎక్కువగా ఉండే చురాచంద్‌పూర్, అలాగే మైతీలు ఎక్కువగా ఉండే ఇంఫాల్‌లో నిర్వహించిన బహిరంగ సభల్లో మాట్లాడారు. తొలుత చురాచంద్‌పూర్‌లో 7,300 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, తర్వాత ఇంఫాల్‌లో 1,200 కోట్ల ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇంఫాల్, చురాచంద్‌పూర్ సభలు పరిశీలించి చూస్తే.. మ ణిపూర్‌లో శాంతి చేకూరాలన్న మాటలు మోదీ నోట వినిపించాయి.నిత్యం ఘర్షణలతో అట్టుడుకుతున్న మణిపూర్‌ను మళ్లీ శాంతికి, అభివృద్ధికి చిహ్నంగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మోదీ స్పష్టం చే శారు. రాష్ట్రంలో జరిగిన హింసాత్మక ఘటనల వల్ల నిరాశ్రయులైన వారిని ఆదుకుంటామని ప్రధాని సభా వేదికగా ప్రకటించారు. రూ. 7వేల కొత్త ఇండ్లను కట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక సాయం అందిస్తున్నట్టు పే ర్కొన్నారు.అంతేకాదు కేంద్రం ఇటీవలే రూ.3 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీకి ఆమోదం తెలిపిందని.. ఇందులో నిరాశ్రయుల కోసమే ప్రత్యేకంగా 500 కోట్లు కేటాయించామని తెలిపారు. మొత్తంగా చూసుకుంటే మణిపూర్ బాధితులను ఆదుకునేందుకు, శాంతిని నెలకొల్పేందుకు, అభివృద్ధి ప నులు సక్రమంగా జరిగేందుకు కేంద్రం అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వానికి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తుందని భరోసానివ్వడం కొత్త ఆశలను చిగురించేలా చేస్తోంది.అయితే మోదీ పర్యటనకు ముందే మణిపూర్‌లో ప్రాదేశిక సమగ్రతకు భంగం వాటిల్లకుండా శాశ్వత శాంతి, స్థిరత్వాన్ని తీసుకురావడానికి చర్చల పరిష్కారం అవసరమని కుకీ తిరుగుబాటు గ్రూపులు, కేంద్ర ప్రభుత్వం భావించాయి. సెప్టెంబర్ 4న ఢిల్లీలో జరిగిన త్రైపాక్షిక సమీక్షా సమావేశంలో మణిపూర్‌లోని కీలకమైన జా తీయ రహదారి తిరిగి తెరిచేందుకు కుకీలు అంగీకరించారు.రాష్ట్రానికి జీవనాధారామైన ఈ జాతీయ రహదారిని ప్రయాణికులు, సరుకు రవాణా కోసం తెరిచేందుకు కుకీ, జో తెగలు నిర్ణయం తీసుకున్నాయి. మ ణిపూర్‌లోని రెండు డజన్లకు పైగా ఉన్న కుకీ, జో, హ్మార్ తిరుగుబాటు గ్రూపులకు చెందిన రెండు సంయుక్త సంస్థలతో వివాదాస్పదమైన సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్ (ఎస్ఎస్‌వో) ఒప్పందాన్ని పునరుద్ధరించడం మ ణిపూర్‌లో శాంతికి ఊతం కల్పించినట్లయిందిరెండేళ్ల క్రితం మైతీలను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న రాష్ట్ర హైకోర్టు ప్రతిపాదనను కుకీలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య చెలరేగిన ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. ఈ అల్లర్లలో ఇప్పటివరకు 260 మందికి పైగా మరణించగా.. 40 వేల మంది కుకీలు, 20 వేల మంది మైతీలు నిరాశ్రయులయ్యారు.ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి రాష్ట్రపతి పాలనలో మగ్గుతున్న మణిపూర్‌లో రెండేళ్ల తర్వాత మోదీ పర్యటించడాన్ని విపక్షాలు తీవ్రంగా తప్పుబట్టాయి. సందేశాలు మాత్రమే గాయాలను మాన్పలేవు. వేళ్లూనుకొని ఉన్న వైరాలు ఒక చిన్న నిప్పురవ్వతో మారణకాండకు దారితీస్తున్న తరుణంలో, వైషమ్యాలను, అపనమ్మకాలను నిర్మూలించడానికి ఒక నిరంతర సానుకూల చర్యలు అవశ్యం.

# జనసేనను గాడిన పెట్టేశారా

**కాకినాడ, సెప్టెంబర్ 16, భారతశక్తి ప్రతినిధి)**

జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో సొంత పార్టీలో ప్రక్షాళన చేపట్టారు. ఒకరు ఇన్ ఛార్జిగా ఉంటే ఇబ్బందులు వస్తున్నాయని ఆయన గ్రహించారు. అంతేకాదు పిఠాపురం నియోజకవర్గం జనసేనలో గ్రూపులుగా తయారవ్వడంపై కూడా పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ఆధిపత్యం కోసం వినియోగించుకుంటే అందరం ఇబ్బంది పడతామని హెచ్చరించారు. ఒకరు ఇన్ ఛార్జిగా వ్యవహరించడం వల్లనే ఇలా జరుగుతుందని భావించిన పవన్ కల్యాణ్ ఇక పిఠాపురం నియోజకవర్గంలో ఏ కార్యక్రమం జరిగినా అందుకు ఫైవ్ మెన్ కమిటీని నియమించారు.. పిఠాపురం నియోజకవర్గంలో ఇక ఏ నిర్ణయమైనా సరే ఫైవ్ మెన్ కమిటీ కూర్చుని నిర్ణయం తీసుకునేలా ఏర్పాటు చేశారు. కాకినాడ పార్లమెంటు సభ్యుడు ఉదయ్ శ్రీనివాస్ ఎమ్మెల్సీ పిడు గు హరిప్రసాద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్ చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావులను ఇన్ ఛార్జులుగా నియమించారు. దీంతో ఇప్పటివరకూ అనేక గ్రూపులుగా ఉన్నవారంతా ఒక్కటయి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ఉపకరిస్తుందని పవన్ కల్యాణ్ అంచనా వేశారు. ఉప ముఖ్యమంత్రిగా తాను పిఠాపురం నియోజకవర్గంపై పూర్తి స్థాయి దృష్టి పెట్టడం లేదు కనుక ఇప్పటి వరకూ మర్రెడ్డి శ్రీనివాసరావు ఇన్ ఛార్జిగా వ్యవహరించారు.. అయితే మర్రెడ్డి శ్రీనివాసరావు ఏకపక్ష నిర్ణయాలతో తాము ఇబ్బందులు పడుతున్నామని ఇటీవల జరిగినసమావేశంలో పవన్ కల్యాణ్ కు జనసేన నేతలు ఫిర్యాదు చేశారు. దీంతో? వారి ముందే మర్రెడ్డిని పవన్ కల్యాణ్ సున్నితంగా మందలించినట్లు తెలిసింది. ఒకరిచేతిలో పవర్ ఉండే కంటే ఐదుగురు కలసి తీసుకునే నిర్ణయాలు ఆలోచించి అందరికీ నచ్చేలా ఉంటాయని భావించిన పవన్ కల్యాణ్ ఐదుగురితో ఒక కమిటీని నియమించారు. పిఠాపురంలో గెలిచారు పవన్ కళ్యాణ్. రాష్ట్రస్థాయిలో మంత్రి పదవులతో పాటు డిప్యూటీ సీఎం హోదాలో ఉండడంతో తరచూ పిఠాపురం రావడానికి కుదరదు. అందుకే నియోజకవర్గ ఇన్చార్జిగా మర్రెడ్డి శ్రీనివాసరావుకు బాధ్యతలు అప్పగించారు. అయితే శ్రీనివాసరావు పార్టీ శ్రేణులను కలుపు కెల్లడం లేదన్న విమర్శ ఉంది. ఇటీవల జనసేన సమావేశంలో పవన్ కు స్థానిక నేతలు ఫిర్యాదు చేశారు. దీంతో వారి ముందే మర్రెడ్డిని పవన్ కళ్యాణ్



సున్నితంగా మందలించినట్లు తెలుస్తోంది. అయితే ఇటీవల ఈ ఫిర్యాదులు పెరగడంతో ఐదుగురు నేతలతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఇకనుంచి జనసేన కార్యక్రమాలన్నీ చేబ్రోలు లోని పవన్ నివాసం నుంచి నిర్వహించనున్నారు. ఇప్పటివరకు నియోజకవర్గ ఇన్చార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు క్యాంప్ ఆఫీసులో జనసేన కార్యకలాపాలు జరిగేవి. అయితే ఒక్కసారిగా పిఠాపురం జనసేనలో అనేక రకాల పరిణామాలు చోటు చేసుకోవడం విశేషం. దీనిపై బలమైన చర్చ నడుస్తోంది. పార్టీని గాడిలో పెట్టేందుకేనని జనసేన వర్గాలు చెబుతున్నాయిఇక తాజాగా పార్టీ పిఠాపురం నియోజకవర్గంలో జనసేన కార్యక్రమాలను చేబ్రోలులోని పవన్ కల్యాణ్ నివాసం నుంచే నిర్వహించాలని డిసైడ్ చేయడం కూడా ఆయన తీసుకున్న కీలక నిర్ణయంగా చెప్పాలి. మర్రెడ్డి పిఠాపురంలో ఏర్పాటు చేసుకున్న పార్టీ కార్యాలయాన్ని ఖాళీ చేసి చేబ్రోలు నుంచి నిర్వహించాలన్న ఆదేశాలతో ఇప్పటికైనా పిఠాపురం నియోజవర్గంలో జనసేన గాడినపడుతుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

# ఆ ఎమ్మెల్యేలకు షాక్....

**అనంతపురం, సెప్టెంబర్ 16, భారతశక్తి ప్రతినిధి)**

అనంతపురం పట్టణ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ను పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పట్టించుకోవడం లేదు. ఇటీవల అనంతపురంలో జరిగిన సూపర్ సిక్స్ – సూపర్ హిట్ సభలో స్థానిక ఎమ్మెల్యే భాగస్వామ్యం ఏ మాత్రం లేకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. చంద్రబాబు నాయుడు దగ్గుబాటి వంటి నేతలను పక్కన పెట్టేందుకు సిద్ధమయినట్లు కనపడుతుంది. కేవలం పదిహేను నెలల్లోనే పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే ఏ ఎమ్మెల్యే విషయంలోనూ ఇక ఉదారంగా వ్యవహరించకూడదన్న నిర్ణయానికి చంద్రబాబు వచ్చినట్లు తెలిసింది. అందుకు దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ కు తొలుత షాక్ ఇచ్చారని పార్టీలో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది.వివాదాన్ని కొని తెచ్చుకుంటున్న ఎమ్మెల్యేలను దూరం పెట్టడమే మంచిదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిసైడ్ అయినట్లుంది. అందుకే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ కు చెందిన నియోజకవర్గంలోనే మూడున్నర లక్షల మందితో భారీ బహిరంగసభ జరిగినా అందుకు సంబంధించిన ఏర్పాట్ల విషయంలోనూ ఆయనను దూరంగా ఉంచడంతో షాక్ ట్రీట్ మెంట్ కు చంద్రబాబు రెడీ అయ్యారని పార్టీలో వినికిడి. సూపర్ సిక్స్ – సూపర్ హిట్ సభ ఏర్పాట్లను అనంతపురం జిల్లాలో ఉన్న మిగిలిన ఎమ్మెల్యేలు,మంత్రులు, దేవినేని ఉమ, వంటి వారకు మాత్రమే పర్యవేక్షించారు. దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ను ఏ విషయంలోనూ ఇన్ వాల్వ్ చేయకపోవడంతో మిగిలిన ఎమ్మెల్యేలు కూడా దారిలో పడతారని చంద్రబాబు ఈ మార్గాన్నిఎంచుకున్నట్లు కనపడుతుంది.దగ్గుబాటి ప్రసాద్ పార్టీ హైకమాండ్ కు మరింత దగ్గరయి అనంతపురం అర్బన్ నియోజకవర్గం పరిధిలో తెలుగుదేశం పార్టీలో ఉన్న తన ప్రత్యర్థులకు చెక్ పెట్టాలనుకున్నారు. జూనియర్ ఎన్టీఆర్ కుటుంబ సభ్యులను దూషించడంతో? పాటు నియోజకవర్గంలో పార్టీ నేతలను కలుపుకుని పోకపోవడం కూడా చంద్రబాబు ఆగ్రహానికి కారణమని అంటున్నారు. పిలిచి టిక్కెట్ ఇచ్చినా, తొలిసారి ఎమ్మెల్యేల అయిన తర్వాత పార్టీలో సీనియర్ నేతలను దూరంగా పెడుతుండటంతో పాటు వివాదాల్లో చిక్కుకోవడంతో దగ్గుబాటి ప్రసాద్ ను అనేక సార్లు చంద్రబాబు హెచ్చరించారు. అయినా ఫలితం లేదని తెలిసిన తర్వాత మాత్రమే చంద్రబాబు దగ్గుబాటిని దూరం పెట్టారని, అనంంతపురం సభలో కనీసం పలకరించడం, ఆయన పేరు ప్రస్తావించడం చేయకపోవడాన్ని పార్టీ నేతలు గుర్తు చేస్తున్నారు. దగ్గుబాటిని చూసైనా మిగిలిన ఎమ్మెల్యేలు కంట్రోల్ లోకి వస్తారని భావిస్తున్నారు. మరి ఎమ్మెల్యేలు దారికొస్తారా? లేదా? అన్నది చూడాలి.

# దూరమైన నేతలు.. ఇక దూరమే

విజయవాడ, సెప్టెంబర్ 16, **భారతశక్తి ప్రతినిధి)**

సీపీ అధినేత వైఎస్ జగన్ ఇక పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండే నేతలను దూరం పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. వైసీపీ ఆంధ్రప్రదేశ్ లో ఓటమి పాలయి పదిహేను నెలలు గడుస్తున్నా ఇంకా చాలా మంది నేతలు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. వీరందరి పేర్లను పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి తెప్పించుకున్నట్లు సమాచారం. ఇప్పటి వరకూ యాక్టివ్ గాఉన్న నేతలు ఎవరు? దూరంగా వ్యవహరిస్తున్న నేతలు ఎవరన్న దానిపై జాబితా జగన్ కు చేరినట్లు తెలిసింది. దాదాపు వంద మందికిపైగానే నేతలు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని తెలిసి జగన్ పార్టీ ముఖ్య నేతల ముందు ఇటీవల అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం వారందరికీ తాను చెప్పినట్లుగా చెప్పాలని, దూరంగా ఉండదలచుకుంటే నిక్షేపంగా పార్టీ నుంచి వెళ్లిపోవచ్చన్న సందేశం పంపాలని నేతలకు చెప్పాలని జగన్ సూచించారట. ఈ బాధ్యతను సజ్జల రామకృష్ణారెడ్డికి అప్పగించినట్లు పార్టీ లో చర్చ



జరుగుతుంది. పార్టీ కష్టకాలంలో దూరంగా ఉండే వారిని తనతో పాటు కార్యకర్తలు కూడా మరోసారి దగ్గరకు తీయరని జగన్ కటువుగానే చెప్పినట్లు తెలిసింది. ఓటమిపాలయ్యామని, గత ఎన్నికల్లో పోటీ చేసిన వారికే టిక్కెట్ ఇస్తామని భావిస్తే అది భ్రమ అవుతుందని, నేతలను మార్చేందుకు కూడా తాను వెనకాడబోమని, అవసరమైతే మరో టర్మ్ అధికారానికి దూరంగా ఉంటాను కానీ, ఇటువంటి నేతలను స్పేర్ చేయనని సీరియస్ గానే హెచ్చరికలు పంపినట్లు తెలిసింది. రాష్ట్రంలో యూరియా కొరత సమస్య ఉన్నప్పటికీ ఆ నియోజకవర్గాల్లో రైతులతో కలసి ఆందోళనలో పాల్గొనకపోవడం, మెడికల్ కళాశాల ప్రయివేటీకరణపై పెదవి విప్పకపోవడం వంటి అంశాలను తీవ్రంగా పరిగణించిన జగన్ కొందరు నేతలు వారు సీనియర్లయినా పక్కన పెట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. అందులో నలుగురు సీనియర్ నేతలు కూడా ఉన్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో తమ వారసులు ఆ యా నియోజకవర్గాల్లో పోటీ చేస్తారని వారు వివరణ ఇచ్చే ప్రయత్నం చేసినా వారసులను కూడా అనుమతించే ప్రసక్తి లేదని తేల్చి చెప్పినట్లు పార్టీకి చెందిన సీనియర్ నేత ఒకరు అన్నారు. దీంతో రానున్న కాలంలో నేతలందరూ బయటకు వస్తారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

# మళ్లీ రుషికొండ ప్యాలెస్ ట్రిక్స్

విశాఖపట్టణం, సెప్టెంబర్ 16, **భారతశక్తి ప్రతినిధి)**

రుషికొండ ప్యాలెస్‌పై వైసిపి పొలిటికల్ గేమ్ మొదలుపెట్టింది.. రుషికొండకు సంబంధించి నిన్న మొన్నటి వరకు కూటమి ప్రభుత్వం వైసీపీ అధ్యక్షుడితో పాటు, నాయకులపైన ఎన్ని విమర్శలు చేసిన వారు సైలెంట్ గా గడిపేశారు.. పార్టీ అధినేత ఆలోచనో లేదా నాయకుల సొంత నిర్ణయాలో తెలియదు కానీ వాయిస్ పెంచుతున్నారు. రిషికొండ ప్యాలెస్ ను ముందు పెట్టి వైసీపీపై ముప్పేట దాడి చేస్తున్న కూటమి పార్టీలను రుషికొండ ప్యాలెస్ వినియోగంపై సలహాలిస్తూనే మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయాలనుకునే ఆలోచనను ఆయుధాలుగా మలుచుకుని వైసీపీ వాయిస్ పెంచి రివర్స్ కౌంటర్ ఇస్తుంది.. కూటమి ప్రభుత్వం టార్గెట్ చేస్తున్న రిషికొండ ప్యాలెస్, మెడికల్ కాలేజీలను ఆయుధాలుగా మార్చుకోవడం వెనక వైసీపీ ప్లాన్ ఏంటి? రుషికొండపై ఎదురు దాడి మొదలుపెట్టిన వైసీపీ. రుషికొండ ప్యాలెస్‌కు సంబంధించి కూటమి ప్రభుత్వంపై వైసీపీ ఎదురుదాడి మొదలుపెట్టింది.. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ దానిపై క్రియాశీలక పోరాటం చేయడం స్టార్ట్ చేసింది.. ఇప్పటివరకు కూటమి నాయకుల మీదే తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తూ వచ్చిన పార్టీ నాయకులు ఇప్పుడు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై పోరాటం చేసి ప్రజల్లో మనుగడ సాగించడానికి వాయిస్ పెంచుతున్నట్లు కనిపిస్తోంది.. అధికారాన్ని కోల్పోయిన తర్వాత వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి బెంగళూరు, తాడేపల్లి ప్యాలెస్‌లకే ఎక్కువగా పరిమితం కావడం, కేవలం పరామర్శలు, ఫంక్షన్లకు అటెండ్ అవుతుండడంతో వైసిపి నాయకుల్లో కూడా కొంత నిరుత్సాహం కనిపిస్తూ వచ్చింది.. రైతు సమస్యలపై ఆందోళనల్లో మాత్రమే కనిపించిన జగన్. ఇలాగే ఉంటే మళ్లీ వైసీపీ పార్టీని 2019 కి ముందు ఉన్నట్లు లైన్లో పెట్టడం కష్టం అనుకున్నారో ఏమో తెలియదు గానీ కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై వాయిస్ పెంచి యుద్ధం ప్రకటిస్తున్నట్లు వైసీపీ చేపడుతున్న ఆందోళన బట్టి తెలుస్తోంది. ఇప్పుడు వరకు కేవలం పార్టీ అధ్యక్షుడు జగన్ మాత్రమే మామిడి, మిర్చి రైతులు మద్దతు ధరలపై నేరుగా ఆందోళనల్లో పాల్గొనడం.. విద్యార్థుల పక్షాన ఫీజు పోరు, తల్లికి వందనం లాంటి పార్టీ కార్యక్రమాలకు జగన్ పిలుపునిచ్చినా జిల్లాల్లో నాయకులు మాత్రమే పాల్గొని ఆందోళనలు నిర్వహించారు. ఇప్పుడు ఏకంగా వైసిపి అధ్యక్షుడు జగన్‌తో పాటు పార్టీ నాయకులు గట్టిగా గళం విప్పి మాట్లాడుతున్నట్లు కనిపిస్తుంది. రుషికొండ ప్యాలెస్‌ను ఎత్తిచూపుతూ వైసీపీపై విమర్శలు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీ ఆర్థిక రాజధాని విశాఖలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రుషికొండ ప్యాలెస్ నిర్మాణాలను ఎత్తిచూపుతూ కూటమి నేతలు తీవ్రస్థాయిలో వైసీపీ అధ్యక్షుడు జగన్ పైన, పార్టీ నాయకులు పైన విమర్శలు చేస్తూనే వస్తున్నారు. కూటమి



అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్న ఇప్పటికీ కూడా రుషికొండ ప్యాలెస్ పై కూటమి నాయకులు తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నా.. ఇప్పటివరకు వైసీపీలో ఏ ఒక్కరు కూడా గట్టిగా వాయిస్ వినిపించి తిప్పి కొట్టే ప్రయత్నం చేయలేదు.. జగన్ సొంతగా వాడుకోవడానికి ప్యాలెస్ నిర్మించారని ఆరోపణలు. విశాఖ రాజధాని అయితే రిషికొండ ప్యాలెస్ లో సీఎం హోదాలో జగన్ ఉంటారు, జగన్ సొంతానికి వాడుకోవడానికి 500 కోట్లతో ప్యాలస్ లు నిర్మించుకున్నారని కూటమి జోరుగా విమర్శలు చేస్తున్నా ఆ విమర్శలను వైసీపీ తిప్పి కొట్టలేకపోయింది.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర తర్వాత కూడా రుషికొండ ప్యాలెస్ ను వినియోగంలోకి తీసుకు రాకపోవడంతో మళ్లీ రాజకీయం రుషికొండ ప్యాలెస్ చుట్టూ తిరగడం మొదలైంది.. ఇప్పటికే రిషికొండ ప్యాలెస్ ను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లో పరిశీలించారు. రెండోసారి రిషికొండ భవనాలను పరిశీలించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్మాణంలో లోపాలు ఉన్నాయని నాణ్యత లేకపోవడంతో భవనాల పెచ్చులు ఊడిపోతున్నాయని తీవ్రస్థాయిలో విమర్శలు చేయడంతో మళ్లీ రుషికొండ రాజకీయం ఏపీ రాజకీయాల్లో మొదలైంది. ప్రస్తుతం ఎదురుదాడికి సిద్ధమైన వైసీపీ. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటివరకు రిషికొండ ప్యాలెస్‌ను బూచిగా చూపిస్తూ వైసీపీపై మాటల దాడి చేస్తూనే ఉంది.. అయినా మొదటి నుంచి కౌంటర్ ఇవ్వడానికి వైసీపీ ఆత్మరక్షణలో పడినట్లు కనిపించినా, ప్రస్తుతం ఎదురుదాడి చేయడానికి సిద్ధమైనట్లు కనిపిస్తుంది? వైసిపిలో ఆ పార్టీ ఓటమి తర్వాత ఏ పని మొదలు పెట్టాలన్నా ఎలాంటి విమర్శ చేయాలన్నా, కొన్ని నిర్ణయాలను ప్రజలకు, నాయకులకు చేరవేసే విధంగా చెప్పాలన్న తక్కున గుర్తొచ్చే ఒకే ఒక్క నాయకుడు మండలి ప్రతిపక్ష నేతగా ఉన్న బొత్స సత్యనారాయణ? బొత్స రిషికొండ భవనాల విషయంలో కూటమి ప్రభుత్వానికి ఘాటుగానే కౌంటర్ ఇస్తూ భవనాలను వినియోగంలోకి తీసుకువచ్చి ఆదాయం ఎలా సమకూర్చుకోవాలో లాంటి సలహాలు కూడా ఇవ్వడానికి సిద్ధమయ్యారు. ఆదాయం ఎలా సమకూర్చుకోవాలో బొత్స సలహాలు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రుషికొండ ప్యాలెస్‌ను రెండోసారి పరిశీలించి, అధికారులతో రివ్యూ నిర్వహించిన తర్వాత ప్రభుత్వానికి రిషికొండ ప్యాలెస్ వినియోగంలోకి తీసుకు రావడంపై కొన్ని సిఫార్సులు కూడా చేశారు. ఇలా పవన్ కళ్యాణ్ రిషికొండ భవనాలను పరిశీలించి పెచ్చులు ఊడిపోతున్నాయి అని విమర్శలు చేశారో లేదో క్షణాల్లో రాష్ట్ర ప్రభుత్వం రిషికొండ భవనాలను వినియోగంలోకి తీసుకురావడానికి ముగ్గురు మంత్రులతో కూడిన ఉప సంఘాన్ని నియమించి రెండు నెలల్లో నిర్ణయం తీసుకుంటామని ప్రకటన చేయడంతో పాటు అసెంబ్లీలో చర్చించి ఏక నిర్ణయం తీసుకుంటామని చెప్పేసింది.. ఇప్పటివరకు కూటమికి ఆయుధంగా మారిన రిషికొండ ప్యాలెస్ భవనాల వినియోగంలోకి తీసుకొచ్చే అంశాన్ని వైసీపీ మెయిన్ టార్గెట్ గా తీసుకుని తన వాయిస్‌ని రైస్ చేసే పనిలో పడింది. మెంటల్ ఆస్పత్రిగా మార్చాలని అశోక్‌గజపతి సూచన. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రిషికొండ ప్యాలెస్‌ని ఎలా వినియోగంలోకి తీసుకురావాలనే అంశంపై తీవ్రస్థాయిలో విమర్శలపర్వం కొనసాగుతున్న తరుణంలో గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు రుషికొండ ప్యాలెస్ ను మెంటల్ హాస్పిటల్‌గా మారిస్తే బెటర్ అనే సూచన చేశారు.. 450 కోట్లతో నిర్మించిన భవనాలు వృధాగా వదిలేసే బదులు మెంటల్ హాస్పిటల్ గా మార్చి రిషికొండ ప్యాలెస్ ను నిర్మించిన వాళ్లను దానిలో ఉంచితే సరిపోతుందని రాజకీయ విమర్శలు చేశారు. జగన్ ఆ భవనాలను నిర్మించే బదులు ఉత్తరాంధ్రలో సుజల స్రవంతి పథకం పూర్తి చేసి ఉంటే ప్రజలకు మంచి నీటిని అందించే అవకాశం ఉండేదని, కానీ గత ప్రభుత్వం అలా చేయలేదని అశోక్ గజపతిరాజు మండిపడ్డారు. అశోక్ వ్యాఖ్యలపై బొత్స సత్తిబాబు కౌంటర్. గవర్నర్ హోదాలో ఉన్న అశోక్ గజపతిరాజు రాజకీయాలు ఎలా మాట్లాడుతారంటూ మాజీమంత్రి బొత్స సత్యనారాయణ ఘాటుగా స్పందించారు? రిషికొండ భవనాలను మెంటల్ హాస్పటల్ గా మార్చాలని స్టేట్మెంట్ ఇచ్చిన వాళ్లకే మతిస్థిమితం సరిగ్గా లేనట్లు ఉందని బొత్స తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. అసలు గవర్నర్ హోదాలో ఉండి రాజకీయాలు మాట్లాడొచ్చా అని ప్రశ్నిస్తూనే, 450 కోట్లతో నిర్మించిన భవనాలు పెచ్చులుడుతున్నాయని పవన్ కళ్యాణ్ చేత ఎత్తి చూపించే బదులు నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవచ్చు కదా అంటూ పవన్ కళ్యాణ్ ని, ప్రభుత్వాన్ని నేరుగా ప్రశ్నిస్తున్నారు.. రిషికొండ భవనాలకు ఏ ప్రభుత్వ హయాంలో బిల్లులు చెల్లించారో కూడా బయట పెట్టాలని బొత్స ప్రభుత్వానికి సవాల్ విసురుతున్నారు.. తెరపైకి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యవహారం. కూటమి అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటివరకు రిషికొండ భవనాలను ఎలా వినియోగంలోకి తీసుకురావాలో అర్థం కావడం లేదని ప్రభుత్వ పెద్దలు అంటున్నారు. ఆ క్రమంలో ప్రభుత్వానికి బొత్స సత్యనారాయణ ఓ ఉచిత సలహా కూడా ఇచ్చారు.. రిషికొండ భవనాలను ఖాళీగా ఉంచే బదులు డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కి ఇస్తే సంవత్సరానికి 25 కోట్ల రూపాయలు ఆదాయం వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం ఆ నిర్ణయం ఎందుకు తీసుకోవడం లేదని వాయిస్ పెంచి మరి ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకుంటే ఇతర రాష్ట్రాలకు వెళ్లి డెస్టినేషన్ మ్యారేజ్ చేసుకున్న ఎంతోమంది రిషికొండ ప్యాలెస్‌పై ఫంక్షన్లు చేయడం వల్ల భారీగా ఆదాయం వస్తుంది అని, ప్రతి సంవత్సరం రిసార్ట్స్ నుండి 8 కోట్ల ఆదాయం వచ్చేది అని పదే పదే చెప్పే కూటమి ప్రభుత్వం తాను ఇచ్చే సలహాలు పాటిస్తే 25 కోట్లు ఆదాయం వస్తుందని సలహాతో.. ప్రభుత్వ విమర్శలకు ఘాటుగా రిప్లై ఇస్తున్నారు. రిషికొండ ప్యాలెస్ మీద వైసీపీ వాయిస్ పెంచుతున్న సమయంలోనే రాష్ట్రంలో ఉన్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యవహారం ఫోకస్ అవుతోంది. అధికారం కోల్పోయిన తర్వాత మొట్టమొదటిసారిగా వైసిపి అన్ని వైపుల నుండి ముప్పేట దాడి చేసి టిడిపిని ఇరకటంలో పెట్టడానికి వాయిస్ పెంచి మరి కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నట్లు కనిపిస్తుంది. ఇప్పటివరకు సైలెంట్ గా ఉన్న వైసిపి తన వ్యవహార శైలిని మార్చుకుని ముందు ముందు వాయిస్‌ని ఇదేవిధంగా రైజ్ చేస్తుందో లేదా ప్రారంభించి తర్వాత చూసుకుందాంలే అనుకున్నట్లు వదిలేస్తుందో వేచి చూడాలి.

# లిక్కర్ కేసులో మరో చార్జిషీట్..

తిరుపతి, సెప్టెంబర్ 16 **భారతశక్తి ప్రతినిధి)**
ఏపీ మద్యం కుంభకోణ కేసులో సిట్ 86 పేజీల మూడో అదనపు చార్జ్‌షీట్ దాఖలు చేసింది. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేష్ నాయుడు, నవీన్ కృష్ణ, బాలాజీ యాదవ్ లు లిక్కర్ స్కామ్‌లో కీలకంగా ఎలా వ్యవహరించారో ఇందులో వివరించినట్లుగా తెలుస్?తంది. ముఖ్యంగా మద్యం ముడుపుల రవాణా, పంపిణీ , సంబంధిత అక్రమ కార్యకలాపాల గురించి వివరాలను ఈ చార్జిషీట్‌లో పొందు పరిచారు. ఇది కేసు దర్యాప్తులో మరో ముందడుగుగా భావిస్తున్నారు. జూలై 19, 2025న 300 పేజీల ప్రాథమిక చార్జ్‌షీట్‌ను సిట్ దాఖలు చేసింది. ఆగస్టు 11, 2025న 200 పేజీల రెండో చార్జ్‌షీట్, ఇప్పుడు 86 పేజీల మూడో అదనపు చార్జ్‌షీట్ కోర్టులో నమోదు చేసింది. ఈ చార్జ్‌షీట్‌లో మద్యం ముడుపుల రవాణాలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని, అతని సహాయంతో వెంకటేష్ నాయుడు, నవీన్ కృష్ణ, బాలాజీ యాదవ్ ముడుపులను అక్రమంగా తీసుకొచ్చి పంపిణీ చేశారని పేర్కొంది. ఎన్నికల సమయంలో తెలంగాణ నుంచి ఏపీ సరిహద్దులకు రూ. 8.20 కోట్ల నగదును బాలాజీ తీసుకొచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మద్యం సిండికేట్‌లో ముడుపుల సేకరణ, దాచిపెట్టడం, బ్లాక్ మనీని వైట్ మనీగా మార్చడంలో పాలుపంచుకున్నారని, అతని పీఏలు నవీన్ కృష్ణ, బాలాజీ యాదవ్ ఈ ప్రక్రియలో సహకరించారని సిట్ వెల్లడించింది. వెంకటేష్ నాయుడు చెవిరెడ్డి మిత్రుడిగా ఈ కార్యకలాపాల్లో ముఖ్య పాత్ర పోషించారని సిట్ తేల్చింది. ఈ నలుగురిలో పరారీలో ఉన్న ఇద్దర్ని ఇండోర్‌లో సిట్ అధికారులు అరెస్టు చేశారు. చెవిరెడ్డి , వెంకటేష్ నాయుడ్ని శ్రీలంకకు వెళ్తూండగా బెంగళూరులో అరెస్టు చేశారు. ఈ కేసులో మొత్తం కేసులో 19 సంస్థలు, 29 మంది వ్యక్తులు నిందితులుగా ఉన్నారు. ఇప్పటికి ఈ కేసులో సిట్ దర్యాప్తులో 268 మంది సాక్షులను విచారించగా, రూ. 62 కోట్లు సీజ్ చేశారు. ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలు, ఎలక్ట్రానిక్ పరికరాల డేటా, కాల్ రికార్డులు, గూగుల్ టేక్‌అవుట్ సమాచారం వంటి ఆధారాలు చార్జ్‌షీట్‌లో సాక్ష్యాలుగా ప్రవేశ పెట్టారు.

# టారిఫ్‌లతో అమెరికాకు కష్టాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16, **భారతశక్తి ప్రతినిధి)**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీ మధ్య సంబంధాలు గత కొన్ని నెలలుగా ఒక ఆసక్తికరమైన మలుపు తిరిగాయి. టారిఫ్‌ల బెదిరింపులు, వాణిజ్య చర్చలు, ఇండో?పసిఫిక్ భద్రతా విషయాలు మధ్య, ఈ రెండు దేశాల మధ్య సహకారం ఒక్కసారిగా ఒత్తిడికి గురైనప్పుడు, మరోవైపు క్వాడ్ వంటి వేదికల్లో పునరుద్ధరణ చెందుతున్నట్లు కనిపిస్తోంది. ట్రంప్ వాణిజ్య విధానాలు భారత్‌పై గట్టిగా పడిపోయాయి. రష్యన్ ఆయిల్ దిగుమతులను ఆపమని డిమాండ్ చేస్తూ, ఆగస్టు 2025లో భారత్ నుంచి అమెరికాకు వచ్చే చాలా దిగుమతులపై 50% టారిఫ్‌లు విధించారు. ఇది భారత వ్యాపారానికి బిలియన్ల డాలర్ల నష్టాన్ని కలిగించే అవకాశం ఉంది. ఆర్థిక విశ్లేషకుల ప్రకారం భారత జీడీపీ 0.8?1% తగ్గుతుందని అంచనా. కానీ, ఈ టారిఫ్‌లు అమెరికాకు కూడా వెనుకబాటు పడిపోయాయి. భారత్ నుంచి వచ్చే చౌక దిగుమతులు (ఉదా., టెక్నాలజీ, ఔషధాలు) అమెరికన్ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైనవి. ఈ డ్యూటీలు అమెరికన్ వినియోగదారులు, చిన్న వ్యాపారాలకు ధరలు పెంచుతాయి. ట్రంప్ స్వయంగా గుర్తించినట్లు, భారత్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకోవడం తప్పనిసరి, ఎందుకంటే టారిఫ్‌లు దీర్ఘకాలంలో అమెరికాకు లాభం కాకుండా, చైనా, ఇతర దేశాలకు అవకాశాలు కల్పిస్తాయి. ఇటీవలి చర్చల్లో, రెండు దేశాలు 'అసలు దూరం లేదు' అని అమెరికా అధికారులు చెప్పారు. ట్రంప్ మోదీతో ఫోన్ కాల్ చేసి, వాణిజ్య అడ్డంకులను తొలగించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది ట్రంప్ మొదటి విధానం ఓటమి కావడానికి ఒక సూచన. మోదీ స్పందన పట్టుదలతో కూడినది. బ్రిక్స్ సదస్సులో(ఆన్‌లైన్ మీటింగ్‌లో) మోదీ హాజరు కాకపోవడం ట్రంప్‌కు ఒక సిగ్నల్‌గా పనిచేసింది, ఎందుకంటే ట్రంప్ బ్రిక్స్‌పై కోపంగా ఉన్నారు. ఇది భారత్‌ను రష్యా, చైనాతో మరింత దగ్గరపడకుండా చూపించింది, అదే సమయంలో అమెరికాతో సంబంధాలను కాపాడుతూ. మోదీ ట్రంప్‌ను బెదిరింపులకు బదులు, బహుళ దేశాలతో (చైనా, రష్యా, బ్రెజిల్) మాట్లాడి, టారిఫ్‌లకు ప్రతిస్పందనగా వైవిధ్యమైన వాణిజ్య మార్గాలు వెతికారు. ఈ వ్యూహం పనిచేసింది.



ట్రంప్ మొదట భారత్‌ను 'టారిఫ్ కింగ్'గా విమర్శించారు, కానీ ఇప్పుడు మోదీని 'మంచి స్నేహితుడు'గా పిలుస్తున్నారు. భారత్ రష్యన్ ఆయిల్ దిగుమతులను కొంచెం తగ్గించినప్పటికీ, పూర్తిగా ఆపలేదు. ఇక మోదీ చాణక్య నీతి ? ఒత్తిడిని ఉపయోగించుకుని స్వేచ్ఛను కాపాడటం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. ఫలితంగా, ట్రంప్ భారత్‌ను కోల్పోవద్దని గుర్తించారు, ఎందుకంటే భారత్ లేకుండా ఇండో?పసిఫిక్ వ్యూహం బలహీనమవుతుంది. క్వాడ్ (భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా) ఇండో?పసిఫిక్ భద్రతకు కీలకం. 2025 చివరిలో భారత్‌లో జరిగే సమావేశానికి మొదట ట్రంప్ రాకపోవచ్చని అంచనా వచ్చింది, టారిఫ్ టెన్షన్ల కారణంగా. కానీ, ఇటీవలి అభివృద్ధి ఆశావాదాన్ని ఇస్తోంది. అమెరికా అధికారులు ట్రంప్ వస్తారని నిర్ధారించారు, మోదీతో ఫోన్ కాల్ జరిగే అవకాశం ఉంది. ఇక్కడ ముఖ్యమైనది సెనేట్ కన్ఫర్మేషన్ హియరింగ్‌లో అమెరికా రాయబారి అభ్యర్థి సెర్జియో గోర్ వ్యాఖ్యలు. ఆయన చెప్పినట్లు, 'క్వాడ్ చాలా ముఖ్యం, ట్రంప్ దీనికి పూర్తి కమిట్‌మెంట్ చూపిస్తారు.' ఇది ట్రంప్ స్వర మార్పును సూచిస్తుంది. మొదట భారత్‌ను ఉపేక్షించాలని భావించారు, కానీ ఇప్పుడు చైనాను అదుపు చేయడానికి భారత్ అవసరమని గుర్తించారు. వియత్నాం లేదా కొరియా వంటి దేశాలు చైనా ఆధిపత్యాన్ని సవాలు చేయలేవు, కానీ భారత్ ఉన్న క్వాడ్ బలమైనది. టారిఫ్‌లు భారత్‌ను బెదరపరచలేదు, కానీ అమెరికా భారత్‌ను కోల్పోతే చైనాకు లాభం. మొత్తంగా, ఈ సంఘటనలు అమెరికా?భారత సంబంధాల్లో మార్పును చూపిస్తాయి. ట్రంప్ మొదట బెదిరింపులతో ముందుకు వెళ్లారు, కానీ భారత్ దౌత్యం ? మోదీ యొక్క పట్టుదల మరియు వ్యూహం ? దాన్ని తిప్పికొట్టింది. టారిఫ్‌లు భారత్‌కు నష్టం కలిగించినప్పటికీ, అవి అమెరికాకు ఎక్కువ హాని చేశాయి. క్వాడ్ వంటి వేదికలు భారత్ స్థానాన్ని బలోపేతం చేశాయి.

# కొడుకు, కూతురు మధ్య విజయమ్మ

కడప, సెప్టెంబర్ 16, **భారతశక్తి ప్రతినిధి)**
విజయమ్మ దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి సతీమణిగా ఉమ్మడి రాష్ట్రానికి సుపరిచితం. భర్త ఉన్నంతవరకు రాజకీయాల కోసం మాట్లాడలేదు విజయమ్మ. భర్త ఏనాడైతే మరణించారో నాటి నుంచి ఆమె బయటకు వచ్చారు. ముందుగా కుమారుడి కోసం మాట్లాడారు.



కాంగ్రెస్ పార్టీని అభ్యర్థించారు. తన అభ్యర్థనను తిరస్కరించడంతో వ్యతిరేకించారు. జగన్మోహన్ రెడ్డి పార్టీకి అన్నీ తానై వ్యవహరించారు. చివరకు ఆ పార్టీ అభ్యర్థిగా ఎంపీగా పోటీ చేశారు. పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ఊరు వాడ ప్రచారం కూడా చేశారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత అదే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దూరమయ్యారు. తన అన్న జగన్మోహన్ రెడ్డికి అండగా ఉంటూ వచ్చిన షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడంతో.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు విజయమ్మ. తర్వాత షర్మిలకు అండగా నిలిచారు. అదే షర్మిల ఏపీ రాజకీయాల కు రావడంతో విజయమ్మ ప్రేక్షక పాత్రకు పరిమితమయ్యారు. అయితే ఆ కుటుంబంలో తలెత్తింది రాజకీయ విభేదం కాదు.. వ్యక్తిగత ఆస్తి వివాదాల్లో మాత్రమే వారి మధ్య విభేదాలు రాజకీయ వైరానికి దారితీసాయని తాజా పరిస్థితులు తెలుస్తున్నాయి. సరస్వతి పవర్ ఇండస్ట్రీకి సంబంధించిన భూముల విషయంలో కోర్టు వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఆమె చెన్నై నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ ను ఆశ్రయించారు. అయితే తన కుమారుడు జగన్మోహన్ రెడ్డి రాజకీయ మైలేజీ కోసమే ఇదంతా చేస్తున్నారని ఆరోపించడం విశేషం. చెల్లెలు షర్మిల తో ఆయనకు రాజకీయ కలహాలను పరిష్కరించుకునేందుకే.. జగన్మోహన్ రెడ్డి ఎన్సీఎల్టీ హైదరాబాద్ బెంచ్ లో పిటిషన్ దాఖలు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. సరస్వతీ పవర్ లిమిటెడ్ లో వాటాల బదలాయింపు, రిజిస్టర్ లో వాటాదారుల పేర్లు మార్పుపై ఎన్సీఎల్టీ హైదరాబాదులో ఇదివరకే జగన్ పిటిషన్ దాఖలు చేయడం చేశారు. అయితే తాజాగా విజయమ్మ మాత్రం.. ఆ ఇద్దరూ తన పిల్లలు కావడంతో వారి రాజకీయ గొడవల్లో చిక్కుకున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ వివాదానికి కార్పొరేట్ రంగు పులిమి జగన్ తన రాజకీయ మైలేజీకి వాడుకోవడం విచారకరమని వాపోయారు. గిఫ్ట్ డీడ్ లు కుటుంబ సభ్యుల మధ్య జరిగిన ఒప్పందం అని.. చట్ట ప్రకారం దానికి ప్రాధాన్యమవుతుందన్నారు. కానీ జగన్మోహన్ రెడ్డి మాత్రం ప్రైవేటు, వ్యక్తిగత వివాదాలకు కార్పొరేట్ రంగు అద్ది తమ ప్రతిష్టను దెబ్బతీసే అంశమని విజయమ్మ పేర్కొన్నారు. ప్రస్తుతం విజయమ్మ విచిత్ర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఒకవైపు కుమార్తెకు పూర్తిస్థాయిలో అండగా నిలుస్తున్నారు. అలాగని కుమారుడు జగన్మోహన్ రెడ్డిని విడిచి పెట్టుకోవడానికి ఇష్టపడడం లేదు. అయితే ఆమె పరిస్థితిని చూసి చాలామంది ఆశ్చర్యపోతున్నారు. చెన్నై కోర్టులో తాజాగా ఆమె చేసిన ఆరోపణలు చూస్తుంటే జగన్మోహన్ రెడ్డిని పూర్తిగా తప్పు పట్టినట్టు కనిపిస్తున్నారు. కానీ అదే జగన్మోహన్ రెడ్డితో కుటుంబ వేదికలు పంచుకుంటున్నారు. దగ్గరకు తీసుకుని ఆత్మీయతను పంచుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం షర్మిల తో కలిసి నడుస్తున్నారు. ఆమెకు సింహభాగం ప్రయోజనాలు కల్పించాలని కోరుతున్నారు. ఒక్కటి మాత్రం నిజం.. పిల్లల మూలంగా విజయమ్మ పూర్తిగా డిఫెన్స్ లో పడ్డారు. ఏం చెయ్యాలో పాలు పోలేని స్థితిలో ఉన్నారు.

# మొన్న రష్యా ఆయిల్.. ఇప్పుడు మొక్కజొన్న..

## వాణిజ్య చర్చల వేళ భారత్‌పై అమెరికా ఒత్తిడి తంత్రం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 **భారతశక్తి ప్రతినిధి))**
ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాలు బాంబులు విసిరిన అగ్రరాజ్యం... ఆ తర్వాత వాణిజ్య భాగస్వామ్య దేశాలతో చర్చలు జరిపి.. ఒప్పందాలు చేసుకునేలా ముందుకెళ్తోంది. కానీ, భారత్‌పై 25 శాతం అదనపు సుంకాలు, రష్యా నుంచి ఆయిల్ దిగుమతులు చేసుకుంటోందన్న సాకుతో మరో 25 శాతం అదనపు సుంకాలు విధించారు. ఈ క్రమంలో ఇరు దేశాల మధ్య వాణిజ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది. అయితే, ఆరో విడత చర్చలు ప్రారంభం వేళ అమెరికా మరో ఒత్తిడి తంత్రానికి తెరతీసింది. అసంపూర్తిగా నిలిచిపోయిన భారత్- అమెరికా వాణిజ్య చర్చలు పునఃప్రారంభానికి ముందు అగ్రరాజ్యం తన ఒత్తిడి తంత్రాన్ని కొనసాగిస్తోంది. అమెరికాలో పండిన గుప్పెడు మొక్కజొన్నను కూడా భారత్ కొనుగోలుచేయడం లేదని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ విమర్శించారు. తమ మొక్కజొన్నను కొనుగోలు చేయకపోతే భారత్ తమ మార్కెట్ యాక్సెస్ కోల్పోతుందని ఆక్సియోస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో లుట్నిక్ హెచ్చరించారు. అంతేకాదు, భారత్ సుంకాలను తగ్గించకపోతే 'కష్టకాలం' ఎదురవుతుందని బెదిరింపులకు దిగారు. అయితే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం భారత్‌పై ఒత్తిడి తగ్గించే ప్రయత్నం చేస్తుండటం గమనార్హం. భారత్-అమెరికా సంబంధాలు వన్-వేలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. 'మాకు వస్తువులు అమ్మి వాళ్లు ప్రయోజనం పొందుతున్నారు.. మా ఆర్థిక వ్యవస్థను వాళ్లు (భారత్) స్తంభింపజేస్తున్నారు.. వారు మా మార్కెట్‌లోకి ప్రవేశించి, విస్తృతంగా ప్రయోజనం పొందడానికి మేము ద్వారాలు తెరిచినప్పుడు వారు మాకు అమ్ముతారు' అని పేర్కొన్నారు. '140 కోట్ల మంది ప్రజలు ఉన్నారని చెప్పుకునే భారత్.. అమెరికాలో పండిన గంపెడు మొక్కజొన్న గింజలను ఎందుకు కొనడం లేదు? వాళ్లు మనకు అన్నీ అమ్మేస్తారు, మన మొక్కజొన్న కొనరని మనం అనుకోవడం తప్పా? వాళ్లు ప్రతిదానిపైనా సుంకాలు విధిస్తారు' అని విమర్శించారు. 'సుంకాలను తగ్గించాలని . మీ సుంకాలను తగ్గించండి, మేము మీతో ఎలా ప్రవర్తిస్తామో అలాగే మాతో కూడా వ్యవహరించండి.. అని భారత్‌ను అధ్యక్షుడు ట్రంప్ కోరుతున్నారు' ట్రంప్ యంత్రాంగం ఏళ్లుగా తప్పులను సరిదిద్దుకుంది... కాబట్టి మేము దీన్ని పరిష్కరించే వరకు వేరే విధంగా సుంకాన్ని కోరుకుంటున్నాం' అని ఆయన అన్నారు. 'అది అధ్యక్షుడి నమూనా, మీరు దానిని అంగీకరించాలి లేదా ప్రపంచంలోని గొప్ప వినియోగదారుడితో వ్యాపారం చేయడం మీకు కష్టమవుతుంది' అని పేర్కొన్నారు. అయితే, కొద్ది నెలలుగా భారత్-అమెరికాలు వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే దశలో ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెబుతూనే.. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తుందనే సాకుతో 50 శాతం సుంకాలను విధించారు. దీంతో కొన్ని దశాబ్దాలుగా ఇరు దేశాల మధ్య కొనసాగుతోన్న బలమైన సంబంధాలు ప్రశ్నార్థకంగా మారాయి. భారత్‌పై తొలుత 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్.. తర్వాత రష్యా ఆయిల్ పేరు చెప్పి మరో 25 శాతం కలిపి 50 శాతానికి పెంచారు. బ్రెజిల్ తర్వాత అత్యధికంగా భారత్‌పైనే టారీఫ్‌లు విధించింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ.. ఉక్రెయిన్‌తో యుద్ధానికి మాస్కోకు నిధులు సమకూరుస్తోందని డొనాల్డ్ ట్రంప్, అతడి యంత్రాంగం ఆరోపిస్తోంది. అయితే, ఈ ఆరోపణలను భారత్ ఖండించింది.

ట్రంప్ సుంకాలు అన్యాయమైనవి, అనవసరమైనవి, అనూహ్యమైనవిగా అభివర్ణించింది. రష్యా క్రూడ్ ఆయిల్ కొనుగోళ్లను సమర్థించుకున్న భారత్, తన ఇంధన కొనుగోలు జాతీయ ప్రయోజనాలు, మార్కెట్ పరిస్థితుల ఆధారంగా నడుస్తుందని పునరుద్ఘాటిస్తోంది. చైనాతో వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఏడాది అమెరికా రైతాంగం ఇబ్బందులు ఎదుర్కోకతప్పదని అమెరికన్ అగ్రికల్చరల్ సంస్థలు హెచ్చరించినట్టు బీబీసీ నివేదించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతోంది. దీంతో చైనా నుంచి అమెరికా పంట ఉత్పత్తుల కొనుగోళ్లు దారుణంగా పడిపోయాయి. తత్ఫలితంగా అమెరికా రైతులు, చిన్న వ్యాపారాలు దివాళా తీశాయి. బ్లూమ్‌బర్గ్ జూలైలో సేకరించిన డేటా ప్రకారం, ఈ సంఖ్య ఐదేళ్ల గరిష్టానికి చేరుకుంది. వాణిజ్య చర్చలు కొనసాగుతున్నప్పటికీ టెక్నాలజీ యాక్సెస్, సుంకాలు, అరుదైన ఖనిజాల ఎగుమతుల వంటి అంశాల్లో అనే సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ వాణిజ్య చర్చలను ముందుకు తీసుకెళ్తున్న తరుణంలో అమెరికా రైతులకు ట్రంప్ యంత్రాంగం భారత్‌ను కొత్త మార్కెట్‌గా సృష్టించే ప్రయత్నం చేస్తోందని కనిపిస్తోంది.

# భారత్ నుంచి డీజిల్ దిగుమతులపై ఉక్రెయిన్ ఆంక్షలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 **(భారతశక్తి ప్రతినిధి)**
భారతదేశం నుంచి చేసుకుంటున్న డీజిల్ దిగుమతులపై ఆంక్షలు విధించాలని ఉక్రెయిన్ నిర్ణయించింది, అక్టోబర్ 1 నుంచి ఇది అమలులోకి రానుంది. రష్యా నుంచి ముడి చమురుపై ఆధారపడటంపై ఆందోళనలు చెలరేగాయి. ఉక్రేనియా ఎనర్జీ కన్సల్టెన్సీ ఎన్‌కోర్ ప్రకారం.. ఉక్రేనియా భద్రతా సంస్థలు భారతదేశం నుంచి వచ్చే ప్రతి డీజిల్ దిగుమతిని రష్యా మూలమైన భాగాలను గుర్తించడానికి ప్రయోగశాల పరీక్షలు చేపట్టాలని ఆదేశించాయని కన్సల్టెన్సీ పేర్కొంది., శక్తి కన్సల్టెన్సీ ం-95 గతంలో ఈ వేసవిలో ఒక ప్రధాన ఉక్రేనియా చమురు శుద్ధి కర్మాగారం మూసివేయడంతో ఇంధన వ్యాపారులు విదేశీ సరఫరాదారులపై ఆధారపడవలసి వచ్చిందని పేర్కొంది. రష్యా ముడి చమురును గణనీయమైన పరిమాణంలో శుద్ధి చేసే దేశాల్లో భారతదేశం ఒకటి. ం-95 ప్రకారం, ఉక్రెయిన్ రక్షణ మంత్రిత్వ శాఖ కూడా ఒకానొక సమయంలో భారత్ నుంచి దిగుమతి చేసుకునే డీజిల్‌ను సేకరించింది. ఎందుకంటే ఇది సోవియట్ అనంతర సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు గుర్తించారు. ఎన్‌కోర్ గణాంకాల ప్రకారం, ఒక్క ఆగస్టులోనే ఉక్రెయిన్ దేశం భారత్ నుండి 119,000 టన్నుల డీజిల్‌ను దిగుమతి చేసుకుంది.
ఆ నెలలో మొత్తం డీజిల్ దిగుమతుల్లో ఇది 18 శాతం వాటా అని రాయిటర్స్ నివేదించింది. 2022లో రష్యా పూర్తిస్థాయి దాడిని ప్రారంభించే ముందు, పరిమిత దేశీయ ఉత్పత్తిని భర్తీ చేయడానికి ఉక్రెయిన్ బెలారస్, రష్యా నుంచి ముడి చమురు, ఇంధన దిగుమతులపై ఎక్కువగా ఆధారపడింది. అయితే, యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఉక్రెయిన్ ప్రధానంగా పశ్చిమ ఐరోపాలోని దేశాలపై ఆధార పడుతోంది. ం-95 ప్రకారం, 2025 మొదటి అర్ధభాగంలో ఉక్రెయిన్‌లోకి మొత్తం డీజిల్ దిగుమతులు 13 శాతం తగ్గి, 2.74 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరుకున్నాయి. ఉక్రేనియా చమురు శుద్ధి కర్మాగారాలు, నిల్వ సౌకర్యాలను లక్ష్యంగా చేసుకుని రష్యన్ డ్రోన్ దాడులు, క్షిపణి దాడులు కొనసాగుతున్న క్రమంలో ఈ ఆంక్షలు వచ్చాయి. ఉక్రేనియా డ్రోన్లు రష్యా వాయువ్య ప్రాంతంలోని కిరిషి చమురు శుద్ధి కర్మాగారంపై ఆదివారం నాడు దాడి చేశాయి. ఇది దేశంలోనే అతి రిఫైనరీ. డ్రోన్ దాడులతో మంటలు చెలరేగాయని ఫ్రాన్స్ 24 నివేదించింది. సుర్గుట్నెఫ్టెగాజ్ లోని కిరిషినెఫ్టోర్గ్సిన్తేజ్ రిఫైనరీ రష్యాలోని అతిపెద్ద రెండు రిఫైనరీలలో ఒకటి. ఉక్రేనియా డోన్లు దాన్ని లక్ష్యంగా చేసుకున్నాయని రష్యన్ అధికారులు కూడా ధృవీకరించారు. ముడిచమురు శుద్ధి కర్మాగారంపై దాడి చేసినట్లు ఉక్రెయిన్ డ్రోన్ కమాండ్ పేర్కొంది. విజయవంతమైన దాడిని నిర్వహించామని స్పష్టం చేసింది.

# నేడు తెలంగాణ విమోచన దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని ) **(భారతశక్తి ప్రతినిధి)**
అది పరాయి పాలన నుంచి విముక్తి పొందిన దినం సొంతగడ్డపైనే పరాయివారిగా బతుకులీడుస్తున్న ప్రజలు జరిపిన యుద్ధం భూస్వాముల దౌర్జన్యాలు, నిజాం రాజరిక దుర్మార్గ వ్యవస్థ, రజాకర్ల అమానుషాలు తెలంగాణను అణువణువునా పట్టిపీడించిన అన్ని దుర్మార్గాల నుంచి హైదరాబాద్ సంస్థానం విముక్తి పొందడానికి జరిగిన మహా సంగ్రామమది భారతదేశంలో హైదరాబాద్ సంస్థాన విలీనం చరిత్రాత్మకమైన ఉదంతం నిజాం నవాబు తోకముడిచి భారత్‌కు లొంగిపోయిన సందర్భం అసలు సెప్టెంబర్ 17న ఏం జరిగింది? హైదరాబాద్ సంస్థానం భారత్‌లో ఎలా విలీనమైంది? ఓసారి గుర్తు చేసుకుందాం. నిజాం కబంధ హస్తాల నుండి హైదరబాదు సంస్థానం విముక్తిపొందిన రోజును తెలంగాణ విమోచన లేదా విలీన దినం గా పాటిస్తారు. 1947 ఆగస్టు 15న బ్రిటిష్ వారి పాలన అంతమై భారతదేశమంతటా స్వాతంత్ర్య సంబరాలు జరుపుకున్నారు.. కానీ దేశం నడి బొడ్డున ఉన్న హైదరాబాద్ సంస్థాన ప్రజలకు ఆ అదృష్టం లేకుండా పోయింది. అప్పటి వరకూ బ్రిటిష్ వారికి సామంతుడిగా ఉన్న హైదరాబాద్ నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ తాను కూడా స్వతంత్రుడిని అయ్యానని ప్రకటించుకున్నాడు. హైదరాబాద్ అటు ఇండియాలో, ఇటు పాకిస్తాన్లో కలవదని స్వతంత్రంగా ఉంటుందని ప్రకటించాడు
. కానీ సంస్థానంలోని ప్రజలు తాము భారతదేశంలో కలవాలని కోరుకున్నారు. ఆనాటి హైదరాబాద్ సంస్థానంలోని తెలంగాణ, మరాఠ్వాడా, కర్ణాటక ప్రాంతాల్లో ఇంకా ఫ్యూడల్ పాలన కొనసాగుతోంది. ఒకవైపు దేశ్ముఖ్, జాగీర్దార్, దొరల వెట్టి చాకిరిలో గ్రామీణ ప్రజానీకం మగ్గిపోతుంటే, మరోవైపు నిజాం అండతో రజాకార్లు చెలరేగిపోయారు.. ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. గ్రామాలపై పడి ప్రజలను దోచుకొని, హత్యాకాండను కొనసాగించారు. నిజాం ప్రోద్బలంతో రజాకార్ల నాయకుడు కాశీం రజ్వీ ఢిల్లీ ఎర్రకోటపై అసఫ్ జాహీ పతాకాన్ని గురేస్తానని విర్ర వీగాడు..

# పార్లమెంట్ లో తెలుగు తమ్ముళ్లు సూపర్...

విజయవాడ, సెప్టెంబర్ 16 **(భారతశక్తి ప్రతినిధి)**
చట్టసభల్లో ప్రజల సమస్యలను ప్రస్తావించడం ప్రజాప్రతినిధుల విధి. కానీ దురదృష్టవశాత్తు ఏపీలో మాత్రం ఆ పరిస్థితి లేదు. అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తూ విపక్షాలు నిర్ణయం తీసుకుంటు న్నాయి. దీంతో పాలకపక్షాలే ప్రతిపక్షాలుగా మారి చర్చలు చేస్తున్నాయి. ఇటువంటి తరుణంలో దేశ రాజధాని ఢిల్లీలో తెలుగు వాణి బలంగా వినిపిస్తోంది. పార్లమెంట్ సమావేశాల్లో తెలుగు ఎంపీలు సమస్యలను సంధిస్తున్నారు. తమ గళం వినిపిస్తున్నారు. గత ఏడాది కాలంలో జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో ఏపీ ఎంపీలు మొత్తం 1576 ప్రశ్నలు లేవనెత్తారు. అందులో అత్యధికంగా టిడిపి ఎంపీలు 1081 ప్రశ్నలను లేవనెత్తగా.. ఆ తరువాత స్థానం మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంది. 267 ప్రశ్నలతో ఆ పార్టీకి చెందిన ఎంపీలు నిలిచారు. పాలిటిక్స్ ఫర్ ఇంపాక్ట్ తన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించిందిఏపీలో తెలుగుదేశం పార్టీకి 16 మంది లోక్సభ సభ్యులు ఉన్నారు. బిజెపికి ఇద్దరు, జనసేనకు ఒకరు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నలుగురు ఉన్నారు. ఇక రాజ్యసభలో తెలుగుదేశం పార్టీకి ఇద్దరు, బిజెపికి ఇద్దరు, జనసేనకు ఒకరు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఏడుగురు ఉన్నారు. గత ఏడాది కాలంలో ఏపీకి చెందిన ఎంపీలు సగటున 71.6 ప్రశ్నలను లేవనెత్తారు. జాతీయ సగటు కంటే ఈ మొత్తం ఎక్కువ కావడం విశేషం. ఈ విషయంలో జాతీయ సగటు 46.8 గా ఉంది. ప్రశ్నల సగటు పరంగా కూడా టిడిపి ముందంజలో ఉంది. టిడిపి ఎంపీలు 77.2 శాతం ప్రశ్నలు అడిగితే.. బిజెపి ఎంపీలు 67.0, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు 66.8, జనసేన 47.0 ప్రశ్నలు లేవనెత్తారు. మరోవైపు ఏపీ ఎంపీలు 20017 పార్లమెంట్ చర్చల్లో పాల్గొన్నారు. టిడిపికి చెందిన 14 మంది ఎంపీలు 125 డిబేట్లో పాల్గొన్నారు. వైసిపి నలుగురు ఎంపీలు 42 డిబేట్లో, బిజెపికి చెందిన ఇద్దరు ఎంపీలు 22 డిబేట్ లలో పాల్గొన్నారని సదరు ఇంపాక్ట్ సంస్థ నివేదికలో తెలిపింది. మరోవైపు హాజరు శాతంలో సైతం ఏపీ ఎంపీలు( ఉత్తమ పనితీరు కనబరిచారు. సభ్యులు అడిగిన ప్రతి ప్రశ్నకు ఒక పాయింట్.. పాల్గొన్న ప్రతి డిబేట్ కు మూడు పాయింట్లు, హాజరుకు 0.5 పాయింట్లు కేటాయించారు. ఈ లెక్కన టిడిపి పార్లమెంటరీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అగ్రస్థానంలో నిలిచారు. వైసీపీ ఎంపీ మద్దెల గురుమూర్తి రెండో స్థానంలో ఉండగా.. జనసేన ఎంపీ బాలసౌరి మూడవ స్థానంలో నిలిచారు. జీఎం హరీష్ బాలయోగి, కలిశెట్టి అప్పలనాయుడు, కృష్ణ ప్రసాద్ ఆ తర్వాత స్థానాల్లో నిలిచారు. అత్యధిక ప్రశ్నలు లేవనెత్తిన ఎంపీగా విజయనగరం టిడిపి ఎంపీ అప్పలనాయుడు తొలి స్థానంలో ఉన్నారు. ఆయన ఒక్కరే పార్లమెంట్ సమావేశాల్లో 89 ప్రశ్నలను అడిగారు.

# మాజీ సింగిల్ విండో డైరెక్టర్ బండి భాగ్యమ్మ మృతి పలువురు నేతల సంతాపం

నందికొట్కూరు : సెప్టెంబర్ 16 (భారతశక్తి ప్రతినిధి)
పగిడ్యాల మండలం నెహ్రూనగర్ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు బండి జయరాజు మాతృమూర్తి బండి భాగ్యమ్మ (82) సోమవారం రాత్రి మృతి చెందారు. ఈమె గతంలో పగిడ్యాల వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ పదవిలో ఉన్నారు. ఈమె కుమారుడు బండి జయరాజు 2019 అసెంబ్లీ ఎన్నికలలో టీడీపీ తరుపున పోటీ చేశారు. కోడలు బండి రమణమ్మ గ్రామ సర్పంచు గా, శ్రీశైలం దేవస్థానం కమిటీ సభ్యులు గా పనిచేశారు. వీరి కుటుంబ మొదటి నుంచి టీడీపీ నాయకులు గౌరు వెంకటరెడ్డి, మాండ్ర శివానంద రెడ్డి లకు విధేయులుగా ఉన్నారు. విషయం తెలుసుకున్న నందికొట్కూరు నియోజకవర్గం శాసనసభ్యులు గిత్త జయసూర్య పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో లోకానంద రెడ్డి గారు, సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి, బాబు రెడ్డి,సున్నంపల్లి శ్రీనివాసులు మోహన్, రామిరెడ్డి, రంగస్వామి, కన్వీనర్ మోహన్ రెడ్డి, క్లస్టర్ గిరిశ్వర్ రెడ్డి,పిక్కిలి శ్రీనివాసులు, హేమసుందర్ రాజు, జిన్ను రామిరెడ్డి, తదితరులు నివాళ్ళు అర్పించి కుటుంబాన్ని పరామర్శించారు.

# ఏలూరు నగరంలో శక్తి బృందాల విజిబుల్ పెట్రోలింగ్

ఏలూరు సెప్టెంబర్ 16 (భారతశక్తి ప్రతినిధి)
విద్యార్థినుల భద్రత శక్తి టీం బాధ్యతని ఏలూరు జిల్లా శక్తి టీం సిబ్బంది తెలిపారు ఏలూరు నగరంలో కళాశాలలో వదిలే సమయంలో శక్తి టీం హాస్టల్ విద్యార్థులను వారి వారి వసతి గృహాలకు వెళ్లే వరకు విజిబుల్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు ఈ పెట్రోలింగ్ డ్రోన్ విజువల్స్ ద్వారా చిత్రీకరించారు. ఈ సందర్భంగా శక్తి టీం మాట్లాడుతూ ప్రతిరోజు ఈ విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నట్లు వారు స్పష్టం చేశారు.

# విధుల్లోనే మృతి



రంగారెడ్డి సెప్టెంబర్ 16 (భారతశక్తి ప్రతినిధి)
మియాపూర్ డిపోలో కండక్టర్ గా పనిచేస్తున్న పండరి మంగళవారం ఉదయం డ్యూటీ కి వచ్చిన సమయంలో వాష్ రూమ్ కు వెళ్లి అక్కడే కుప్పకూలి మృతి చెందాడు. హార్ట్ ఎటాక్ వల్లే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దాంతో డిపోలో విషాదం నెలకొంది. తమతో మాట్లాడి వాష్ రూమ్ కు వెళ్ళొస్తా అని చెప్పిన పండరి నిమిషాల్లోనే విగతజీవిగా మారడంతో తోటి ఉద్యోగులు షాక్ కు గురయ్యారు. యువకుడైన పండరి కళ్ళముందే మృత్యువాత పడటం చూసి సీనియర్ ఉద్యోగులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు ....!

# విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్య అందించాలి

## జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



జగిత్యాల, సెప్టెంబర్ 16 (భారతశక్తి ప్రతినిధి)
విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్య అందించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు.పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ఈ సంధర్భంగా విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకొని ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచిందని ప్రస్తుతం ప్రతి రోజు అందించే మెనూ ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.డైట్ మెనూ ను పక్కాగా అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు..చదువుల్లో వెనకబడిన విద్యార్థులకు స్పెషల్ క్లాస్ లు తీసుకోవాలని సూచించారు.ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రంలో విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ,అత్యదిక నిధులు మంజూరుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.మైనార్టీ గురుకుల పాఠశాలను అనేక సార్లు సందర్శించడం జరిగిందని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాస్మొటిక్,డైట్ చార్జీలు 40 శాతం పెంచడం జరిగిందని తెలిపారు.గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్ లు 100 శాతం పూర్తి అయ్యేవిదంగా అధ్యాపకులు చొరవ తీసుకోవాలని తెలిపారు.పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి వచ్చే ప్రయత్నం చేస్తానని చెప్పారు.పాఠశాలలో ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని,ప్రభుత్వం,ముఖ్యమంతి,మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.చల్గల్ లో 200 కోట్ల తో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్ మంజూరు చేయటం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లు గిరి నాగభూషణం,అడువల జ్యోతి లక్ష్మణ్,మైనార్టీ నాయకులు అబ్దుల్ ఖాదర్ ముజా హిద్, మాజీ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు దుమాల రాజ్ కుమార్,ఇంచార్జీ ప్రిన్సిపాల్ రవి, ముకీమ్, నాజీమ్,పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

========================================

# ఆర్డర్ పెట్టిన బిర్యానీలో బొద్దింక ప్రత్యక్షం


## కంగు తిన్న బిర్యాని కస్టమర్

ఖమ్మం.. సెప్టెంబర్ 16 (భారతశక్తి ప్రతినిధి)
బిర్యాని తినేందుకు ఓ వ్యక్తి ఆన్ లైన్లో ఓ హోటల్ కు ఆర్డర్ పెట్టగా బిర్యాని డెలివరీ చేసేది ఇంకో హోటల్ నుంచి, తీరా చూస్తే ఆర్డర్ పెట్టిన బిర్యానీ లో చనిపోయిన బొద్దింక ప్రత్యక్షం కాగా ఇదేమిటని ప్రశ్నించగా సమాధానం చెప్పని హోటల్ యాజమాన్యం.. అధికారుల పర్యవేక్షణ లోపం వలనే ఇలాంటివి జరుగుతున్నాయి అని పట్టణ ప్రజలు ఆరోపించారు.

# భారతదేశంలో సామాజిక వివక్షతను, బ్రాహ్మణుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా తన జీవితకాలం మొత్తం పోరాటం చేసిన మహనీయుడు మన పెరియార్ రామస్వామి

## -నేడు ఆయన 147వ జయంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని ) (భారతశక్తి ప్రతినిధి)
భారతీయ సమాజంలో కుల వ్యవస్థ నరనరాల్లో జీర్ణించుకొని అన్ని రంగాల్లో అసమానతలు పెరగడానికి కారణమైంది. ఈ అసమానతలను రూపుమాపడానికి సాహు మహరాజ్, నారాయణ గురు, రామస్వామి పెరియర్ వంటి సామాజిక విప్లవవీరులు చేసిన త్యాగఫలితంగా భారతదేశం స్వేచ్ఛా, సమానత్వం, సామాజిక, ఆర్థిక, రాజకీయాలు పునాదులుగా ఏర్పడిన భారత రాజ్యాంగాన్ని అనుసరిస్తూనే సమసమాజ నిర్మాణానికి దోహదం చేశారు. దక్షిణ భారతదేశ ప్రజలచే ముఖ్యంగా తమిళనాడు ప్రజలచే పెరియర్‌గా తాన్ తై పెరియర్‌గా ఆత్మీయంగా పిలవబడే ఈరోడ్ వెంకట రామస్వామి 1879లో ఈరోడ్‌లో ఇదే రోజు జన్మించారు. సంఘ సంస్కర్తగా, హేతువాదిగా, ఆత్మగౌరవ ఉద్యమ నిర్మాతగా ద్రావిడ ఉద్యమ సారథిగా ఆయన చేసిన సేవలకు గుర్తుగా ప్రజలు ఆయనను పెరియర్‌గా పిలుచుకునేవారు. 'పెరియర్' అంటే 'పెద్ద మనిషి' అని అర్థం.సమాజంలో ఆయన కుల, మత, వర్గ ఆధిపత్యాలపై తిరుగుబాటు చేశాడు. కుల, మత రహిత సమసమాజం కావాలని ఆయన ఆకాంక్ష. కానీ నిన్నగాక మొన్న పరువు హత్యలు ఈ దేశంలో జరిగిన తరుణంలో పెరియర్ జయంతిని నిర్వహించుకుంటున్నామంటే ఆయన ఆకాంక్ష ఇంకా అలాగే ఉంది. మహిళలకు సమాన హక్కులు కావాలని ఆయన కాంక్షించారు. పెరియర్ ముఖ్యంగా సమాజంలో ప్రధానంగా నెలకొని ఉన్న బ్రాహ్మణ ఆధిప త్యాన్ని ప్రశ్నించారు. దక్షిణ భారతానికి చెందిన ద్రావి డులపై




ఉత్తరానికి చెందిన బ్రాహ్మణ ఆధిపత్యాన్ని సహి ంచేది లేదని స్వీయభావన ఉద్యమాన్ని నిర్మించారు. అగ్రవర్ణాలు తమ ఆధిప త్యాన్ని కొనసాగిం చడం కోసమే ఈ దేవుండ్లు, గుడులు, గోపురాలను నిర్మి స్తూ పనికిమాలిన పురాణా లను సృష్టించారని ప్రచారో ధ్యమాన్ని సాగించడం ద్వారా ఆయన ప్రముఖ హేతువాదిగా పేరు పొందారు. హేతువాదం, ఆత్మగౌరవం, స్త్రీ హక్కులు, కుల నిర్మూలన కోసం పెరియర్ చేసిన పోరాటం అప్పటికీ, ఇప్పటికీ ఒక చరిత్రగా మిగిలిపోతుంది. మూల-ద్రావిడ వాసులైన బ్రాహ్మణేతరులను, భార తదేశానికి చెందిన బ్రాహ్మ ణులు దోపిడీ చేయడాన్ని అణివేయడాన్ని వ్యతిరేకించారు. తమిళ సమాజాన్ని విప్లవ మార్గంలో నడిపి కుల వివక్షతను తొలగిం చడానికి తీవ్రంగా కృషి చేసిన వ్యక్తిగా తమిళ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి పెరియర్ రామస్వామి. అందుకే ఆయ నను ఆధునిక కాల ప్రవ క్తగా, ఆగేయ ఆసియా సోక్రటిస్‌గా, సామాజిక విప్లవ పితామహుడిగా, అజ్ఞానం, అంధ విశ్వాసాలు, అసంబద్ధమైన అచిర వ్యవహారాల ను వ్యతిరేకించే వారిగా యునెస్కో అభివర్ణించింది. "దేవుడు లేదు, దేవుడు లేదూ, అసలు దేవుడే లేడు" అనే నినాదంతో పెరియర్ సాగించిన ఉద్యమం ప్రధానమైనది, కుల, మత వ్యత్యాసాలు కలిగిన భారతదేశం తనకు వద్దని, కుల, మత రహితమైన భారతమే తనకు కావాలని పోరాటం చేశాడు. కుల, మతాలను రాజ్యాంగం నిషేధించినప్పుడే కుల, మత రహిత స మాజం ఏర్పడుతుందని ఆయన వాధించాడు. హిందుత్వ వాదాన్ని గట్టిగా వ్యతిరేకించారు. కాబట్టే వారికి పెరియర్ అంటే గిట్ట దం లేదు. పెరియర్ తన ఆశయాల సాధన కోసం 1939లో జస్టిస్ పార్టీ పెట్టారు. 1944లో జస్టిస్ పార్టీని 'ద్రావిడ్ దార్ కళనంగా' మార్చారు. ఈ పార్టీ సామాజికోద్యమానికే ప్రాధాన్యతని చ్చి ఎన్నికలకు దూరంగా ఉండి మరీ పోరాటం చేసింది. అంట రానితనం, కులం, వర్ణ వివక్షత తీవ్రంగా ఉన్న దేశంలో ప్రజల తో ఆత్మగౌరవాన్ని పెంపొందించడం, వారి మధ్య ఉన్న సా మాజి క ఆర్థిక సమానత్వాన్ని సాధించడం కుల వ్యవస్థను దోపిడీ మ యమైన సాంప్రదాయాలను నిర్మూలించడమే పెరియర్ ధ్యేయం. హిందూ మతం ఆపాదించిన తరతరాల బానిసత్వాన్ని వదిలించుకునేందుకు దేవుడు ఒక్కడే, మనుషులంతా ఒక్కటే అని చాటడం మంచిదని ప్రభోధించాడు. ఎప్పుడు ఆయన భావాలు, ఆలోచనలు విప్లవాత్మకమైనవిగానే ఉండేవి. దేశం కుల, మత కంపులో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో మత దురహంకారాన్ని వ్యతిరేకిస్తూ శాస్త్రీయ, హేతుబద్ధమైన జీవన విధానాన్ని అవలంభించిన రోజు ఈ రోజు. ఆత్మగౌరవ పోరాటాలు చేసిన దళితులు, స్త్రీలు, బడుగు, బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని ధారపోసి, తన చివరి శ్వాస వరకు సమసమాజం కోసం పోరాటం చేసిన సామాజిక విప్లవకారుడు పెరియర్ రామస్వామి.

# గ్యాప్ తగ్గిందా... పెరిగిందా...

కరీంనగర్, సెప్టెంబర్ 16, (భారతశక్తి ప్రతినిధి)
ఒకప్పుడు రాజకీయాలలో విమర్శలు విధానపరంగా ఉండేవి. కాలం మారుతున్న కొద్ది విమర్శలు వ్యక్తిగత జీవితాలలోకి ప్రవేశించాయి. ముఖ్యంగా తెలంగాణలో గడిచిన 10 సంవత్సరాలుగా రాజకీయాలు వ్యక్తిగత జీవితాలను టార్గెట్ చేసే విధంగా మారిపోయాయి. వ్యక్తిగత విమర్శలు చేసుకోవడంలో నాయకులు పోటీపడ్డారు. దానికి తోడు బజారు భాష ఉపయోగి ంచడంతో మరింత చులకన అయిపోయారు. వాస్తవానికి ఇటువంటి పరిణామాలే రాజకీయాలపై మరింత దారుణమైన అభిప్రాయాన్ని ప్రజలకు కలిగేలా చేశాయి.తెలంగాణలో అధికారంలో ఉన్నప్పుడు బండి సంజయ్ మీద భారత రాష్ట్ర సమితి ఎన్నో కేసులు పెట్టింది. భారత రాష్ట్ర సమితి నాయకులు అడ్డగోలుగా విమర్శలు చేశారు. వ్యక్తిగతంగా కూడా టార్గెట్ చేశారు. అప్పట్లో బండి సంజయ్ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నారు. ఆ విషయాన్ని కూడా మర్చిపోయి తెలంగాణ పోలీసులు ఆయనను అనేక సందర్భాల్లో అరెస్ట్ చేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. బండి సంజయ్ మీద కేసీఆర్ నుంచి మొదలు పెడితే కేటీఆర్ వరకు అడ్డగోలుగా మాట్లాడారు. కెసిఆర్ అయితే తల ఆరు వక్కలు అవుతుందంటూ హెచ్చరించారు. కేటీఆర్ తంబాకు నములుతాడని బండి సంజయ్ ని ఉద్దేశించి విమర్శించారు. అంతేకాదు సన్నాసిని పార్లమెంట్ సభ్యుడిగా కరీంనగర్ ప్రజలు ఎన్నుకున్నారని దెప్పి పొడిచారు. ఇటీవల కామారెడ్డి, సిరిసిల్ల ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిసిన నేపథ్యంలో కేటీఆర్, బండి సంజయ్ పరస్పరం ఎదురుపడ్డారు. ఇద్దరు ఒకరికి ఒకరు పరస్పరం నమస్కారం పెట్టుకున్నారు. కుశల ప్రశ్నలు వేసుకున్నారు.



దీంతో వీరిద్దరి మధ్య వైరం తగ్గిపోయిందని అనుకుంటే.. కేటీఆర్ బండి సంజయ్ పై పది కోట్లకు పరువు నష్టం దావా వేశారు. ఫోన్ టాపింగ్ కేసులో తనను అనవసరంగా విమర్శిస్తున్నారని అందులో కేటీఆర్ పేర్కొన్నారు.కేటీఆర్ నుంచి లీగల్ నోటీసులు అందుకున్న తర్వాత బండి సంజయ్ స్పందించారు. తను లవంగాలు తింటే కూడా తంబాకు తింటున్నారు అన్నట్టుగా విమర్శించారని.. అడ్డగోలుగా మాట్లాడారని.. అసలు వ్యక్తిగత జీవితాన్ని కూడా టార్గెట్ చేసి విమర్శించారని.. అలాంటి వాటికి తాను ఎన్ని లీగల్ నోటీసులు పంపించాలని బండి సంజయ్ ప్రశ్నించారు. ఇటువంటి లీగల్ నోటీసులకు తాను భయపడబోనని.. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తనమీద ఎన్నో కేసులు పెట్టిందని.. ఆ కేసులకు తాను ఎన్నడూ భయపడలేదని బండి సంజయ్ పేర్కొన్నారు. అంతేకాదు తాను రాజకీయాల్లోకి స్వతహాగా వచ్చానని.. స్వతహాగానే ఎదిగానని సంజయ్ వెల్లడించారు. కేటీఆర్ మాదిరిగా తండ్రి పేరు చెప్పుకొని తాను రాజకీయాల్లోకి రాలేదని సంజయ్ క్లారిటీ ఇచ్చారు.

# పేకాటలో దొరికిన వ్యక్తి మృతి బంధువుల అందోళన

అనంతపురం సెప్టెంబర్ 16, (భారతశక్తి ప్రతినిధి)
పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడ్డ నాగలగుడ్డం తండాకు చెందిన రామకృష్ణ మృతి చెందాడు. సింగనమల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహంతో సింగనమల పోలీస్ స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యులు ధర్నాకు దిగారు. సోమవారం నాడు పేకాట స్థావరాలపై దాడిలో రామకృష్ణ దొరికిపోయాడు. మంగళవారం ఉదయం పోలీస్ స్టేషన్కు పిలిపించి కొట్టారంటూ బంధువుల ఆరోపణ. మృతదేహాన్ని స్ట్రెచర్పై పెట్టుకుని పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు కుటుంబ సభ్యులు. "పోలీసుల కొట్టడం వల్లే మృతి" అంటూ బంధువుల ఆరోపణలు. మృతుని స్వగ్రామం సింగనమల మండలం నాగలగుడ్డం తండా

# ఇప్పటికీ జల దిగ్బందంలో ఏడుపాయల వన దుర్గామాత ఆలయం

మెదక్ సెప్టెంబర్ 16, (భారతశక్తి ప్రతినిధి)
ఏడుపాయల వనదుర్గామాత ఆలయం ఇప్పటికీ జల దిగ్బంధం లో వుండిపోయింది. మంజీరా నది అమ్మవారి ఆలయం వద్ద ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు సింగూర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువ ఉన్న మంజీరకు వరద నీరు భారీగా చేరుతోంది. ప్రధాన ఆలయం మూసివేసి..పైన ఉన్న రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజారులు పూజలు నిర్వహిస్తున్నారు.

# అమ్మకానికి మెట్రో..భవిష్యత్తుపై తీవ్ర ఆందోళనలు

హైదరాబాద్, సెప్టెంబర్ 16, (భారతశక్తి ప్రతినిధి)
హైదరాబాద్ లో మెట్రో రైలు ప్రాజెక్టు నుంచి తన వాటాను విక్రయించేందుకు ఎల్ అండ్ టి సంస్థ సిద్ధమని ప్రకటించడం ఇప్పుడు మరోసారి చర్చనీయాంశమైంది. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో తన వాటాను 90 శాతం కంటే ఎక్కువ విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తె?పింది. హైదరాబాద్ మెట్రో రైలు గత కొన్ని సంవత్సరాలుగా ఆర్థికంగా తీవ్ర నష్టాలను తెచ్చిపెడుతుందని ఎల్ అండ్ టి సంస్థ చెబుతుంది. ఆపరేషన్ నష్టాలు కొన్ని సంవత్సరాలుగా పేరుకుపోవడంతో మెట్రో రైలు నిర్వహణ కష్ట సాధ్యంగా మారిందని ఎల్ అండ్ టి సంస్థ తెలిపింది. హైదరాబాద్ లో మళ్లీ ఫ్లాష్ ఫ్లడ్స్ గత నెలలోనే లేఖను పంపినా... ఆగస్టు నెలలోనే హౌసింగ్ అండ్ అర్బన్ డెవలెప్ మెంట్ శాఖకు లేఖను పంపామని, అయితే తెలంగాణ ప్రభుత్వం నుంచి తమకు ఆశించిన స్థాయిలో ఆర్థిక సాయం అందడం లేదని తెలిపింది. దీంతో తమ సంస్థ మెట్రో రైలు వల్ల మరింత నష్టాలను ఎదుర్కొనే ఛాన్స్ ఉందని, అది భరించలేక తమ వాటాను అమ్మకానికి పెట్టేందుకు ముందుకు వచ్చామని సంస్థ ప్రకటించింది. హైదరాబాద్ లో మెట్రో రైలు బాగా క్లిక్ అయింది. ఆక్యుపెన్సీ రేటు కూడా బాగానే ఉంది. అయితే నిర్వహణ కష్టాలు మాత్రం తడిసి మోపెడవుతున్నాయి. గతంలోనే ఎల్ అండ్ టి సంస్థ మెట్రో రైలును విక్రయించేందుకు సిద్ధమయింది. కొంతకాలంగా మెట్రో రైలుకు ఆశించిన స్థాయిలో ఆదాయం రావడం లేదని, దీనికి తోడు పేరుకుపోయిన బకాయిలతో సంస్థ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుందని లేఖలో పేర్కొన్నారు. టికెట్ల ద్వారా వచ్చే ఆదాయం నిర్వహణ ఖర్చులకు కూడా సరిపోవడం లేదని, ఈ పరిస్థితుల్లో మెట్రోను నడపడం తమకు భారంగా మారిందని ఎల్ అండ్ టీ అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు.అందుకే, మెట్రో నిర్వహణను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలనే నిర్ణయానికి వచ్చినట్లు వారు తెలిపారు. ఒకవేళ మెట్రో నిర్వహణ కోసం స్పెషల్ పర్పస్ వెహికల్‌ను ఏర్పాటు చేసి అప్పగించాలని సూచించినా సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. ఆర్థికంగా భారంగా పరిణమించిన మెట్రో రైలు నిర్వహణ తమ వల్ల కాదంటూ చేతులెత్తేసింది.నిర్వహణ ఖర్చులు... ఫేజ్ -1 తో పాటు దాని ఆపరేషన్ మెయిన్ టెయినెన్స్, ఫేజ్ ఎఎ ం, ఫేజ్ ఎఎ ః ని కూడా తీసుకోవాలని



ప్రతిపాదిస్తున్నట్లు ఎల్ అండి టి సంస్థ ప్రకటించింది. ప్రాజెక్టుల ఆలస్యం కావడంతో పాటు భూమి స్వాధీనం, అనేక విస్తరణ దశల్లో మార్పులు, యుటిలిటీ షిఫ్టింగ్ వంటి కారణాలతో తమ సంస్థను మరింత ఆర్థికంగా కుంగదీస్తుందని తెలిపింది. గత ఏడాది ఆపరేషన్ ద్వారా వచ్చిన ఆదాయం 1.108 కోట్లు అయిదే, 2023.-2024లో అది 1,399 కోట్లుగా ఉందని చెప్పింది. గత ఏడాదితో పోలిస్తే 21 శాతం తగ్గుదల కనిపించిందన్నారు. గత ఆర్థిక సంవత్సరం 555 కోట్లు నష్టం వస్తే, ఈ ఆర్థిక సంవత్సరం 625 కోట్లు నష్టం వాటిల్లినట్లు పేర్కొంది. 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మెట్రో రైలు ప్రారంభం కాగా రాష్ట్ర ప్రభుత్వం తగిన సమయంలో ఆర్థిక సాయం చేయకపోవంతో నష్టాలు మరింత పెరిగాయని తెలిపింది.

అన్నీ సవాళ్లే..

ప్రతిపాదిత రెండో దశ ప్రాజెక్ట్‌లో తలెత్తే నిర్వహణపరమైన సవాళ్లను దీనికి ప్రధాన కారణమని ఒడు సంస్థ పేర్కొంది. ఈ సంస్థ దాదాపు రూ.19,000 కోట్ల పెట్టుబడితో 72 కి.మీ. మెట్రో రైల్ నెట్‌వర్క్ మొదటి దశ అభివృద్ధి చేసింది. ఇది 35 సంవత్సరాల రాయితీ ఒప్పందం కింద 2017లో కార్యకలాపాలను ప్రారంభించింది. ప్రారంభం నుంచే హైదరాబాద్ మెట్రో నష్టాల్లో నడుస్తోంది. ఎల్‌డటి సంస్థ అంచనాల ప్రకారం, ఇప్పటివరకు ప్రాజెక్ట్‌కు దాదాపు రూ.6,000 కోట్ల నష్టాలు పోగయ్యాయి. కోవిడ్-19 మహమ్మారి సమయంలో మెట్రో సేవలు నిలిచిపోవడంతో నష్టాలు మరింత పెరిగాయి. సంస్థకు దాదాపు రూ.13,000 కోట్ల అప్పులు ఉన్నాయని, వాటిపై అధిక వడ్డీ రేట్లు భరించడం కష్టమవుతోందని ఎల్‌డటి తెలిపింది. టికెట్ల ద్వారా వచ్చే ఆదాయం, మాల్స్, ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం నిర్వహణ ఖర్చులకు మాత్రమే సరిపోతో ందని, అప్పులు, వడ్డీలు చెల్లించడానికి సరిపోవడం లేదని వివరించింది. గత ఐదేళ్లుగా తెలంగాణ ప్రభుత్వాన్ని ఆర్థిక సహాయం కోరినా, తగిన మద్దతు లభించలేదని ఎల్‌డటి ఆరోపించింది.
హైదరాబాద్ మెట్రో ప్రాజెక్ట్‌కు మరో అతిపెద్ద సమస్యగా స్టేజ్ 2 ప్రాజెక్ట్ విస్తరణ ఎల్‌డటి ప్రస్తావించింది. రెండో దశ ప్రాజెక్టును ప్రభుత్వం వేరే సంస్థ ద్వారా నిర్మించాలనుకుంటోందని, మొదటి, రెండో దశల మధ్య ప్రయాణీకుల రాకపోకలు, టికెట్ల ధరలు, నిర్వహణ విషయంలో సవాళ్లు తలెత్తుతాయని ఎల్‌డటి హెచ్చరించింది. రెండు వేర్వేరు సంస్థలు ఒకే నెట్‌వర్క్‌పై పనిచేయడం వల్ల ప్రయాణీకులకు ఇబ్బందులు ఎదురవుతాయని, ఇది తమకు ఆర్థికంగా, నిర్వహణపరంగా పెద్ద నష్టాలను తెచ్చిపెడుతుందని తెలిపింది.ఈ క్రమంలో హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టులోని 90 శాతానికి పైగా వాటాను కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాలకు విక్రయించడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఎల్‌డటి పేర్కొంది. తద్వారా ప్రాజెక్టు మొత్తం బాధ్యతలను ప్రభుత్వమే తీసుకోవచ్చని సూచించింది. ఎల్‌డటి ఈ నిర్ణయం తీసుకోవడం హైదరాబాద్ మెట్రో భవిష్యత్తుపై తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తోంది. ప్రభుత్వం ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తుందో వేచి చూడాలి. ఈ పరిణామం ప్రాజెక్టు భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపవచ్చని నిపుణులు భావిస్తున్నారు

భారతశక్తి
బుధవారం, 17 సెప్టెంబర్ 2025

# సోయరైతులకు కష్టాలు

నిజామాబాద్, సెప్టెంబర్ 16,(**భారతశక్తి ప్రతినిధి**)
ఆరుగాలం కష్టించి పనిచేసే రైతన్నకు అడుగడుగునా కష్టాలు ఎదురవుతున్నాయి. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసాయన సంతోషం వారిని సమస్యలుకి నెట్టింది. ఓవైపు యూరియా కష్టాలు, మరోవైపు వానలతో పంటలు దెబ్బ తినడంతో రైతులు నష్టాలను చవి చూడాల్సి వస్తుంది.సోయా సాగుకు నడుం బిగించిన రైతులకు అధిక దిగుబడులు సాధించి లాభాలను అర్జించాలన్న ఆశ నిరాశగా మిగిలిపోతుంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సోయా పంటలు నేలకొరిగి దర్శనమిస్తున్నాయి. సోయా పంటల పరిస్థితిని చూసి రైతులు లబోదిబోమంటున్నారు. కామారెడ్డి జిల్లాలో పలు ప్రాంతాల్లో సోయా పంట సాగుకు రైతులు అధిక ప్రాధాన్యత ఇస్తారు.జిల్లాలోని గాంధారి, తాడువాయి, లింగంపేట్, మధునూర్, బిచ్కుంద, జుక్కల్, మండలాల్లో నీ గ్రామాల్లో ఎక్కువగా రైతులు సోయా సాగు చేశారు. పంట



ఎదుగుతున్న తరుణంలో భారీ వర్షాలు కురియడంతో సోయా పంట తీవ్రంగా దెబ్బతింటుంది. పంట ప్రగతి దశలోనే నిండా ముంచేతడంతో సోయా పరిస్థితి సోగయా లాగా తయారయింది .సోయా సాగు జరుగుతున్న సమయంలో వానాల వల్ల తమ పంట పూర్తిగా నష్టపో యామని, పంటపై పెట్టిన పెట్టుబడి పూర్తిగా నష్టపోయినట్లేనని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపరిహారం అందించేందుకు కోరుతున్నారు. కురుస్తున్న వర్షాలకు జిల్లాలో వరి సాగు కూడా ఆశాజనకంగానే మారిందని, వానలతో వరి పంట తడిసి ముద్దవ్వడంతో ధాన్యం పొట్టపగిలి పంట సాగుకు నష్టం వాటిల్లి పరిస్థితి ఉంటుందని రైతులు దిగులు దిగాలు చెందుతున్నారు. జిల్లాలో అత్యధికంగా అన్ని మండలాల్లో వరి సాగు అధికంగా జరుగుతోంది. చిన్న సన్నకారు రైతులు నానా తంటాలు పడి పంట సాగుకు అడుగులు వేసినప్పుడు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు ఇబ్బంది పెడుతున్నాయి.నియోజకవర్గం లో వరి సాగు పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని రైతు నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎరువుల కొరత ఇబ్బంది పెట్టినప్పటికీ పంట సాగుకు సన్నద్ధమవుతుంటే భారీ వర్షాలు రైతులను మరింత బాధపెడుతున్నాయని పేర్కొంటున్నారు. రానున్న రోజుల్లో కూడా వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల వల్ల మరిన్ని వర్షాలు పడతాయని వాతావరణ శాఖ సూచిస్తుండడంతో పంట సాగు పరిస్థితి ఏ విధంగా ఉంటుందన్న ఆలోచన రైతులను కృంగదీస్తోంది.గత రెండు మూడు రోజులుగా కామారెడ్డి జిల్లాను రెడ్ అలర్ట్ ప్రకటించడంతో కురుస్తున్న వర్షాలకు పంట భూములు నీటితో నిండిపోయాయి. మరో రెండు మూడు రోజులు ఇలాగే వర్షాలు కురిస్తే వరి పంట సాగు కూడా ప్రశ్నార్థకంగా మారి ప్రమాదం ఉంటుందని వ్యవసాయ అధికారులు సైతం స్పష్టం చేస్తున్నారు.

# అదిలాబాద్‌లో ఫస్ట్ ఏఐ స్కూల్

అదిలాబాద్, సెప్టెంబర్ 16,(**భారతశక్తి ప్రతినిధి**)
ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఆశ్చర్యపోయేలా.. అదవి శ్రీరాంపూర్‌లోని గవర్నమెంట్ స్కూల్ స్టూడెంట్స్ దూసుకుపోతున్నారు. అదవి శ్రీరాంపూర్.. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ శ్రీరాంపూర్‌గా మారిపోయింది. తొలి ఏఐ ల్యాబ్ ఏర్పాటు చేసిన రేవంత్ సర్కార్ అదవి శ్రీరాంపూర్ పేరులోనే కాదు.. ఊరు చుట్టూ కూడా అదవి లాంటి పరిసరాలే ఉంటాయ్. మంథని నియోజకవర్గంలో మారుమూల గ్రామం ఇది. ఇప్పుడు ఈ విలేజ్.. పట్టణాలను, నగరాలను మించిన టెక్నాలజీ రెవల్యూషన్‌కి కేరాఫ్‌గా మారింది. గ్రామీణ భారతంలో డిజిటల్ విప్లవాన్ని తీసుకొచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగానే.. పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలం అదవి శ్రీరాంపూర్‌లోని ఈ ప్రభుత్వ హైస్కూల్‌లో తొలి ఏఐ ల్యాబ్‌ని.. పయోనీర్ ల్యాబ్ సహకారంతో ఏర్పాటు చేసింది. టీ–ఫైబర్ సహకారంతో ప్రభుత్వ స్కూళ్లలో ఏఐ పాఠాలు అదవి శ్రీరాంపూర్.. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు దత్తత తీసుకున్న గ్రామం. ఇప్పుడిది.. ఏఐ శ్రీరాంపూర్‌గా వార్తల్లో నిలిచింది. ఈ స్కూల్‌లోనే.. ప్రభుత్వ పాఠశాలల్లో.. ఏఐ టెక్నాలజీ రెవల్యూషన్‌కు ఇది తొలి మెట్టు. ఇండియాలోనే ఎక్కడా లేని విధంగా.. ఓ ప్రభుత్వ పాఠశాలలో ఏఐ ల్యాబ్‌ని ఏర్పాటు చేసింది టీఫైబర్ సంస్థ. దీనికోసం.. ఐటీ మంత్రి శ్రీధర్ బాబు తో పాటు టీ–ఫైబర్ టీమ్ 12 రోజుల పాటు రాత్రి, పగలు అనే తేడా లేకుండా పనిచేసింది. మొత్తానికి.. టీ–ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్, కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీఈవో మాధవితో కలిసి.. జడ్పీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఏఐ ల్యాబ్‌తో పాటు ఇంటర్నెట్ విలేజ్ సర్వైలెన్స్‌ని ప్రారంభించారు మంత్రి శ్రీధర్‌బాబు. రాష్ట్రంలో మరిన్ని గ్రామాలకు అందనున్న ఇంటర్నెట్ సేవలు మారుమూల అటవీ గ్రామమైన అదవి శ్రీరాంపూర్‌ని.. ఇంటర్నెట్ విలేజ్‌గా మార్చామన్నారు మంత్రి శ్రీధర్ బాబు. ఈ గ్రామాన్ని.. ఏఐ విలేజ్‌గా మార్చేందుకు కోటి 20 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో.. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు.. ప్రభుత్వ పాఠశాలల్ని చూసి అసూయ పడేలా చేస్తామన్నారు శ్రీధర్ బాబు. రాష్ట్రంలో.. పైలట్ ప్రాజెక్ట్ కింద ఫైబట్ ఆప్టిక్‌తో ఇంటర్నెట్ విలేజ్‌గా మార్చేందుకు కొన్ని గ్రామాలను ఎంపిక చేశారు. ఇందులో.. మంత్రి




శ్రీధర్‌బాబు నియోజకవర్గంలోని అదవి శ్రీరాంపూర్‌తో పాటు మరో రెండు సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గంలోనూ, మరొకటి ఆరోగ్యమంత్రి దామోదర రాజనర్సింహ నియోజకవర్గంలో ఉన్నాయి. అయితే.. తెలంగాణలో మొట్టమొదటి ఏఐ ల్యాబ్‌కు.. అదవి శ్రీరాంపూర్ జడ్పీ హైస్కూల్ కేరాఫ్‌గా మారింది. ప్రభుత్వ పాఠశాలల్లో.. గూగుల్ సేవల్ని వినియోగించుకునేందుకు గూగుల్ సంస్థతోనూ.. టీ–ఫైబర్ సంస్థ ఒప్పందం చేసుకుంది. విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో పాఠాలు చెప్పేందుకు.. ఏఐ టూల్స్‌ని కూడా ఏర్పాటు చేశారు. అదేవిధంగా.. కోడింగ్ బుక్స్‌ని కూడా అందుబాటులో ఉంచారు. దీనికి సంబంధించి.. నిజానికి అదవి శ్రీరాంపూర్‌లో ఆరు నెలల నుంచి ఉచిత ఇంటర్నెట్ సేవలు అందుతున్నాయి. ఇంటర్నెట్ కనెక్టివిటీతో ఊళ్లోని టీవీలన్నీ.. స్మార్ట్ టీవీలుగా మారిపోయాయ్. వై–ఫై కనెక్టివిటీతో.. ప్రతి ఒక్కరూ తమ మొబైల్‌లోనే అన్నీ వీక్షిస్తున్నారు. అయితే.. నామమాత్రపు రుసుముతో గ్రామగ్రామాన ఫైబర్ కేబుల్‌తో ఇంటర్నెట్ అందుబాటులోకి తెచ్చి.. రాష్ట్రాన్ని డిజిటల్ తెలంగాణగా మార్చాలన్నాది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం. ఈ క్రమంలో.. తొలిదశలో నారాయణపేట, సంగారెడ్డి, పెద్దపల్లి జిల్లాల్లో 2096 గ్రామపంచాయతీలకు టీ–ఫైబర్ ఆప్టిక్‌ని లింక్ చేశారు. ఇందుకోసం.. భారత్ నెట్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం.. తెలంగాణకు 2500 కోట్లు అందించింది. అందులో భాగంగానే.. 20ఎంబీపీఎస్ స్పీడ్‌తో అదవి శ్రీరాంపూర్ గ్రామంలో ఇంటర్నెట్ సేవలు అందుతున్నాయి. అదవి శ్రీరాంపూర్‌లో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటయ్యాయి. నిఘా కోసం 20 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటన్నింటిని.. గ్రామపంచాయతీకి లింక్ చేయడంతో పాటు ముత్తారం పోలీస్ స్టేషన్‌కు, హైదరాబాద్‌లోని టీ–ఫైబర్ ఆఫీసుకు కూడా అనుసంధానం చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల.. ఈ గ్రామంలో క్రైమ్ రేట్ తగ్గేందుకు ఆస్కారముందనే చర్చ జరుగుతోంది. తెలంగాణలో ఇప్పటికే 94 మండలాల్లో.. టీ–ఫైబర్ సేవలు అందించేందుకు రంగం సిద్ధమైంది. ఈ ప్రాజెక్టుతో.. అనేక ప్రభుత్వ సంస్థలను కనెక్ట్ చేసేందుకు నడుం బిగించారు. డిజిటల్ తెలంగాణ మిషన్‌లో.. అదవి శ్రీరాంపూర్ ఇప్పుడు ముందు వరుసలో నిలవడంతో.. గ్రామస్తులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పెరియార్ రామస్వామికు బీఎస్పీ ఘన నివాళులు

నరసరావుపేట, సెప్టెంబర్ 16, (**భారతశక్తి ప్రతినిధి**)
బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా పెరియార్ రామస్వామి నాయకర్ 146వ జయంతి నీ బీఎస్పీనాయకులు మంగళవారం నరసరావుపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు బూదాల బాబురావు మాట్లాడుతూ, ఈ దేశంలోని బ్రాహ్మణ వ్యవస్థ, అంటరానితనం అసమానతలు మూఢనమ్మకాలపై నిరంతరం పోరాటం చేసిన యోధుడు, ద్రవిడ ఉద్యమ నిర్మాత పెరియార్ రామస్వామి నాయకర్ కి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా సీనియర్ నాయకులు వేల్పుల రాంబాబు, నరసరావుపేట నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల మణికంఠ, మహిళా నాయకురాలు తంగిరాల దానమ్మ, పోలే పోగు నాగేశ్వరరావు, షేక్ ఖాజావలి, భాష, మందపాటి శ్రీనివాసరావు, ప్రేమానంద్, బీఎస్పీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముఖ్య మంత్రి చేతులచే దివ్యదృష్టి ఆవిష్కరణ

కరీంనగర్ సెప్టెంబర్ 16, (**భారతశక్తి ప్రతినిధి**)
కరీంనగర్ జిల్లా ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థులు పాడిన దివ్య దృష్టి వీడియో ఆల్బమ్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ లోని తమ నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ. ఈ పిల్లలు దివ్య దృష్టి గల సుదీర్ఘమైన సంస్కృత సమాసాలతో ఉన్న స్తోత్రాలను కూడా అలవోకగా పడడం అభినందనీయమని భాష సరిగా ఉచ్చరించలేని ఈ కాలంలో ఇంత స్పష్టంగా రాగయుక్తంగా స్తోత్రాలను ఆలపించడం ఆనందాన్నిచ్చిందని అన్నారు. ఎంతో కృషి అభ్యాసం ఉంటే తప్ప ఇది సాధించలేరని, చిన్నారులు వృద్ధిలోకి రావాలని ఆశీర్వదించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ. విద్యారంగంలో చిన్నారులను ప్రోత్సహించడం ఆదర్శనీయమని అన్నారు. వీడియో ఆల్బమ్ కు దర్శకత్వం వహించిన నంది శ్రీనివాస్, సంగీతాన్ని అందించిన కె. బి. శర్మ, సంగీత ఉపాధ్యాయురాలు సరళ, వీడియోగ్రఫీ చేసిన లక్ష్మీ గౌతమ్ లను అభినందించారు. కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షులు అన్నం రవిచంద్ర సమన్వయంతో సాగిన ఈ కార్యక్రమంలో చిన్నారి గాయకులు సింధుశ్రీ, శ్రావణి, తిరుమల, అఖిల, నిత్యశ్రీ, జాహ్నవి, కల్పన, ప్రణయ్, సాయిరామ్, మణిదీప్, అక్షయ్, వరుణ్ తేజ్, మణి రతన్, లోహిత్ లతో పాటు ప్రభుత్వ బదిరుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# స్పీకర్ నిర్ణయంపైనే భవిష్యత్తు

హైదరాబాద్, సెప్టెంబర్ 16, (**భారతశక్తి ప్రతినిధి**)
తెలంగాణ అసెంబ్లీలో జరుగుతున్న డిఫెక్షన్ కేసులు రాజకీయ పార్టీల మధ్య ఉద్రిక్తతను పెంచుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులు యాంటీడిఫెక్షన్ చట్టాన్ని, రాజ్యాంగ స్థానాన్ని ప్రశ్నించేలా మలుపు తిప్పుతున్నాయి. సుప్రీం కోర్టు ఆదేశాలు, స్పీకర్ నోటీసులు, పార్టీల వాదనలు ఈ ఘటనలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయాన్ని రాస్తున్నాయి2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, బీఆర్ఎస్ నుంచి 10 మంది ఎమ్మెల్యేలు దాదంబోయినా నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కలె యాదయ్య, ఎం. సంజయ్ కుమార్, కృష్ణమోహన్‌రెడ్డి, మహీపాల్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, అరికేపూడి గాంధీ కాంగ్రెస్‌లో చేరినట్టు బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించి, ట్రెజరీ బెంచీల్లో కూర్చున్నారని బీఆర్ఎస్ వాదన. ఇది యాంటీడిఫెక్షన్ చట్టానికి (10వ షెడ్యూల్) విరుద్ధమని, డిస్క్వాలిఫికేషన్ పిటిషన్లు 2024 మార్చి ఏప్రిల్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సమర్పించారు. సుప్రీం కోర్టు 2025 జూలై 31న జారీ చేసిన ఆదేశాల్లో, స్పీకర్‌కు మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని డైరెక్ట్ చేసింది. దీంతో 2025, ఆగస్టు 23న స్పీకర్ 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారా లేదా అనే వివరణ కోరారు. ఇది డిఫెక్షన్ కేసుల్లో స్పీకర్ నిర్ణయాలపై రాజ్యాంగపరమైన ప్రశ్నలను లేవనెత్తింది. కోర్టు, స్పీకర్/ఛైర్మన్‌లకు డిఫెక్షన్ నిర్ణయాల బాధ్యతను అప్పగించడం సమర్థవంతమా అని పార్లమెంట్‌ను పరిశీలించమని సూచించింది.స్పీకర్ నోటీసులకు స్పందిస్తూ, 10 మంది ఎమ్మెల్యేలలో 8 మంది 2025 సెప్టెంబర్ 11 నాటికి వివరణలు సమర్పించారు. వారంతా ఐక్యంగా, ‘మేము బీఆర్ఎస్‌లోనే ఉన్నాం, కాంగ్రెస్‌లో చేరలేదు‘ అని పేర్కొన్నారు. ముఖ్యంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశాలు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సేవల కోసమే అని వాదించారు. కొందరు ‘టెక్నికల్‌గా బీఆర్ఎస్‌లోనే ఉన్నాం‘ అని, సోషల్ మీడియా హ్యాండిల్స్ మార్చలేదని చెప్పుకున్నారు. ఈ ఎమ్మెల్యేలు తమ చట్టపరమైన సలహాలతో స్పందిస్తున్నారు. కొందరు ఢిల్లీలో సుప్రీం కోర్టు న్యాయవాదులను సంప్రదించి, ప్రజల సేవ కోసం అధికార పార్టీలోకి వెళ్లామని, ద్రోహం చేయలేదని వాదిస్తున్నారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వివరణలను తిరస్కరిస్తూ, 2025



సెప్టెంబర్ 13 నాటికి స్పీకర్‌కు కౌంటర్ వాదనలు సమర్పించనుంది. పార్టీ నేతలు, ‘ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నేతల సమక్షంలో చేరారు, కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొన్నారు, కట్టడి బెంచీల్లో కూర్చున్నారు‘ అని ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా, యూట్యూబ్‌లో డిజిటల్ ఆధారాలు సేకరిస్తున్నారు. దానం నాగేందర్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేశారు. కడియం శ్రీహరి కూతురు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చాక దానిని తిరస్కరించి కాంగ్రెస్‌లో చేరి పోటీచేసి గెలిచారు.ఈ ఫిరాయింపుల వివాదం తెలంగాణ రాజకీయాల్లో అస్థిరతను తెలియజేస్తోంది. బీఆర్ఎస్ 2023లో 39 సీట్లతో రెండో స్థానంలో ఉండగా, 10 మంది ఎమ్మెల్యేలు చెరస్తే 29కి తగ్గుతుంది. ఇది పార్టీ బలాన్ని బలహీనపరుస్తుంది. కాంగ్రెస్‌కు (64 సీట్లు) ఇది అదనపు మద్దతు. కానీ డిస్క్వాలిఫికేషన్ అయితే బై?ఎలక్షన్లు జరగవచ్చు. అప్పుడు రాజకీయ పరిణామాలు మారే అవకాశం ఉంది. చట్టపరంగా ఫిరాయింపులను నిరోధిస్తుంది. కానీ ఎమ్మెల్యేలు ‘స్వచ్ఛందంగా‘ పార్టీ మారితే పార్టీ విలీనం ద్వారా మినహాయింపు పొందుతారు. బీఆర్ఎస్ ఆధారాలు (వీడియోలు, సమావేశాలు) బలంగా ఉంటే స్పీకర్ డిస్క్వాలిఫికేషన్‌కు ఆమోదం ఇవ్వవచ్చు. స్పీకర్ నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో కొత్త మలుపును తీసుకురావొచ్చు.

## కోలుకుంటున్న ఓజోన్ పొర..శుభవార్త చెప్పిన ఐక్యరాజ్యసమితి

న్యూయార్క్ సెప్టెంబర్ 16
ఐక్యరాజ్యసమితి శుభవార్త చెప్పింది. భూమికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొర కోలుకుంటున్నట్లు వెల్లడించింది. రానున్న దశాబ్ధాల్లో ఆ ఓజోన్ రంధ్రం పూర్తిగా మూసుకుపోనున్నట్లు యూఎన్ తన నివేదికలో పేర్కొన్నది. అంతర్జాతీయ దేశాల నిరంతర చర్యల వల్ల ఈ సక్సెస్ సాధ్యమైనట్లు యూఎన్ తెలిపింది. యూఎన్ వరల్డ్ మెటియోరోలాజికల్ ఆర్గనైజేషన్ దీనిపై కొత్త నివేదికను రిలీజ్ చేసింది. అంటార్కిటికాపై ఉన్న ఓజోన్ రంధ్రం గతంతో పోలిస్తే 2024లో చిన్నగా ఉన్నట్లు ఆ నివేదికలో పేర్కొన్నారు.ఐక్యరాజ్యసమితి చీఫ్ ఆంటోనియో గుటెర్రస్ కూడా స్టేట్మెంట్ రిలీజ్ చేశారు. ఓజోన్ పొర కోలుకుంటోందన్నారు. శాస్త్రవేత్తలు ఇచ్చిన హెచ్చరికలు పనిచేసినట్లు ఆయన తెలిపారు. దీని వల్ల ప్రగతి సాధ్యమవుతోందన్నారు. ఓజోన్ బులెటిన్ 2024ను ప్రపంచ వాతావరణ సంస్థ పబ్లిష్ చేసింది. సహజసిద్ధమైన పరిణామాల వల్ల ఓజోన్ పొర సన్నగిల్లడం నిలిచిపోయినట్లు పేర్కొన్నది. కానీ దీర్ఘకాలంగా ఆలోచిస్తే, అది శాస్త్రవేత్తల ఘనతగా తెలిపారు. క్లోరోఫ్లోరో కార్బన్స్ వినియోగంపై అంతర్జాతీయంగా వత్తిడి తేవడం వల్లే ఓజోన్ పొర బలహీనపడడం ఆగినట్లు చెప్పారు.వరల్డ్ ఓజోన్ డే సందర్భంగా బులెటిన్ రిలీజ్ చేశారు. వియన్న కన్వెన్షన్ 40వ వార్షికోత్సవాన్ని కూడా జరుపుకుంటున్నారు. ఆ నాటి సదస్సులో ప్రపంచ దేశాలు ఓజోన్ పొర సన్నగిల్లడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. 1975లో ఆ కన్వెన్షన్ జరిగింది.
ఆ తర్వాత 1987లో మాంట్రియల్ ప్రోటోకాల్ రిలీజ్ చేశారు. రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషనర్లు, ఏరోసోల్ స్ప్రేస్‌లో ఓజోన్ పొరను బలహీనపరిచే పదార్థాల వినియోగాన్ని తగ్గించాలని నిర్ణయించారు.ప్రస్తుతం ఓజోన్ పొర రికవరీ ట్రాక్‌లో ఉందన్నారు. ఈ శతాబ్దం మధ్య కాలం వరకు .. 1980 తరహా స్థాయికి ఓజోన్ పొర చేరుకుంటుందని అంచనా వేశారు. దీని వల్ల స్కిన్ క్యాన్సర్లు, క్యాటరాక్టులు తగ్గుతాయన్నారు. అతినీలలోహిత కిరణాల వల్ల జరిగే నష్టాలు నివారించబడుతాయని రిపోర్టులో తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ 29న అంటార్కిటికా వద్ద ఓజోన్ పొర 46.1 మిలియన్ టన్నుల మాస్ డెఫిసిట్‌తో ఉందని, ఇది 1990–2020 దశకంతో పోలిస్తే తక్కువ అని రిపోర్టులో పేర్కొన్నారు.



# కవిత టార్గెట్ యూత్...

వరంగల్ సెప్టెంబరో16, (**భారతశక్తి ప్రతినిధి**)
అవి తెలంగాణ ఉద్యమం జోరుగా సాగుతున్న రోజులు. సాంస్కృతిక ఆయుధంతో కవిత ఉద్యమంలోకి వచ్చారు. నెత్తిన బతుకమ్మను ఎత్తుకొని.. గౌరమ్మను కీర్తిస్తూ.. తెలంగాణ ఉద్యమ ఆవశ్యకతను చాటిచెబుతూ అడుగులు వేశారు. చంటి బిడ్డ తల్లి అయినప్పటికీ ఉద్యమం ముందు వరుసలో నడిచారు. నాడు ఉద్యమం చేస్తున్న రోజులో ఎన్నడూ కూడా యువతను భావోద్వేగానికి గురి కావద్దని చెబుతూ ఉండేవారు కవిత.. చదువులను నిర్లక్ష్యం చేయొద్దని.. ఏనాటికైనా తెలంగాణ వస్తుందని.. తెలంగాణ రాష్ట్రంలోనే సమస్యలు తీరుతాయని స్పష్టంగా చెప్పేవారు.వాస్తవానికి రాజకీయ నాయకులు యువతను తమ స్వార్థం కోసం వాడుకుంటారు. తమ రాజకీయ ప్రాపకం కోసం ఉపయోగించుకుంటారు. కానీ కవిత అలా కాదు. అలాంటి పని కవిత ఎన్నడూ చేయలేదు. అందువల్లే ఆమెను యువత విపరీతంగా ఆరాధిస్తూ ఉంటుంది. ఇటీవల జాగృతి ఆధ్వర్యంలో లీడర్ అనే కార్యక్రమం నిర్వహిస్తే దానికి వేలాదిమందిగా యువత హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో కవిత చెప్పిన మాటలన్నిటినీ శ్రద్ధగా విన్నారు. రాజకీయం మాత్రమే కాదు, నాయకత్వం అంటే ఏమిటో కవిత వివరించిన తీరుకు యువత ఫిదా అయ్యారు. రాజకీయాలు అంటేనే విరక్తి కలుగుతూ.. రాజకీయ నాయకులు అంటేనే హేయమైన భావం విస్తరించిన నేటి రోజుల్లో కవిత మాటలను యువత శ్రద్ధగా వినడం నిజంగా ఆశ్చర్యకరమే. అయితే ఆ మాటల్లో రాజకీయాల్లోకి రావాలని గాని.. ఒకరి మీద పెత్తనం సాగించాలని కానీ కవిత చెప్పలేదు. జస్ట్ సమాజం కోసం ఎంతవరకు అయితే అంతవరకు చేయడమే మనిషి నైజం అని కవిత చెప్పిన మాటలు యువతను తీవ్రంగా ప్రభావితం చేశాయి. అందువల్లే కవిత నేడు తన పూర్వ రాజకీయ క్షేత్రం నుంచి బయటికి వచ్చినప్పటికీ కూడా ఇంతమంది ఆమెను ఆరాధిస్తున్నారు.ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు సంబంధించిన ఫీజుబకాయిలు విపరీతంగా పెరిగిపోయాయి. అటు స్థానిక సమస్య కూడా విద్యార్థులను ఇబ్బంది పెడుతోంది. ఇవే విషయాలను కవితంగా ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. ప్రభుత్వాన్ని నేరుగా ప్రశ్నిస్తున్నారు.. తన సామాజిక మాధ్యమాల వేదికగానే ప్రభుత్వాన్ని తూర్పారబడుతున్నారు. ముఖ్యంగా ఏపీలో కలిసిన ఆ ఏడు మండలాల ప్రజలు ఎంత ఇబ్బంది పడుతున్నారో కవిత అనేక సందర్భాల్లో చెప్పారు. ఇటీవల భద్రాచలంలో పర్యటించినప్పుడు కూడా ఆ ఏడు మండలాలను తెలంగాణలో కలపాలని డిమాండ్ చేశారు. అవసరమైతే దానికోసం తాను ఉద్యమం చేస్తానని కూడా ప్రకటించారు.ఇక ఫీజు రీయింబర్స్మెంట్ విషయంలోనూ కవిత తగ్గడం లేదు. తను శాసనమండలి సభ్యురాలుగా ఉన్నప్పుడు.. అనేక పర్యాయాలు విద్యార్థుల ఫీజు కష్టాల గురించి ఆమె మాట్లాడారు. ప్రభుత్వం రాజకీయాలను పక్కనపెట్టి విద్యార్థుల సమస్యల పరిష్కరించాలని.. ఎందుకంటే విద్యార్థులు చదువులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని ఆమె శాసనమండలిలో వ్యాఖ్యానించారు. వాస్తవానికి ఇటీవల కాలంలో విద్యార్థుల సమస్యల గురించి ఈ స్థాయిలో అటు అధికార పక్షంగాని.. ఇటు ప్రతిపక్షం గాని మాట్లాడలేదు. పైగా రాజకీయంగా వాడుకోవడానికి అవకాశం వచ్చినప్పటికీ కూడా కవిత కేవలం విద్యార్థుల భవిష్యత్తు గురించి మాత్రమే మాట్లాడారు. వాస్తవానికి రాజకీయ నాయకులు ఎంత మంది అయినా ఉండవచ్చు. వారి రాజకీయాల కోసం ఏమైనా చేస్తూ ఉండవచ్చు. కానీ ప్రజల బాగు కోసం పనిచేసేవారు కొంతమంది మాత్రమే ఉంటారు. ఆ జాబితాలో కవిత ముందు వరుసలో ఉంటారు. తదుపరి రాజకీయ క్షేత్రం ఎలా నిర్మించుకుంటారు..

# విద్యార్థుల్లో అభ్యసన స్థాయిలు మెరుగ్గా ఉండేలా

## ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి..జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

ఉమ్మడి వరంగల్ బ్యూరో,(భారత శక్తి)సెప్టెంబర్16:కమలాపూర్ మండలం గూడూరు లోని పీఎంశ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.విద్యార్థుల అభ్యసన స్థాయి తక్కువగా ఉందని, అభ్యసన స్థాయిని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు.

మంగళవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరు లోని పీఎంశ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలోని ఏడు, ఎనిమిది, పదో తరగతులను సందర్శించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించారు. పదో తరగతి విద్యార్థులను గణిత సబ్జెక్టుకు సంబంధించిన పలు అంశాలను



కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రి మిడ్లైన్ టెస్ట్ పరిశీలించారు. విద్యార్థుల ప్రవర్తన రీతి ఎలా ఉంటుందని కలెక్టర్ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. డ్రగ్స్ సంబంధిత సమస్యలు ఏవైనా ఉన్నాయా అని ఆరా తీశారు. పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నారని ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో మెరుగ్గా ఉండేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగ్గా ఉండాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించాలన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, ఎంఈఓ శ్రీధర్, తదితరులతోపాటు పాఠశాల ప్రిన్సిపల్ అనితా కుమారి, ఉపాధ్యాయులు ఉన్నారు.

# మాత శిశు ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో,(భారత శక్తి)సెప్టెంబర్ 16: నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ మాత, శిశు ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మహిళా శక్తి క్యాంటీన్‌ను పరిశీలించిన కలెక్టర్, భోజనం నాణ్యత, పరిశుభ్రతపై వివరాలు సేకరించారు. అనంతరం లాబొరేటరీ, స్కానింగ్ కేంద్రం, ఇన్‌వార్డు, అవుట్‌వార్డు, ఆపరేషన్ థియేటర్, ఓపి వార్డు, బాలింతల వార్డులను సందర్శించి రోగుల పరిస్థితి, అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ వైద్యులకు పలు సూచనలు చేస్తూ గర్భిణీలకు, బాలింతలకు ప్రత్యేక వైద్య సేవలు సమయానికి అందించాలన్నారు. ప్రసవాల సమయంలో ఎటువంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోగులతో మృదువుగా, శ్రద్ధగా వ్యవహరించి, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణం శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతిరోజూ పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వైద్యులు, సిబ్బంది తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి రోగుల విశ్వాసాన్ని నిలబెట్టాలని కలెక్టర్ సూచించారు.

ఈ తనిఖీలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, ఆసుపత్రి పర్యవేక్షకులు సరోజ, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మహేష్ కుటుంబానికి కేటీఆర్ ఆర్థిక సాయం



ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 16 (భారత శక్తి) : జీతం అందక ఆత్మహత్య చేసుకుని మరణించిన ములుగు మున్సిపాలిటీ కార్మికుడు మైదం మహేష్ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పంపించిన 5 లక్షల 50 వేల రూపాయల ఫిక్స్ డిపాజిట్ బాండ్లను ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడుకాకులమర్రి లక్ష్మీనరసింహారావు ఆధ్వర్యంలో ములుగు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ బడే నాగజ్యోతితో కలిసి బాధిత కుటుంబానికి మంగళవారం ఫిక్స్ డిపాజిట్ బాండ్లను అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మి నరసింహారావు మాట్లాడుతూ రాజకీయాలకు ఎటువంటి తావు లేకుండా బాధితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం చేయడం జరిగిందని కేవలం మహేష్ కుటుంబం బాగుండాలని సదుద్దేశంతో మాత్రమే కేటీఆర్, గతంలో బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన వివిధ నాయకులు ఆర్థిక సహాయం అందించడం జరిగిందని, రాజకీయ లబ్ధికోసం బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడు పనిచేయదని కాంగ్రెస్ ప్రభుత్వం మహేష్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని, కుటుంబ సభ్యులలో ప్రభుత్వం ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు,పిల్లల చదువులకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ములుగు మండల అధ్యక్షుడు రమేష్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి భవాని, మాజీ గ్రంథాలయ చైర్మన్ గోవింద్ నాయక్, నాయకులు భూమా నాయక్, మహేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏ.టి.సి. / ఐ.టి.ఐ. లో ప్రవేశాలకు వెబ్సైట్ లో దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి జిల్లా,(భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 16: కామారెడ్డి జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐ.టి.ఐ., లలో వివిధ రకాల ట్రేడులలో ఖాళీగా ఉన్నటువంటి సీట్లను నాలుగవ దశలో వాక్ ఇన్ అడ్మిషన్ల ద్వారా తేదీ: 15. 09. 2025 నుండి 30. 09. 2025 వరకు మధ్యాహ్నం 01:00 గంట వరకు తీసుకోబడతాయని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ



బిచ్కుంద ఐ.టి.ఐ. ప్రిన్సిపల్ శ్రీ. ప్రమోద్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకుగాను అభ్యర్థులు ఎస్. ఎస్. సి పాసై ఉండాలని ఆసక్తిగాఉన్న కొత్తగా చేరే అభ్యర్థులు వెబ్సైట్లో నమోదు చేసుకొని దరఖాస్తు చేసుకోవాలని ఇప్పటికే నమోదు చేసుకున్న అభ్యర్థులు మళ్ళీ నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదని అన్నారు వారు నేరుగా హాజరు అయి సీటు పొందవచ్చు అని అన్నారు.

01, 02, 03 దశలో ఏ.టి.సి. / ఐ.టి.ఐ. లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకొని సీటు పొందని అభ్యర్థులు నేరుగా ప్రభుత్వ ఐ.టి.ఐ. ఏ.టీ.సీ. కి వెళ్లి నేరుగా ప్రవేశం పొందవచ్చు. ఇదివరకే దరఖాస్తు చేసుకున్న వారు మరల ఫ్రెష్ గా అప్లికేషన్ చేసుకోనవసరం లేదని అన్నారు. అడ్మిషన్ కోసం ఆన్లైన్ దరఖాస్తు తప్పనిసరి అన్నారు. ఒకవేళ మీకు ఇంటర్నెట్ సెంటర్స్ అందుబాటులో లేనియెడల మీయొక్క ఒరిజినల్స్ పత్రాలు (ఎస్ ఎస్ సి మేము, క్యాస్ట్, బోనఫైడ్స్, టిసి, ఫొటోస్ తీసుకొని వచ్చినచో ఐటిఐ లోనే అప్లై చేయడం జరుగుతుంది అని అన్నారు. ఆన్లైన్ దరఖాస్తులకు అధికారిక వెబ్సైట్ http://iti.telangana.gov.in ఫోన్ నెంబర్లు 8500463363 / 9989946678 సంప్రదించగలరు.

# టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన ఇంచార్జ్ ఆర్డీఓ పాండు

సంగారెడ్డి,(భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 16: సంగారెడ్డి రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ ఇంచార్జి ఆర్.పాండు బాధ్యతలు తీసుకున్న తర్వాత మొదటి సారిగా టీజీఐఐసి నిర్మల జగ్గారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం ఇచ్చారు. చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి తో



నియోజకవర్గం పరిధిలోని గల భూ సమస్యల పరిష్కారంలో సంగారెడ్డి ముందుండి పరిష్కరిస్తానని ఇంచార్జి ఆర్ డి ఓ పాండు హామీ ఇచ్చారు. ఇందులో స్థానిక సంగారెడ్డి ఎమ్మార్వో బి జయరాం ఉన్నారు.

# మహిళల భద్రత, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి..

## జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 18:నెల వారీ నేర సమీక్షా సమావేశం లో భాగంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ ఈ రోజు నిర్మల్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, లాంగ్ పెండెన్సీ కేసులను త్వరగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రతి కేసు పురోగతిని క్రమం తప్పకుండా పరిశీలించి, ప్రజలకు న్యాయం ఆలస్యం కాకుండా చూడాలని ఆదేశించారు. అలాగే మహిళల భద్రత, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వీటిపై నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు.మాదకద్రవ్యాల నియంత్రణ, అక్రమ రవాణా, చట్టం–శాంతి పరిరక్షణ, అలాగే ప్రతి పోలీస్ స్టేషన్ స్థాయిలో నేరాల నిరోధక చర్యలను కఠినంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో నేరాలపై పటిష్ట నిఘా కొనసాగించాలని, ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ కావాలని ఎస్పీ, పోలీసు అధికారులకు సూచించారు.మరియు జిల్లాలో అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న గ్రేవ్,నాన్ గ్రేవ్, మిస్సింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు అండగా ఉండాలని, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు పరిమిత లిమిట్ లో ఉండాలని సూచించారు.లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, ఈ కేసుల ఛేదనకు సర్కిల్ పరిధిలో స్పెషల్ టీం లను ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా జిల్లాలో నేరాల సంఖ్యను తగ్గించేందుకు,నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న రౌడీ షీటర్లను ముందస్తుగా గమనించి వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక నిఘా అవసరమని ఎస్పీ అధికారులను ఆదేశించారు.ఆన్లైన్ బెట్టింగ్స్, బెట్టింగ్ యాప్స్, ఆన్లైన్ మోసాలు, సైబర్ మోసాలు,డ్రగ్ దుర్వినియోగం మరియు ట్రాఫిక్ రూల్స్ పై జిల్లా ప్రజలలో,విద్యాసంస్థలలో అవగాహన కల్పిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని యస్.హెచ్.ఓ లకు సూచించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో ఆన్లైన్ లో వీడియో కాల్స్ చేసి, పోలీసు అధికారులం అంటే నమ్మరాదని, ఏ పోలీస్ అధికారి వీడియో కాల్స్ చేయరని గుర్తించాలని అన్నారు. డిజిటల్ అరెస్ట్ లు ఉండవు, ఫిజికల్ అరెస్ట్ మాత్రమే ఉంటుందన్నారు. సైబర్ స్లేవరీ పేరుతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి ఇతర దేశాలకు పంపి ఇబ్బందులకు




గురిచేస్తారని అన్నారు. జిల్లా ప్రజలు ఆన్లైన్ మోసాల గురించి అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని, ఆన్లైన్ మోసాలకు గురి అయినట్లైతే మొదటి గంట (%+శీశ్రీఎవఱ ఎశీబతీ%) లోపు 1930కు కాల్ చేసి లేదా యన్.సి.ఆర్.పి. https://www.cyber-crime.gov.in% పోర్టల్ నందు నమోదు ఫిర్యాదు నమోదు చేయాలని అన్నారు.

దొంగతనం,ఆస్తి సంభందిత నేరాలకు సంబంధించి పాత నేరస్తులపై నిఘా ఉంచాలని కొత్తగా వచ్చిన అంబిస్ టెక్నాలజీని వినియోగించి, ఫాన్స్ ప్రింట్ ద్వారా కేసులను ఛేదించాలని అన్నారు. యన్.డి.పి.యస్. కేసులలో నేరస్తులపై హిస్టరీ షీట్స్ ఓపెన్ చేయాలని,రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లు గా గుర్తించి, సైన్ బోర్డు లను ఏర్పాటు చేయించాలని సూచించారు. ఎన్ఫోర్స్మెంట్ లో భాగంగా ప్రతి రోజు సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు చేస్తూ, మద్యం తాగి వాహనాలను నడిపే వాహన దారీలపై కేసులు నమోదు చేయాలని సూచించారు. ఫేక్ నెంబర్ ప్లేట్స్, నెంబర్ ప్లేట్స్ మార్పు పై ప్రత్యేక దృష్టి సారించి, కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తో పాటు భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ , నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీన , ఇన్స్పెక్టర్లు,అన్ని స్టేషన్ల ఎస్ హెచ్ ఓ లు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వరద బాధితులు 67 మందికి దుప్పట్లు, బెడ్షీట్లు, చీరలు, దోవతులు, టవల్స్ తో కూడిన కిట్లను అందజేసిన జిల్లా కలెక్టర్ ఇండియా రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 16: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారం వరద బాధితులకు ఊరటనిస్తుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు.

మంగళవారం జిల్లా కలెక్టర్ గాంధారి మండల కేంద్రంలోని రైతు వేదికలో వరద బాధితులు 67 మందికి దుప్పట్లు, బెడ్షీట్లు, చీరలు, దొవతులు, టవల్స్ తో కూడిన కిట్లను ఇండియా రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సభ్యులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, ఇతర ఆపద సమయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహాయం అందిస్తుందని అన్నారు. జిల్లాలో ఇటీవల సంభవించిన భారీ వరదల ప్రభావానికి గురైన బాధితులను ఆదుకునేందుకు జిల్లాకు సహకారం అందించాలని కోరగా వెంటనే స్పందించి జిల్లాకు సుమారు 8 లక్షల రూపాయల విలువైన 400 దుస్తులు, దుప్పట్లతో కూడిన కిట్లను, దెబ్బతిన్న ఇండ్లను కప్పుకోవడానికి 100 టార్పాలిన్ కవర్లను అందజేశారని సహాయ సామాగ్రిని పంపించిన రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖకు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం రాజంపేట, బిక్నూర్,




బీబీపేట, దోమకొండ మండలాల్లో సహాయ కిట్లను అందజేశామని మంగళవారం గాంధారి, ఎస్ ఎస్ నగర్, రామారెడ్డి, పల్వంచ మండలాల్లో పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, స్థానిక తాసిల్దార్, ఎంపీడీవో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీనగర్ లో డ్రైనేజీ వ్యవస్థ లేక అవస్థలు..!

- ఖాళీ స్థలాల్లో నిలిచిన మురుగు నీటిని తరలించాలి
- రేణుక అక్షర మహిళా మండలి



మణుగూరు,సెప్టెంబర్ 16 (భారతశక్తి): మండల పరిధిలోని సమితిసింగారం పంచాయితీలో గల రాజీవ్ గాంధీ నగర్ ఏరియాలో డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని రేణుకా అక్షర మహిళ మండలి సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం మహిళ మండలి సభ్యులు రాజీవ్ గాంధీనగర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తేలికపాటి వర్షాలకే వరద నీరు మురికి నీళ్ళలో కలిసి ఖాళీ స్థలాల్లో, ప్రభుత్వ స్థలాల్లో నిల్వలు ఉండి మురికివాడల్లా దర్శనమిస్తున్నా యన్నారు. దింతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఖాళీగా ప్రదేశాల్లో పిచ్చిమొక్కలు పెరిగి ఆడివిలా దర్శనమిస్తున్నాయని, విషపూరితమైన పాములు, కీటకాలు చేరతాయని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారని వారు తెలిపారు. సంబంధించిన అధికారులు స్పందించి ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు తొలగించి, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని వారు కోరారు. గతంలో పనిచేసిన తహశీల్దార్ ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డులు పెట్టిన వాటిని, నూతన తహశీల్దార్ రాగానే హెచ్చరిక బోర్డులు మాయం అవుతున్నాయని మహిళలు ఆరోపించారు. అధికారులు మారినప్పుడల్లా ప్రభుత్వ భూములకు రెక్కలొస్తున్నాయని మహిళ మండలి సభ్యులు అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో అక్షర మహిళ మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ, సీనియర్ నాయకురాలు ఎండీ షబానా, కోరి శ్యామల, బొడ్డు సౌజన్య, రెడ్డిబోయిన రేణుక, నాంపల్లి రమణ, దేరంగుల సుజత, వసంత, డాకూరి సౌజన్య, కన్నాపురం శైలజ, బడిశా పార్వతి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో మూడు రోజుల జాతీయ మీడియా పర్యటనను ప్రారంభించిన పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ

విజయవాడ,సెప్టెంబర్ 15(భారత శక్తి): భారత ప్రభుత్వ పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ సహకారంతో, రాష్ట్రంలో మూడు రోజుల జాతీయ మీడియా పర్యటనను ఈరోజు ప్రారంభించింది. ఈ పర్యటన ప్రముఖ జాతీయ మరియు ప్రాంతీయ మీడియా



నిపుణులను ఒకచోట చేర్చి, వినూత్నమైన అట్టడుగు స్థాయి పాలనా కార్యక్రమాల అమలును పరిశీలించి నివేదించడానికి వీలు కల్పిస్తుంది.మీడియా ప్రతినిధి బృందానికి పత్రికా సమాచార కార్యాలయం (పంచాయతీ రాజ్) డిప్యూటీ డైరెక్టర్ అదితి అగర్వాల్ నేతృత్వం వహిస్తున్నారు.1వ రోజు ముఖ్యాంశాలు:వెంగళాయపాలెం గ్రామ పంచాయతీ – స్వచ్ఛ రథం పైలట్ ప్రాజెక్ట్ సందర్శనమొదటిగా గుంటూరు గ్రామీణ మండలంలో ఉన్న వెంగళాయపాలెం గ్రామ పంచాయతీలోని స్వచ్ఛ రథం పైలట్ ప్రాజెక్ట్ అమలును జర్నలిస్టులు పరిశీలించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ప్రారంభించిన స్వచ్ఛ రథం అనేది ఒక మొబైల్ యూనిట్ గృహాల నుంచి ఉత్పన్నమయ్యే స్క్రాప్, వ్యర్థ పదార్థాలను మార్పిడి చేసుకుని, సమాన బరువు కలిగిన రోజువారీ నిత్యావసరాలను అందిస్తుంది. గ్రామ స్థాయిలో వ్యర్థాల విభజనను ప్రోత్సహించి స్థిరమైన పారిశుధ్యాన్ని ప్రోత్సహించడమే ఈ చొరవ లక్ష్యం.ఆసియాలోనే అతిపెద్ద మిర్చి యార్డ్ సందర్శన మీడియా బృందం



గుంటూరులోని ఆసియాలోనే అతిపెద్ద మిర్చి (మిరప) మార్కెటింగ్ యార్డ్‌ను సందర్శించింది. అక్కడ వారు మిర్చి యార్డ్ కార్యదర్శి శ్రీమతి చంద్రికతో సంభాషించి, క్షేత్రస్థాయి వాణిజ్య, మార్కెటింగ్ కార్యకలాపాలతో పాటుగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు దోహదపడు తుందో తెలుసు కున్నారు .చింతలపూడి గ్రామ పంచాయితీ – స్వామిత్వ పథకం & గ్రామ సభాసార్ ఏఐ ఆవిష్కరణలుమధ్యాహ్నం, మీడియా బృందం చింతలపూడి గ్రామ పంచాయతీకి చేరుకుని అక్కడ స్వామిత్వ పథకం అమలు గురించి తెలుసుకున్నారు. ఈ చొరవ గ్రామీణ నివాసితులకు చట్టబద్ధమైన ఆస్తి హక్కులను అందిస్తుంది, వారు సంస్థాగత రుణాన్ని పొందటానికి, భూమిని మానిటైజ్ చేయడానికి మరియు వివాదాలను తగ్గించడానికి వీలు కల్పిస్తుంది. ఈ పథకం వారి ఆర్థిక స్థిరత్వాన్ని, భూ యాజమాన్య భద్రతను ఎలా మెరుగుపరిచిందో లబ్ధిదారులు తెలుపుతూ ప్రభుత్వానికి వారి కృతజ్ఞతను వ్యక్తం చేశారు.ఈ సందర్శనలో మంత్రిత్వ శాఖ యొక్క తాజా ఏఐ–ఆధారిత సాధనమైన సభాసార్‌ను గ్రామసభ యొక్క ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరణ పొందారు. పూర్తయిన గ్రామసభల వీడియో రికార్డింగ్‌లను విశ్లేషించడం ద్వారా డాక్యుమెంటేషన్‌ను గణనీయంగా సులభతరం చేసి డిజిటల్ పారదర్శకతను నిర్ధారించేలా ఈ ఏఐ సాధనాన్ని రూపొందించారు. ఇది స్వయంచాలకంగా సమావేశాలను డిజిటల్ విధానంలో పొందుపరుస్తుంది.తోట చందన, అసిస్టెంట్ డైరెక్టర్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, సిబ్బంది మరియు స్థానిక కమ్యూనిటీ నాయకులు ఈ పర్యటనలో పాల్గొన్నారు

# రాష్ట్ర స్థాయి స్త్రీనిధి మహిళా బ్యాంక్ కోశాధికారిగా బీబీపేట మండల అధ్యక్షురాలు ఎస్. స్రవంతి



కామారెడ్డి జిల్లా,(భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 16: ఎస్. స్రవంతి బిబిపేట మండల అధ్యక్షురాలు స్త్రీ నిధి కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ కు రాష్ట్ర స్థాయిలో కోశాధికారిగా ఎంపికయిన సందర్భములో మంగళవారం జరిగిన జిల్లా మహిళా సమాఖ్య సమావేశములో డిఆర్ డిఒ %ఽ% జిల్లా సమాఖ్య పదాదికారులు ఘనంగా సన్మానం చేయడం జరిగింది.
తేది.09.09.2025 రోజున హైదరాబాద్ లో స్త్రీనిధి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ల బోర్డు సమావేహములో కామారెడ్డి జిల్లాకు చెందిన బీబీపేట మండల అధ్యక్షురాలు స్రవంతి కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నిక అయింది. ఈ సందర్భంగా జిల్లా సమాఖ్య ఇసి, ఒబి సభ్యులు, డిపిఎమ్, ఆర్ ఎమ్ స్త్రీనిది, అదనపు డిఆర్ డిఒ, డిఆర్ డిఒ స్రవంతి ని అభినందిస్తూ బాగా పని చేసి మన జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలి అని కోరడం జరిగింది.

# ఎంఐఎస్ కోఆర్డినేటర్ శైలజకు సన్మానం



జిన్నారం,(భారత శక్తి ప్రతినిధి)సెప్టెంబర్16 :
సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల పరిషత్తు కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు మంగళవారం గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ ఎంఈఓ కుమారస్వామి ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల్లో విద్యాభివృద్ధికి సేవలందించిన ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. మానవ వనరుల అభివృద్ధిలో విశేష సేవలను అందిస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్ శైలజకు ఎంఈఓ జెడ్పిహెచ్ఎంలు విజయ్ కుమార్ తదితరులు జ్ఞాపికను అందించి ఘనంగా సన్మానించారు. అవార్డు అందుకోవడం పై ఎంఐఎస్ కోఆర్డినేటర్ శైలజ సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అవార్డు గ్రహీతలు, జడ్పీహెచ్ఎంలు, సీఆర్పీలు సిబ్బంది పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి



వరంగల్ ప్రతినిధి,(భారత శక్తి)సెప్టెంబర్16:
మంగళవారం వరంగల్ తూర్పు నియోజకవర్గం దూపకుంటలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను, దేశాయిపేట్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను, వరంగల్ రామ్కి లో నూతన కలెక్టర్ ఆఫీస్ సందర్శించిన కొండా మురళీధర్ రావు . ఈ సందర్భంగా కొండా మురళీధర్ రావు మాట్లాడుతూ నూతన కలెక్టర్ ఆఫీస్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు తెలియజేశారు. పేదల కల సహకారం అయ్యేలా అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను త్వరలోనే పంపిణీ చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. పేదవారి ఆశయాన్ని నెరవేర్చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల ముందు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తామని ఈ సందర్భంగా కొండ మురళి తెలిపారు. కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేయడమే మా లక్ష్యం అని కొండా మురళి తెలిపారు.

# బైంసా నూతన ఎంపీఓగా వీరమల్ల చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరణ



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, (భారత శక్తి) సెప్టెంబర్ 16:
బైంసా మండల (ఎంపీఓ)గా వీరమల్ల చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో దిలావర్పూర్ గ్రామపం చాయతీలో ఈ ఓ గ్రేడ్ వన్ అధికారిగా విజయవంతంగా పని చేసిన వీరమల్ల చంద్రశేఖర్, పరిపాలనా అనుభవంతో బైంసా ఎంపీఓగా నియమితులయ్యారు.బైంసా మండల అభివృద్ధిలో తనదైన ముద్రవేయడమే లక్ష్యంగా పనిచేస్తానని వీరమల్ల చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రజలతో నేరుగా సమన్వయం కలిగి, మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# యూనిట్ల అనుమతులు నిర్దిష్ట సమయంలోగా ఇవ్వాలి..

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

## డిమాండ్‌ను బట్టి నైపుణ్య శిక్షణ ఇవ్వాలి

ఖమ్మం ప్రతినిది, (భారత శక్తి ) సెప్టెంబర్ 16:
జిల్లాలో యూనిట్ల స్థాపన అనుమతికై వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖలు నిర్దిష్ట సమయంలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి టిజి ఐ-పాస్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. సమావేశంలో 4 జూన్, 2025 లో నిర్వహించిన గత సమావేశంలో చర్చించిన 25 యూనిట్లకు సంబంధించి వివిధ రకాల 57 అనుమతుల విషయమై అభ్యంతరాలను శాఖల వారిగా కలెక్టర్ సమీక్షించారు. ఇట్టి యూనిట్లలో గ్రానైట్, రైస్ మిల్లులు, క్రూడ్ పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు తదితరాలున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పారిశ్రామిక యూనిట్ల స్థాపనకు వనరులు ఉన్నాయన్నారు. పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే పారిశ్రామిక ఔత్సాహికులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలన్నారు. అనుమతులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి వేగంగా ఇవ్వాలన్నారు. అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే పూర్తి పిదప ఖమ్మం కేంద్ర బిందువు అవుతుందన్నారు. డిగ్రీ కళాశాల, ఐటిఐ లలో పరిశ్రమల్లో డిమాండ్ ఉన్న కోర్సులకు సంబంధించి శిక్షణకు కార్యాచరణ చేయాలన్నారు. జిల్లాలో ఉన్న పరిశ్రమలలో ఏ ఏ పరిశ్రమలో ఏ ఏ రకాల ఉపాధికి ఆస్కారం ఉన్నదో, ఆ దిశగా మానవ వనరులను తీర్చిదిద్దాలన్నారు. పరిశ్రమల స్థాపనతో స్థానిక యువతకు ఉపాధి కలుగుతుందని కలెక్టర్ అన్నారు.



ఈ సమావేశంలో ఇండస్ట్రీస్ జీఎం సీతారాం, ఏడి మైన్స్ సాయినాథ్, ఆర్డీవో వెంకటరమణ, జిల్లా ఉపాధి కల్పన అధికారి కె. శ్రీరామ్, వివిధ శాఖల అధికారులు, గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు పి. యుగంధర్, ప్రధాన కార్యదర్శి కె. గోపాల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల సమీక్ష సమావేశం

- మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఆర్డబ్ల్యూఎస్ ఇరిగేషన్ శాఖల అధికారులతో సమీక్షా
- సమావేశంలో పాల్గొన్న టిజిఐఐసి చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి దంపతులు



సంగారెడ్డి, ((భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 16 :
జిల్లాలోని సదాశివపేట సంగారెడ్డి మున్సిపాలిటీల సమీక్ష సమావేశాన్ని మంగళవారం సంగారెడ్డి లోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఆర్డబ్ల్యూఎస్ ఇరిగేషన్ శాఖల అధికారులతో టీజీఐసీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సదాశివపేట సంగారెడ్డి మున్సిపాలిటీలలో మిషన్ భగీరథ నీరు ఎర్రగా వస్తున్నాయని నీటి నాణ్యత లోపించిందని ఫిర్యాదులు వస్తున్నాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సంగారెడ్డి సదాశివపేట రెండు మున్సిపాలిటీలలో కొత్త కాలనీలకు అవసరమైన పైప్ లైన్లు తక్షణమే వివరాలతో సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. మంజీరా వాటర్ స్కీంలో భాగంగా సదాశివపేట మున్సిపాలిటీకి ఒక ఇంటెక్ వెల్ ఫిల్టర్ బెడ్ తో పాటు నాణ్యత గల పైప్ లైన్లను ఏర్పాటు చేయాలన్నారు. సంగారెడ్డి మున్సిపాలిటీకి అదనంగా ఫిల్టర్ బెడ్ ఇంటెక్ వెల్ ఏర్పాటు చేయాలని సూచించారు. గతంలో సంగారెడ్డి మున్సిపాలిటీలో నాలుగు వార్డులకు కలిపి ఒక ట్యాంకు చొప్పున ఏర్పాటు చేసిన విషయాన్ని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అధికారుల దృష్టికి తెచ్చారు. అదేవిధంగా ఇప్పుడు కూడా కాలనీలకు సరిపడా ట్యాంకుల ఏర్పాటుకు ప్రాజెక్టులో ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. 50 ఏళ్లకు సరిపడా పైప్ లైన్ల నిర్మాణం చేపట్టాలన్నారు. వచ్చే నెల 15వ తేదీ సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ఈ విషయంపై దామోదర రాజనర్సింహాతో సైతం మాట్లాడతానని అధికారుల వద్ద ప్రస్తావించారు. ఈనెల 30న మంజీరా సరఫరాకు సంబంధించి కన్సల్టెన్సీ ప్రతినిధులు పూర్తి ప్రాజెక్ట్ రిపోర్ట్ రెడీ చేయాలని సూచించారు. టీజీఐసీ చైర్ పర్సన్తో కలిసి ఈఎన్సీని కలిసి ప్రాజెక్ట్ రిపోర్ట్ సబ్మిట్ చేస్తామని జగ్గారెడ్డి తెలిపారు. కొత్త కాలనీకు సరిపడా నీరు అందించేందుకు అవసరమైన ట్యాంకుల నిర్మాణం చేయాలన్నారు. అసైన్మెంట్ మైండ్ తో తాత్కాలిక ప్రతిపాదనలు తయారు చేయవద్దు అన్నారు. రానున్న 50 ఏళ్లకు సరిపడా డిజైన్ సిద్ధం చేయాలని సూచించారు. సీఎం దగ్గర నుంచి నిధులు తీసుకువస్తానని ప్రతిపాదనల విషయంలో అధికారులు కాంప్రమైజ్ కావద్దన్నారు. ఈ రెండు మున్సిపాలిటీలకు మిషన్ భగీరథ నుండి కాకుండా డైరెక్టా మంచేనా నీరు సరఫరా కావడమే తన టార్గెట్ గా ప్రస్తావించారు. ఏకకాలంలో రెండు గంటల పాటు మున్సిపాలిటీ మొత్తానికి మంజీరా నీరందించాలన్నారు. సదాశివపేట మున్సిపాలిటీలో ఇప్పుడున్న జనాభాకు అదనంగా మరో 50 వేల జనాభాకు సరిపడా ట్యాంక్ నిర్మాణాలు చేపట్టాలన్నారు. రానున్న రెండు సంవత్సరాలలో ఈ రెండు మున్సిపాలిటీలకు మంజీరా నీటి సరఫరా ప్రాజెక్టు పూర్తి కావాలని తన ఉద్దేశం అన్నారు. సదాశివపేట మున్సిపాలిటీకి డైరెక్ట్ గా సింగూర్ ప్రాజెక్టు నుండి 25 ఎంఎల్డి నీటిని తీసుకు వచ్చేలా ఇరిగేషన్ ఈఎన్సికి మున్సిపల్ సెక్రటరీకి ఇరిగేషన్ మంత్రికి వినతి పత్రం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. సంగారెడ్డి మున్సిపాలిటీ భవిష్యత్తు అవసరాలకు సరిపడా 50 ఎం ఎల్టీ నీటిని మంజీరా బ్యారేజీ నుండి తీసుకునేందుకు సంబంధిత ఉన్నతాధికారులకు మంత్రికి లేఖలను ఇవ్వాలని నిర్ణయించుకున్నామన్నారు. సదాశివపేట మున్సిపాలిటీకి ప్రస్తుతం రోజుకు గంటన్నర నీరు సరఫరా చేయాలంటే ఏం చేయాలి అని అధికారులను ప్రశ్నించారు. తాళ్లపల్లిలోని 10 ఎమ్మెల్యే సంగారెడ్డి మున్సిపాలిటీకి ప్రత్యేక లైన్ వేసి సరఫరా చేస్తే ఇక్కడి కేటాయింపుల నుంచి సదాశివపేట మున్సిపాలిటీకి నీటి సరఫరా అడ్జస్ట్ చేయవచ్చని జగ్గారెడ్డికి అధికారులు



వివరించారు. వీటి కోసం దాదాపు 10 కోట్ల నిధులు కావాలని అధికారులు వెల్లడించారు. సంగారెడ్డి నియోజకవర్గంలోని నీటి సరఫరాకు ఉన్న చిన్న చిన్న ఇబ్బందులు వినియోగంలో లేని ఓవర్ హెడ్ ట్యాంకులను పునరుద్ధరించేందుకు మరొక ఐదు కోట్ల నిధుల కోసం మంత్రి సీతక్కకు లేఖ రాయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తాళ్లపల్లి ఫిల్టర్ బెడ్ నుండి ప్రత్యేక లైన్ వేస్తే సంగారెడ్డి కంది మండలాల్లోని 54 గ్రామాలకు మంచినీటి సరఫరా చేయడంతో పాటు సదాశివపేట మున్సిపాలిటీకి నీటి అడ్జస్ట్మెంట్ చేయవచ్చు అన్నారు. తాళ్లపల్లి నుండి పైప్లైన్ నిర్మాణానికి సంబంధించి నిధుల కోసం మంత్రి సీతక్కకు లెటర్ ఇస్తామన్నారు. సంగారెడ్డి కంది మండలాల్లోని 18 తండాల్లో నీటి సరఫరాకు ఉన్న ఇబ్బందులు సమస్యలపై సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించి గ్రామాల్లో తండాల్లో కొత్త కాలనీలో అవసరమైన చోట ట్యాంకుల నిర్మాణానికి అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలు వెంటనే తయారు చేయాలని అధికారులకు సూచించారు. సీఎంతోపాటు మున్సిపల్ ఈఎంసీ కి లెటర్ ఇవ్వాలి అని ఆయన నిర్ణయించారు. రాజంపేట నుండి హాస్టల్ గడ్డ ఈద్గా వరకు రోడ్డు నిర్మాణం కు ఫిల్టర్ బెడ్లో సిసి రోడ్డు నిర్మాణానికి దసరా తర్వాత శంకుస్థాపన జరగాలన్నారు. వెంటనే పనులు ప్రారంభం కావాలని అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. రెండు మున్సిపాలిటీల పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు నిరంతరం కృషి చేయాలని జగ్గారెడ్డి దంపతులు సూచించారు. మున్సిపాలిటీల అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణా సాయుధ పోరాట యోధుల త్యాగాలు చిరస్మరణీయం

- సెప్టెంబర్ 17 భారతదేశంలో విలీనం చేసిన సుదినం
- సాయుధ పోరాట స్ఫూర్తితో నయా దోపిడికి వ్యతిరేకంగా పోరాడాలి
- సాయుధ పోరాటంలో అన్ని వర్గాల వారు ప్రాణత్యాగం చేశారు

ఖమ్మం ప్రతినిది, (భారత శక్తి ) సెప్టెంబర్ 16:
నైజాం నిరంకుశ పాలన అంతం కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిగా కేంద్ర, రాష్ట్ర నయాదోపిడికి వ్యతిరేకంగా ప్రజలు పోరాటానికి సిద్దం కావాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ రైతాంగా పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మధిర పట్టణంలోని తెలంగాణ సాయుధ పోరాట యోధులు వాసిరెడ్డి వెంకటపతి స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నేతలు అమరవీరులకు నివాళు లర్పించారు. అనంతరం ఊట్ల కొండలరావు అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ,తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం స్వాతంత్ర్య భారత చరిత్రలో అపూర్వమైన అధ్యాయం అని,జమీందారీ వ్యవస్థ కూల్చివేత కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన పోరాటయోధుల త్యాగాలు శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ఆ కాలంలో కమ్యూనిస్టు పార్టీ పిలుపుతో వేలాది మంది రైతులు,కూలీలు,గిరిజనులు చేతిలో తుపాకీ, కొడవళ్ళు,విల్లు,బాణాలు పట్టుకుని జమీందారుల దోపిడీని ఎదిరించారని గుర్తుచేశారు. ఈ పోరాటం వల్లే వేలాది ఎకరాల భూమి పేదలకు పంచబడిందని, పల్లెల్లో గణనీయమైన సామాజిక మార్పులు చోటుచేసుకున్నాయని వివరించారు. రాచరికానికి, నిర్బంధానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని బీజేపీ, ఎంఐఎం పరస్పరం పబ్బంగడుపుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, సాయుధ పోరాటంలో నిజాం రాజుకు వ్యతిరేకంగా పోరాడిన వారిలో అన్ని వర్గాల వారు ప్రాణత్యాగం చేశారని బిజెపి,ఎంఐఎం గుర్తుంచుకోవాలన్నారు. కమ్యూనిస్టులు చేపట్టిన వీరోచిత పోరాటాలను తట్టుకోలేకనే



నైజాం రాజు హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిన సుదినం సెప్టెంబర్ 17 అని పేర్కొన్నారు. సాయుధ పోరాట అమరులు ఆశించిన లక్ష్యాల సాధన దిశగా పోరాటాలు ముమ్మరం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు,ఏనుగు గాంధీ,ఏనుగు వెంకటేశ్వరరావు,ఎం ఏ రహీం,సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాష్ రావు,మంగళగిరి రామాంజనం,పంగా శేషగిరిరావు,కొండూరు నాగేశ్వరావు,జల్లా బ్రహ్మం, పరుచూరి రాము,అన్నవరపు సత్యనారాయణ ఊట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం మహాదానం

## జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి



గుమ్మడిదల, (భారత శక్తిప్రతినిధి) సెప్టెంబర్ 16:
రాష్ట్ర భాజపా పార్టీ పిలుపుమేరకు సేవపక్షం షాప్ లో భాగంగా మంగళవారం నాడు రక్తదాన శిబిరాన్ని మండల అధ్యక్షులు కావలి ఐలేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి పాల్గొన్నారు. శిబిరానికి హాజరైన లబ్ధిదారులకు ప్రీమియం వాలంటరీ బ్లడ్ సెంటర్ ఏ యూనిట్ ఆఫ్ తలసాని వెల్ఫేర్ సొసైటీ వారి బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్లను జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాపరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిలు రాజు, రవీందర్ రెడ్డి, మాజీ మహిళా మోర్చా అధ్యక్షురాలు సృజన, లక్ష్మీ బిజెవైఎం మండల అధ్యక్షులు అనిల్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు యాదగిరి,మాజీ ప్రధాన కార్యదర్శిలు రాఘవరెడ్డి, రామ్ రెడ్డి మండల సీనియర్ నాయకులు జైపాల్ రెడ్డి ముత్యాల గౌడ్, సత్యనారాయణ, సంజీవ సాయికుమార్, మహిపాల్ రెడ్డి,రాజు నరసింహ, రాజశేఖర్ రెడ్డి,సామల యాదగిరి, కుమ్మరి భాగ్య, మహిళా కార్యకర్తలు అనిత, సవిత బూత్ కమిటీ సభ్యులు భారీ ఎత్తున కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కోహ్లీ బయోపిక్‌కు దర్శకత్వం వహించను..

టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ బయోపిక్ గురించి ఎప్పటినుంచో వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ కోహ్లీ బయోపిక్ గురించి మాట్లాడారు. ఒకవేళ ఈ బయోపిక్ తెరకెక్కించే అవకాశం తనకు వచ్చినా చేయనని చెప్పారు. కోహ్లీ అంటే తనకు అభిమానం ఉన్నప్పటికీ బయోపిక్ స్వీకరించనని అన్నారు.

“కోహ్లీ ఇప్పటికే క్రికెట్ అభిమానులతో పాటు ఎంతోమంది దృష్టిలో హీరో. చిన్న పిల్లలు కూడా అతడిని విపరీతంగా అభిమానిస్తారు. ఒకవేళ నేను ఎవరిదైనా బయోపిక్ చేయాల్సివస్తే కష్టమైన సబ్జెక్ట్‌నే ఎంచుకుంటాను. ఒక సాధారణ వ్యక్తి జీవితాన్ని తెరపై చూపిస్తాను. కోహ్లీ చాలా గొప్ప వ్యక్తి. నాకు వ్యక్తిగతంగా తెలుసు. అందంలోనే కాదు.. వ్యక్తిత్వంలోనూ ఆయన ప్రశంసనీయుడు. త్వరగా ఎమోషనల్ అవుతాడు. ఒక్క మాటలో చెప్పాలంటే కోహ్లీ ఓ అద్భుతం” అని అనురాగ్ కశ్యప చెప్పారు. ఇక కోహ్లీ బయోపిక్ గురించి వార్తలు రావడం ఇదేం తొలిసారి కాదు.. ఈ బ్యాటింగ్ మ్యాస్ట్రోపై బాలీవుడ్ బడా నిర్మాణసంస్థ సినిమా తీయనుందంటూ గతంలో వార్తలు వచ్చాయి. అంతేకాదు, అందులో టాలీవుడ్ హీరో రామ్‌చరణ్ నటించనున్నాడని కూడా అప్పట్లో జోరుగా ప్రచారం జరిగింది. ఈ విషయంపై అప్పుడు రామ్‌చరణ్ మాట్లాడుతూ.. ‘కోహ్లీ నాకు చాలా ఇష్టమైన క్రికెటర్. అతడు ఎంతోమందికి స్ఫూర్తి. నాకు తన పాత్ర పోషించే అవకాశం వస్తే ఎంతో సంతోషిస్తా. అది అద్భుతంగా ఉంటుంది” అంటూ తన కోరికను బయటపెట్టారు.


# సినీ రంగం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్ రూపకల్పన



తెలంగాణ రాష్ట్రంలో సినీ రంగాభివృద్ధికి కావాల్సిన అనుమతులన్నీ ఒకే విండో ద్వారా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ‘ఫిలిమ్స్ ఇన్ తెలంగాణ’ పేరుతో ఓ ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందిస్తోంది. తెలంగాణలో సినిమా చిత్రీకరణలకు, థియేటర్ల నిర్వహణకు పొందాల్సిన అన్ని అనుమతుల్ని ఈ వెబ్‌సైట్‌తో ఒకే విండో ద్వారా పొందేందుకు ప్రభుత్వం వీలు కల్పించనుంది. ఈ సులభతర అనుమతులపై రూపొందిస్తున్న వెబ్‌సైట్‌పై సోమవారం సంబంధిత శాఖలు, ఫిల్మ్ ఇండస్ట్రీ ప్రతినిధులతో హైదరాబాద్‌లో ప్రత్యేక వర్క్ షాప్ జరిగింది. దీనికి తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు, ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ సి.హెచ్.ప్రియాంక, టూరిజం కార్పొరేషన్ ఎండీ వల్లూరు క్రాంతిలతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ.. “రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని రకాలుగా చేయూతనిస్తున్నారు. ఈ సదావకాశాన్ని ఇండస్ట్రీ పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలి. అంతర్జాతీయ స్థాయి సినీ నిర్మాతలు కేవలం స్క్రిప్ట్‌తో వస్తే వారి సినిమా నిర్మాణానికి కావాల్సిన షూటింగ్ లొకేషన్లు, వివిధ శాఖల నుంచి కావాల్సిన అనుమతులు ఈ వెబ్‌సైట్ ద్వారా సులభంగా పొందవచ్చు. అలాగే సినిమా థియేటర్ల నిర్వహణకు కావాల్సిన బీ-ఫామ్ జారీ విధానాన్ని తేలికగా ఆన్‌లైన్ ద్వారా పొందే విధానాన్ని ప్రవేశ పెడుతున్నాం. సినిమా థియేటర్ల నిర్వహణకు ఇప్పటి వరకు నగరాల్లో అయితే సంబంధిత పోలీసు కమిషనర్లు, జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో అయితే ఆయా జిల్లాల అడిషనల్ కలెక్టర్లు జారీ చేసేవారు. కానీ, ఇకపై ఆ అనుమతులన్నీ ఆన్‌లైన్ ద్వారా జారీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ హోంశాఖతో చర్చించి విధి విధానాలు రూపొందిస్తున్నాం. ఈ వెబ్‌సైట్‌లో సినీ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక విభాగాల టెక్నీషియన్లు, రాష్ట్రంలో వివిధ నగరాల్లో అందుబాటులో ఉన్న హోటళ్లతో పాటు సంపూర్ణ సమాచారం అందుబాటులో ఉంచనున్నాం” అన్నారు.


# విజయ్ కోసం ‘మమ్మీ’ విలన్

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా చిత్రం రూపొందుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. రష్మిక కథానాయిక. ఈ సినిమా



ఇటీవలే చిత్రీకరణ ప్రారంభించుకుంది. ఇందులో విజయ్‌ను ఢీ కొట్టే విలన్ పాత్ర కోసం ప్రముఖ హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూను రంగంలోకి దింపింది చిత్ర బృందం. ఆర్నాల్డ్ ‘ది మమ్మీ’, ‘ది మమ్మీ రిటర్న్స్’ చిత్రాలతో భారతీయ ప్రేక్షకులకూ సుపరిచితమైన సంగతి తెలిసిందే. ఇప్పుడాయన విజయ్ దేవరకొండ సినిమాతో తొలిసారి భారతీయ చిత్రసీమలోకి అడుగు పెడుతున్నారు. ఈ సినిమాలో ఆయన పాత్ర అందర్నీ ఆశ్చర్యపరిచేలా ఉండనుందని.. ఇప్పటికే తను ఈ చిత్ర సెట్లోకి అడుగు పెట్టారని.. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ కొనసాగుతోందని తెలిసింది.

# శ్రీరాముడి పాత్రకు సంగీతమివ్వడం మిరాయ్‌లో ఓ సవాల్



‘మిరాయ్’ చిత్రంతో థియేటర్లలో అలరిస్తున్నారు తేజ సజ్జా. కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కించిన ఈ సినిమాకి గౌర హరి సంగీతమందించారు. ‘హను-మాన్’ విజయం తర్వాత ఆయన నుంచి వచ్చిన రెండో చిత్రమిది. ఇది ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చిన నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు గౌర హరి.

“ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి దక్కుతున్న ఆదరణ ఆనందాన్నిస్తోంది. దీనికోసం మేము పడిన కష్టాన్ని మరిపించింది. ఇది విడుదలైనప్పటి నుంచి నా ఫోన్ నిరంతరాయంగా మోగుతూనే ఉంది. సినీ వర్గాలతో పాటు ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ సినిమా తొలి కాపీ చూసినప్పుడే ఇది అంతర్జాతీయ స్థాయికి దగ్గరగా ఉందనిపించింది. ముఖ్యంగా ఈ చిత్రం కోసం కార్తీక్ రాసుకున్న కథ.. ఆయన తీసిన విజువల్స్ ఓ గొప్ప సంగీతమందించేలా నాకు స్ఫూర్తినిచ్చాయి. దీని కోసం రకరకాల మ్యూజిక్ జానర్స్ టచ్ చేసేలా నన్ను ప్రేరేపించాయి. ఒకవేళ అలాంటి విజువల్స్ రాకపోయి ఉంటే దీంట్లో నా సంగీతం ఇంత గొప్పగా ఉండేది కాదేమో”.

“ఈ సినిమాలో మిగతా పాత్రలతో పోలిస్తే రాముడి పాత్ర తెరపైకి వచ్చేటప్పుడు ఇచ్చిన నేపథ్య సంగీతం నాకు చాలా సవాల్‌గా అనిపించింది. మిగిలిన పాత్రలన్నింటికీ ఒకటి రెండు రోజుల్లో బీజీఎం ఇచ్చేస్తే.. దీనికోసం పదిరోజులు కేటాయించాల్సి వచ్చింది. ఎందుకంటే దాదాపు పది నిమిషాల పాటు సాగే ఆ క్లైమాక్స్ ఎపిసోడ్‌లో చాలా కోణాలు కనిపిస్తాయి. ఓవైపు రాముడిని వర్ణిస్తూనే.. ఈ కథలో ఆయన స్క్రీన్ ప్రెజెన్స్‌ను సినిమాటిక్ ఫీల్‌తో చెప్పడం కోసం కొన్ని చిన్న ప్రయోగాలు చేశా. “రుధిర కరణ.. రుధిర పవన.. రుధిర విభవ” పాటకు.. “భజే రామచంద్రం..” అనే రామాష్టకం జోడించాను. కానీ, ఇది వింటున్నప్పుడు ఎక్కడా విడివిడిగా వినిపించదు. ఒకే ఫ్లోలో సాగిపోతున్న పాటలాగే ఉంటుంది. అలాగే విరామ సన్నివేశాల్లో వచ్చే సంపాతి పక్షి ఎపిసోడ్ కోసం ఒకేసారి నాలుగు జానర్ల మ్యూజిక్ వినిపించే ప్రయత్నం చేశా”.

“నేను నాపై ఏ ఇమేజ్ ప్రభావం ఉండకూడదనుకుంటా. ఒకవేళ అలా ఉంటే నాదైన శైలి చూపించుకోవడానికి చాలా సమయం పట్టేస్తుంది. ‘హను-మాన్’ సినిమా చూశాక చాలా మంది ‘మీ సంగీతం కీరవాణి శైలిలో ఉంద’ని చెప్పడం విన్నా. అందుకే నాపై ఆ ముద్ర ఉండకూడదని ‘మిరాయ్’ విషయంలో చాలా కొత్త జానర్స్‌ను ప్రయత్నించా. ఎందుకంటే ఆయన లాంటి గొప్ప వ్యక్తితో నన్ను పోల్చడం ఓవైపు ఆనందంగా ఉన్నా.. మరోవైపు నాలో ఒక భయాన్ని తెచ్చి పెడుతుంటుంది. రేపటి రోజున తెలిసో తెలియకో నా వల్ల చిన్న పొరపాటు జరిగినా అది పెద్ద అపవాదు తెచ్చిపెట్టేస్తుంది”.

“హను-మాన్’ చిత్రానికి సంగీతపరంగా నాకు రావాల్సిన గుర్తింపును ముగ్గురికి పంచిపెట్టారు. ఆ చిత్ర నిడివి దాదాపు 2గంటల 38నిమిషాలుంటే.. దాదాపు రెండున్నర గంటల సినిమాకి నేను సంగీతమిచ్చా. కానీ, ఆ మిగిలిన టైమ్‌లో ఇద్దరు రెండు పాటలిచ్చారని మొత్తం సినిమాకి ముగ్గురు పని చేశారని చెప్పడం కాస్త బాధగా అనిపించింది. అందుకే ఈసారి చేస్తే ‘ఇది గౌరి ఒక్కడే చేశాడ’ని అందరూ చెప్పుకునేలా ఉండాలని కసిగా ‘మిరాయ్’ కోసం రంగంలోకి దిగా. ఇప్పుడు దీనికి మంచి గుర్తింపు రావడం సంతృప్తిగా ఉంది. ప్రస్తుతం నేను పీపుల్ మీడియా ఫ్యాక్టరీలోనే ‘జాంబిరెడ్డి 2’, ‘పినాక’, ‘రణమండల’, ‘కాలచక్ర’ అనే సినిమాలకి పని చేస్తున్నా”.

# బాహుబలి స్టైల్‌లో ప్రపోజ్ చేస్తే ఒప్పుకుంటారా?

“అనన్యకు ఇష్టమైన సినిమా ‘బాహుబలి’.. అందుకే నేను ఆమెకు బాహుబలి స్టైల్‌లోనే నా ప్రేమను తెలియజేయబోతున్నా” అంటున్నాడు ఓ ప్రేమికుడు. మరి బాహుబలి స్టైల్‌లో ప్రపోజ్ చేస్తే నిజంగానే ప్రేమను ఒప్పుకుంటారా అని అనుకుంటున్నారా? అయితే ‘సన్నీ సంస్కారి కీ తులసి కుమారి’ సినిమా చూడాల్సిందే



‘సన్నీ సంస్కారి కీ తులసి కుమారి’

అంటున్నాయి సినీ వర్గాలు. బాలీవుడ్ యువకథానాయిక జాన్వీ కపూర్, వరుణ్ ధావన్ జంటగా నటిస్తున్న చిత్రమిది. శశాంక్ ఖైతాన్ దర్శకుడు. అక్టోబరు 2న రాబోతుందీ చిత్రం. ఈ నేపథ్యంలోనే ప్రచార పర్వంలో భాగంగా ట్రైలర్‌ను ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. “దేవదాస్, పారూ లాంటి విషాద గీతాలు పాడాలనుకుంటున్నావా? లేకపోతే ప్రేమ కోసం పోరాడాలనుకుంటున్నావా?” లాంటి సంభాషణలతో ఆద్యంతం ఆసక్తిగా సాగుతోందీ ట్రైలర్. రోహిత్ సరాఫ్, సన్యా మల్హోత్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు. కరణ్ జోహార్ నిర్మాత.

# పెళ్లి ఎప్పుడో చెప్పిన బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్..!



అలనాటి అందాల తార శ్రీదేవి తనయ, బాలీవుడ్ బ్యూటీ జాహ్నవి కపూర్ ఎట్టకేలకు తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ఊహాగానాలపై స్పందించి దింది. శిఖర్ పహారియాతో పెళ్లి వార్తలు తెగ హల్‌చల్ చేస్తున్న వేళ.. ఈ వార్తలన్నింటికి చెక్ పెట్టింది. పెళ్లికి ఇంకా సమయం ఉందని.. ప్రస్తుతం తన దృష్టి అంతా నటనపైనే ఉందని స్పష్టం చేసింది. ఇటీవల ముంబయిలో జరిగిన ‘సన్నీ సంస్కారి కీ తులసి కుమారి’ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ సందర్భంగా జాన్వీ మీడియాతో మాట్లాడింది. ఈ సందర్భంగా ‘మీ పెళ్లి ఎప్పుడు?’ అనే ప్రశ్న ఎదురైంది. దీనికి జాన్వీ స్పందిస్తూ.. ‘ఇప్పుడంతా నా కెరీర్ మీదే ఫోకస్ ఉంది. పెళ్లికి సమయం ఉంది’ అంటూ బదులిచ్చింది. అయితే, శిఖర్ పహారియాతో జాన్వీ రిలేషన్‌లో ఉన్నట్లుగా గతకొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. మహారాష్ట్ర మాజీ సీఎం సుశీల్ కుమార్ షిండే మనవడు శిఖర్‌తో జాన్వీ పలు ఈవెంట్లకు కలిసి రావడం, ఆమె ఫోన్ స్పీడ్ డయల్‌లో శిఖర్ పేరు ఉండడం, ‘శిఖు’ పేరుతో ఉన్న నెక్లెస్ ఆమె ధరించడంతో ప్రస్తుతం ఇద్దరు రిలేషన్‌లో ఉన్నారని.. త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారని వార్తలు వచ్చాయి. ఈ తాజా ఈవెంట్‌లో శిఖర్ పేరును ప్రస్తావించకపోయినా.. పెళ్లి వార్తలపై జాన్వీ ఓ క్లియర్ స్టేట్‌మెంట్ ఇవ్వడం ఇదే తొలిసారి. ఇక జాన్వీ సినిమాల విషయానికి వస్తే శశాంక్ ఖైతాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘సన్నీ సంస్కారి కీ తులసి కుమారి’ సినిమాలో జాన్వీ వరుణ్ ధావన్‌తో కలిసి నటిస్తున్నది. ఈ సినిమా అక్టోబర్ 2న థియేటర్లలో విడుదల కానుంది. అలాగే, గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్‌తో తెలుగులో ‘పెద్ది’ సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే.

# ఆ పరిస్థితులే నిర్మాతగా మార్చాయి

‘చిత్రపరిశ్రమలో నాలా ఎవరు ఇబ్బందిపడకూడదనే నిర్మాణ సంస్థను స్థాపించాన”ని అంటోంది అందాల తార ప్రియాంక చోప్రా. త్వరలో అగ్రహీరో మహేశ్ బాబుతో కలిసి తెలుగు ప్రేక్షకుల్ని పలకరించడానికి సిద్ధమవుతోంది. వైవిధ్యమైన కథలతో నటిగా అలరిస్తూనే.. నిర్మాతగా కూడా రాణిస్తోంది. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ప్రియాంక.. పర్పుల్ పెబుల్ పిక్చర్స్ పేరుతో సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించడానికి అప్పటి బాలీవుడ్ పరిస్థితులే కారణమని అంటోంది. ‘

# తల్లి కాబోతున్న మరో స్టార్ హీరోయిన్.. కొద్ది రోజులలో గుడ్ న్యూస్ చెప్పనున్నారా..

ఇటీవలే వరుణ్ తేజ్-లావణ్య త్రిపాఠి దంపతులు తల్లిదండ్రులుగా ప్రమోషన్ పొందడంతో మెగా ఫ్యాన్స్ సెలబ్రేషన్స్‌లో మునిగిపోయారు. ఇదే సమయంలో బాలీవుడ్‌లోనూ మరో స్టార్ కపుల్ నుంచి గుడ్ న్యూస్ రానుందన్న టాక్ ఫిలింనగర్‌లో చక్కర్లు కొడుతోంది. ఆ జంట మరెవరో కాదు విక్కీ కౌశల్ %-% కత్రినా కైఫ్. విక్కీ కౌశల్‌తో 2021 డిసెంబర్ 9న రాజస్థాన్‌లోని సిక్స్ సెన్సెస్ ఫోర్ట్ బర్వాడాలో వెడ్డింగ్ తర్వాత, కత్రినా సినిమాలకు కొంత గ్యాప్ ఇచ్చి, వ్యక్తిగత జీవితానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోంది. అప్పటి నుంచే “కత్రినా గర్భవతి” అనే ఊహాగానాలు పలుమార్లు వినిపించాయి. అయితే వీటిని ప్రతిసారి కత్రినా-విక్కీలు ఖండిస్తూ వచ్చారు. ఒక సందర్భంలో విక్కీ కౌశల్ స్వయంగా స్పందిస్తూ, “అలాంటిదేమీ లేదు. ఏదైనా ఉంటే మేమే అధికారికంగా చెబుతాం,”అని క్లారిటీ ఇచ్చారు. అయినప్పటికీ ఆ రూమర్లు మాత్రం మళ్లీ మళ్లీ పుట్టుకొస్తూనే ఉన్నాయి. ఇటీవల కత్రినా కొన్ని ఈవెంట్లకు హాజరుకాలేకపోవడం, అలాగే ఆమె బయట కనిపించినప్పుడు లూస్ దుస్తులు ధరించడాన్ని కొందరు నెటిజన్లు గమనించడంతో ఆమె ‘‘తల్లి కాబోతున్నారేమో’’ అనే వార్తలు వెలుగు చూసాయి. ఫిల్మ్ నగర్ వర్గాల్లో ఈసారి మాత్రం “ఇది నిజమే కావచ్చు” అనే గట్టిపాటిగా చర్చ నడుస్తోంది.

ఇంకా విక్కీ %-% కత్రినా జంట నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కానీ ఈ జంట గురించి బాలీవుడ్ మీడియాలో మాత్రం జోరుగా వార్తలు వినిపిస్తున్నాయి. మరి తల్లి కాబోతున్నారన్న వార్తలపై కత్రినా ఎలా స్పందిస్తుందో, ఎప్పుడు అధికారికంగా చెబుతారో చూడాలి. కానీ అభిమానులు మాత్రం ఈ జంట నుంచి గుడ్ న్యూస్ వచ్చే రోజు కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కాగా, కత్రినా ఈ మధ్య సినిమాలు తగ్గించింది. తెలుగులో మల్లీశ్వరి అనే సినిమాతో కత్రినా సందడి చేసిన విషయం



# ముమ్మాటికీ సెప్టెంబర్ 17 తెలంగాణ స్వాతంత్ర్య దినమే!


హైదరాబాద్, సెప్టెంబర్ 16 (భారత శక్తి) : నాటి హైదరాబాద్ సంస్థానంలో తెలంగాణ 8 జిల్లాలు మరాఠ్వాడ 5 జిల్లాలు కర్ణాటక 3 జిల్లాలు మొత్తం 16 జిల్లాలు ఉండేవి. దేశానికి స్వాతంత్రం వచ్చిన రోజున హైదరాబాద్ సంస్థానానికి మాత్రం స్వాతంత్ర్యం రాలేదు. 13 నెలలు గడిచిన తర్వాత అనగా 1948 సెప్టెంబర్ 17వ తేదీన తెలంగాణకు స్వాతంత్రం వచ్చింది. 5 జిల్లాల మరాఠ్వాడ వారు, 3 జిల్లాల కర్ణాటక వారు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17 వ తేదీన వారి వారి రాష్ట్రాల స్వాతంత్ర దినోత్సవాలు జరుపుకుంటున్నారు. కానీ అప్పటి 8 జిల్లాల ఇప్పటి 13 జిల్లాల తెలుగువారు మాత్రం తెలంగాణ రాష్ట్ర స్వాతంత్ర దినోత్సవాన్ని జరుపుకోవడానికి నోచుకోలేదు. అయితే కొంతమంది వ్యక్తులు, కొన్ని సంస్థలు, కొన్ని పార్టీలు తెలంగాణ స్వాతంత్ర దినోత్సవాలు జరుపుకుంటున్నాయి. కానీ ప్రభుత్వం మాత్రం అధికారికంగా తెలంగాణ స్వాతంత్ర దినోత్సవాన్ని నిర్వహించటం లేదు. ఇది ఎంతో శోచనీయమైనది.


*** ఆంగ్లేయుల కుటిల రాజకీయ ప్రకటన పర్యవసానం**

1857 ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం ద్వారానే రావాల్సిన స్వాతంత్ర్యం 90 సంవత్సరాలు ఆలస్యమైంది. స్వామి వివేకానందుల ఆలోచనలు, మహర్షి దయానందుల, స్వామి శ్రద్ధానందుల ధర్మ ప్రబోధాలు, తిలక్ స్వాతంత్ర్య గర్జన, బంకించంద్ర చటర్జీ వందేమాతర నినాదం, యోగి అరవిందుల అఖండ భారత భావజాలం, భగత్ సింగ్, రాజ్గురు, సుఖదేవ్, ఆజాద్ ల బలిదానాలు, నేతాజీ ఆజాద్ హింద్ ప్రభుత్వ స్థాపనలు, సర్దార్ పటేల్ రైతు ఉద్యమాలు, మహాత్మా గాంధీ సత్యాగ్రహాలు వంటివన్నీ ఇంకా ఎన్నో బ్రిటిష్ సామ్రాజ్యవాదం పారిపోవడానికి కారణమయ్యాయని చెప్పవచ్చు. అయితే బ్రిటిష్ వాడు పోతూ పోతూ పుండు పెట్టి పోయాడు. దేశంలో 566 సంస్థానాలు ఉన్నాయి. ఈ సంస్థానాల వాళ్లు హిందుస్థాన్ లో గాని, పాకిస్తాన్ లో గాని చేరవచ్చు. లేదా స్వతంత్రంగా ఉండవచ్చు. అని బ్రిటిష్‌వాడి కుటిల రాజకీయ ప్రకటన పర్యవసానంగా దేశంలో ఎన్నో ఘర్షణలు, మతకల్లోలాలు ఏర్పడ్డాయి. ఆ సమయంలో అప్పటి గృహ మంత్రిగా ఉన్నటువంటి 'ఉక్కుమనిషి' సర్దార్ వల్లబభాయ్ పటేల్ "అందరూ స్వతంత్ర భారత ప్రభుత్వంలో లో కలవాల్సిందే! అని పిలుపునిచ్చారు. కేవలం పిలుపునివ్వడమే కాకుండా ఆయన ఎంతో చొరవ తీసుకొని 562 సంస్థానాలను భారత ప్రభుత్వంలో కలిపాడు. కాని హైదరాబాద్, జమ్మూ కాశ్మీర్, జోధాపూర్, జూనాగడ్ సంస్థానాలు మాత్రం కలవలేదు. వీటి బాధ్యత అప్పటి ప్రధాని పండిట్ నెహ్రూ తీసుకున్నా అంతగా చొరవ చూపని కారణంగా ఆ సంస్థానాలు భారత ప్రభుత్వంలో కలవలేదు. కాని పటేల్ తీసుకున్న నిర్ణయాలతో రెండు సంస్థానాలు తర్వాత భారత ప్రభుత్వంలో కలిశాయి. కాని హైదరాబాద్ సంస్థానం పాలకుడు ఏడవ నిజాం మాత్రం స్వతంత్ర ఉస్మానిస్తాన్ గా ప్రకటించుకున్నాడు.

*** దోపిడీలు, హత్యలు, అత్యాచారాలు నిజాం నిరంకుశ పరిపాలనకు పరాకాష్ట**

అప్పటినుంచి సంస్థానం నిండా హిందువులపై హింస, దౌర్జన్యం, అత్యాచారాలు జరిపించారు.





నిజాం పోలీసులు నిజాము కనుసన్నల్లోనే విజృంభించిన రజాకార్లు దోపిడీలు, దొంగతనాలు, హత్యలు, అత్యాచారాలు చేశారు. 1911లో ఈ ఏడవ నిజాం పాలకునిగా వచ్చినప్పటి నుండి ఈ దుర్మార్గాలు పెరిగిపోయాయి. 1928లో మజ్లీస్ ఇత్తేహదుల్ ముస్లిమీన్ (రజాకార్) సంస్థ ఏర్పడినప్పటి నుండి మరీ పెరిగిపోయాయి. 1688లో గోల్కొండను పతనం చేసిన ఔరంగాజేబు నాటి కుదుబ్షా రాజు తానీషాను బంధించాడు. అతని మంత్రి సేనాధిపతులైన అక్కన్న మాదన్న ల తలలు నరికించి గోలకొండ కోట ద్వారానికి వేలాడదీయించాడు. అప్పటి నుండి హిందువులపై అత్యాచారాలు పెట్రేగిపోయాయి. ఒక్కొక్క రోజు వందల మందిని చంపిన ఘట్టాలున్నాయి. కొన్ని గ్రామాలలో 10, 20 మంది స్త్రీలపై అత్యాచారాలు కూడా చేశారు. 1947లో గాండ్లిపూర్లో నగ్నంగా బతుకమ్మలాడించి పోలీసులు, రజాకార్లు పైశాచిక ఆనందాన్ని పొందారు. పంజాగుట్టలో తల్లి కూతుళ్ళను (భర్తను కట్టేసి) మానభంగం చేశారు. గ్రామాన్ని దోపిడీ చేసి 20 మందిని చంపారు. గుల్బర్గా దగ్గర సైదాబాద్ లో 15 మంది స్త్రీలపై అత్యాచారం చేశారు. 1948 జూలైలో ఎర్రుపాలెం పై దాడి చేసిన 80 మంది రజాకార్లు 25 మంది పోలీసులు 70 మంది యువకులను చంపారు. 12 మంది స్త్రీలను నడి బజార్లో మానభంగం చేశారు. 1947 సెప్టెంబర్ రెండవ తేదీన వరంగల్ జిల్లా పరకాలలో తుపాకీ గుండ్లు కురిపించి 35 మందిని పొట్టన పెట్టుకున్నారు. పోలీస్ అమీన్ జియావుల్లా దీనికి నాయకత్వం వహించాడు. జాతీయ జెండా ఎగురేసినందుకుగాను అదే రోజున బత్తిన మొగిలయ్య గౌడ్ ను కత్తులతో పొడిచి చంపారు. డా. నారాయణ రెడ్డిని కూడా హత్య చేశారు. 1948 ఆగస్టు 27వ తేదీన నల్గొండ జిల్లా బైరాన్ పల్లి లో 118 మంది హిందూ యువకులను కాల్పుల్లో చంపి ఒకే బావిలో పూడ్చిపెట్టారు.



భువనగిరి పాంచ్ అధికారి హసీం దీనికి నాయకత్వం వహించాడు. ఇంత మందిని చంపి చుట్టుప్రక్కల గ్రామాలైన నవాబుపేట, నేలటోల, యశ్వంతపూర్, కోయిల్, చింతకుంటలపై దాడులు దోపిడీలు చేస్తూ వెళ్లారు. అంతేకాదు నల్గొండ జిల్లా గుండ్రంపల్లి పై దాడి చేసి సయ్యద్ మక్బూల్ నాయకత్వాన 200 మందిని హత్య చేశారు. శవాలలను ఎక్కడికి అక్కడే పారవేసి భయభ్రాంతులను చేసి అరుస్తూ వెళ్లిపోయారు. పాలమూరు జిల్లా అప్పంపల్లి లో 11 మందిని తుపాకులతో కాల్చి చంపారు. ఇందూరు కోట గల్లీలో రాధాకృష్ణ అనే యువకుడ్ని హత్య చేశారు. నిర్మల్ లో వేలాది మందిని ఒకే మర్రిచెట్టుకు ఉరి తీశారు. దాంతో ఆ చెట్టుకు "వెయ్యి ఉరుల మర్రి" గా పేరు వచ్చింది. వరంగల్ జిల్లా జనగామలో ఐదుగురు పురోహితులను చెట్టుకు తలక్రిందులుగా వేలాడదీసి గడ్డి తెచ్చి వాళ్ళ క్రింద పెట్టి మంటబెట్టి కాల్చి పైశాచికానందాన్ని పొందారు రజాకార్లు. లక్ష్మీపురంలో పొలంలో పనిచేస్తున్న పిచ్చమ్మను నిలువు దోపిడీ చేశారు. 1948 మే 23వ తేదీన ఎర్రుపాలెం స్టేషన్లో విజయవాడ ప్యాసింజర్ ను దోపిడీ చేశారు. ఖమ్మం స్టేషన్లో 80 మందిని నిలువు దోపిడీ చేశారు. ఇమ్రోజ్ పత్రిక సంపాదకుడు షోయబుల్లా ఖాన్ ను కాచిగూడ లో హత్య చేశారు రజాకార్లు. కాశీం రజ్వీ ప్రత్యేకంగా ఇతడిని చంపించాడు.

*** 'ఉక్కుమనిషి సర్దార్ పటేల్ జరిపిన ఆపరేషన్ పోలో ' తో భయపడి దివచ్చిన నిజాం**

ఇలా వేలాది హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు జరిగినప్పటికీ నాటి ప్రధాని నెహ్రూ తాత్సారం చేయడం ఉప ప్రధాని (గృహ మంత్రి) సర్దార్ పటేల్ కు ఎంత మాత్రమూ నచ్చలేదు. దానితో 1948 సెప్టెంబర్ 12 వ తేదీన భారత సైన్యానికి అనుమతి ఇచ్చాడు. జనరల్ జె. ఎన్. చౌదరి నాయకత్వంలో 13, 14, 15, 16, 17 తేదీలలో అనగా ఐదు రోజులపాటు హైదరాబాద్ సంస్థానంపై " ఆపరేషన్ పోలో " పేరిట పోలీసు చర్య జరిపించాడు. దానితో నాటి నిజాం భయంతో దిగి వచ్చాడు. అంతేకాక నాటి భారత ప్రభుత్వ ఏజెంట్ కె. ఎం. మున్షీ బోధలతో మనసు మార్చుకొని వేలాది హిందువుల చావులకు కారకుడైన ఏడవ నిజాం ఇక చస్తాననే భయంతో చేతులెత్తేసి సర్దార్ పటేల్ ముందు మోకరిల్లాడు. అలా 1948 సెప్టెంబర్ 17వ తేదీన మన తెలంగాణా రాష్ట్రానికి స్వాతంత్రం వచ్చింది. ఇది విలీనమూ కాదు. విమోచనమూ కాదు. ఇది ముమ్మాటికి తెలంగాణా కు స్వాతంత్ర దినమే!



చౌడూరి నరసింహారావు (వ్యాస కర్త)

## విశ్వకర్మ స్ఫూర్తి లెజెండరీ జాతీయ పురస్కార అవార్డు అందుకున్న డా:పోకూరి లక్ష్మణాచారి




హైదరాబాద్, సెప్టెంబర్ 16 (భారత శక్తి) :భారత శక్తి ప్రతినిధి, సెప్టెంబర్ 16: శ్రీ విరాట్ విశ్వకర్మ ఆధ్యాత్మిక ధార్మిక కళా పరిషత్ వారు శ్రీ విరాట్ విశ్వకర్మ మహోత్సవం 2025ను పురస్కరించుకొని హుస్నాబాద్ నందు రాజ్యలక్ష్మి కన్వెన్షన్ హాలు లో జరిగిన శ్రీ విశ్వకర్మ జాతీయ పురస్కారాల కార్యక్రమంలో ఎల్ బి నగర్ కు చెందిన డా:పోకూరి లక్ష్మణాచారికి, సినిమా హీరో మరియు ప్రొడ్యూసర్, అలాగే సమాజ సేవ రంగంలో కృషి చేసినందుకు గాను విశ్వకర్మ ఆధ్యాత్మిక ధార్మిక కళా పరిషత్ వారు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి పీఠం సిద్దిపేట పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ స్వామి మరియు గిన్నిస్ బుక్ వరల్డ్ అవార్డు గ్రహీత, బతుకమ్మ తల్లి గ్రంథకర్త డాక్టర్ వంగల శాంతి కృష్ణ ఆచార్య మరియు విశ్వకర్మ ఆధ్యాత్మిక ధార్మిక కళాపరిషత్తు చైర్మన్ పోలోజు రాజకుమార్ చేతుల మీదుగా శ్రీ విశ్వకర్మ స్ఫూర్తి లెజెండరీ జాతీయ గౌరవ పురస్కారం తో సత్కరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ వీర ధర్మ స్వామి మరియు డాక్టర్ వంగల శాంతి కృష్ణ ఆచార్య, పోలోజు రాజకుమార్, ఆచార్య అద్దంకి నాగరాజు, ఆచార్య చెన్నుపల్లి శ్రీనివాస చారి, తంగెళ్లపల్లి అరవిందస్వామి, పోకూరి లక్ష్మణాచారి, చేపూరి నరసింహ చారి, మాజోజు నరసింహ చారి, నారాయణ దాసు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో అడుగు పెట్టిన రాజ్‌నాథ్ సింగ్‌కు
## బీజేపీ నేతల ఘన స్వాగతం

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (భారత శక్తి) : బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొననున్నారు. ఈ మేరకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ బేగంపేట్ ఎయిర్ పోర్టుకు మంగళవారం చేరుకున్నారు. ఆయనకు బీజేపీ జాతీయ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, పార్టీ ఎంపీలు లక్ష్మణ్, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్ రావు, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి కొమురయ్య, జిల్లా కలెక్టర్, అధికారులు, ఆహ్వానం పలికారు. పరేడ్ గ్రౌండ్ లో బుధవారం నిర్వహించే తెలంగాణ విమోచన దినోత్సవంలో ముఖ్య అతిథిగా జాతీయ జెండా ఎగుర వేయనున్నారు.



## ప్రజాపాలనలో సబ్బండ వర్గాలకు సమన్యాయం



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 16 (భారత శక్తి) : ప్రజాపాలనలో సబ్బండ వర్గాలకు సమన్యాయం జరుగుతుందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచేందుకు ప్రభుత్వ ప్రయత్నాలు జరుగుతున్నాయని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ,మైనారిటీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాదిగ సామాజిక కోటా నుంచే తనకు మంత్రి పదవి సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చారని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం సీఎం రేవంత్ రెడ్డి ఏకసభ్య కమీషన్ ఏర్పాటు చేశారని, మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి తెలంగాణలోని అన్ని జిల్లాలో దళితులు నుంచి అభిప్రాయ సేకరణ చేయించి జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేశారని చెప్పారు. గత పదేండ్లు సీఎంగా పని చేసిన కేసీఆర్ దళితులను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ లను 42 శాతానికి పెంచే ప్రక్రియ జరుగుతుంటే, కేసీఆర్ ప్రతిపక్ష నేతగా తన నిర్ణయాన్ని ఏమీ చెప్పకుండా ఫాం హౌజ్ కే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలకు సమాన అవకాశాలు దక్కుతున్నాయని , గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాలకు మంత్రి వర్గంలో చోటు లభించిందన్నారు. మాల సామాజిక వర్గం నుంచి డాక్టర్ వివేక్, మాదిగ సామాజిక వర్గం నుంచి నాకు మంత్రివర్గంలో చోటు లబించిందని, ప్రజలకు ప్రజాపాలన అందిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు సమ న్యాయం జరగుతోందని, సిరిసిల్లలో దళితులకు దక్కాల్సిన భూములను వారికే కేటాయిస్తామని హామీ ఇచ్చారు. దీని కోసం నెల రోజుల్లో సిరిసిల్లలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేయబోతున్నట్లు ఆయన వెల్లడించారు. సీఎం నేతృత్వంలో దళితులకు, పేద వర్గాల న్యాయం జరుగుతోందన్నారు. ఉమ్మడి కరీంనగర్ ప్రాంత బిడ్డగా ప్రజలకు మంచి సేవలందిస్తానని లక్ష్మణ్ కుమార్ చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కత్తెర దేవదాస్, బోయిన్ పల్లి సెస్ డైరెక్టర్ సుధాకర్, దళిత నాయకులు అంకని భాను, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మరింత చేరువలో పాస్‌పోర్టు సేవలు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (భారత శక్తి) :శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని రాయదుర్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన పాస్ పోర్ట్ సేవా కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పీఏసీ చైర్మెన్ ఆరెకపూడి గాంధీ, తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ డాక్టర్ కేజై శ్రీనివాస, సిపిఓ, రీజినల్ పాస్ పోర్ట్ ఆఫీసర్ స్నేహజ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డితో కలిసి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని హంగులతో సకల సౌకర్యాలతో పాస్‌పోర్టు సేవా కేంద్రం ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. శేరిలింగంపల్లి ప్రజలకు పాస్‌పోర్టుకు సంబంధిత సేవలు మరింత చేరువలో, వేగవంతంగా అందుబాటులోకి వస్తాయని, ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పాస్‌పోర్ట్ అనేది భారతీయుల అంతర్జాతీయ గుర్తింపు పత్రం అని, అత్యవసర పరిస్థితుల్లో అవసరం ఏర్పడే ముందే యువత పాస్‌పోర్ట్ తీసుకోవాలని సూచించారు. కొత్త భవనంలో రోజుకు 1000 స్లాట్లు అందుబాటులో ఉండడం వల్ల సేవల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కేంద్రం శేరిలింగంపల్లి ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలను అందించడంతో పాటు, అత్యవసర అవసరాల సమయంలో వేగవంతమైన సేవలు అందించేలా రూపుదిద్దుకుందన్నారు.

# నేడు లండన్‌లో 150 మంది సీఈఓలతో మంత్రి నారా లోకేశ్ రోడ్ షో

* గత 15 నెలల్లో వచ్చిన రూ.10 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రస్తావన
* హిందూజా, రోల్స్ రాయిస్ వంటి దిగ్గజ సంస్థలతో ప్రత్యేక భేటీలు
* రోడ్ షోకు హాజరుకానున్న 150 మందికి పైగా గ్లోబల్ కంపెనీల సీఈఓలు

**అమరావతి, సెప్టెంబర్ 16, (భారత శక్తి):** ఆంధ్రప్రదేశ్‌కు భారీగా పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా, రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ మంగళవారం నాడు లండన్‌లో పారిశ్రామికవేత్తలతో ఉన్నతస్థాయి రోడ్ షో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న "పార్టనర్‌షిప్ సమ్మిట్ 2025"కు ప్రపంచస్థాయి పారిశ్రామికవేత్తలను, పెట్టుబడిదారులను ఆహ్వానించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. లండన్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరక్టర్స్, పాల్ మాల్ కన్వెన్షన్ సెంటర్‌లో భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు ఈ రోడ్ షో ప్రారంభమవుతుంది. ఈ కీలక సమావేశంలో యూకే డిప్యూటీ హై కమిషనర్ సుజిత్ ఘోష్, టెక్ మహీంద్రా యూరప్ విభాగం అధ్యక్షుడు హర్షూల్ అస్నానీ, ఐసీఐసీఐ బ్యాంకు యూకే సీఈఓ రాఘవ్ సింఘాల్, ఏపీఐఐసీ వైస్ చైర్మన్ అభిషిక్త్ కిశోర్ వంటి ప్రముఖులు పాల్గొంటారు. వీరితో పాటు గ్లోబల్ ఫండ్స్, తయారీ, సేవా రంగాలకు చెందిన సుమారు 150 మంది సీఈఓలు, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిశ్రమలకు అనుమతులు ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేసిన తీరును (స్పీడ్ ఆఫ్ డూయింగ్), పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉన్న విధానాలను వివరించనున్నారు. గత 15 నెలల్లో రాష్ట్రానికి రూ.10,06,799 కోట్ల విలువైన 122 భారీ ప్రాజెక్టులు వచ్చాయని, పరిశ్రమల కోసం లక్ష ఎకరాలతో ఇండస్ట్రియల్ క్లస్టర్లను సిద్ధం చేశామని ఆయన తెలియజేస్తారు. ఈ పెట్టుబడులను రాబోయే ఏడాదిలో రెట్టింపు చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేయనున్నారు. రోడ్ షోలో భాగంగా మంత్రి లోకేశ్ ఏపీలోని పెట్టుబడి అవకాశాలపై ప్రత్యేక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారు. హిందూజా, రోల్స్ రాయిస్ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమవుతారు. పోర్టు ఆధారిత పరిశ్రమలు, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ఇన్నోవేషన్, ఆధునిక తయారీ రంగాల్లో ఉన్న అవకాశాలను ఆయన ప్రధానంగా ప్రస్తావిస్తారు. ఎరిక్సన్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, సైయంట్, లండన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వంటి సంస్థల ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ట్రేడ్, టెక్నాలజీ, స్థిరమైన అభివృద్ధి వంటి అంశాలపై చర్చించనున్నారు.



## వచ్చే వారం ట్రంప్‌తో పాక్ ప్రధాని భేటీ.. భారత్ తో ఉద్రిక్తతలపై చర్చ!

* సెప్టెంబర్ 25న జరగనున్న కీలక సమావేశం
* అజెండాలో భారత్-పాక్ ఉద్రిక్తతల అంశంపై చర్చకు అవకాశం
* ఇటీవల బలపడిన అమెరికా-పాకిస్తాన్ ద్వైపాక్షిక సంబంధాలు
* కొద్ది నెలల క్రితమే రెండుసార్లు వాషింగ్టన్‌లో పర్యటించిన పాక్ ఆర్మీ చీఫ్

**అమెరిక, సెప్టెంబర్ 16:** అమెరికా, పాకిస్థాన్ సంబంధాలు మరోసారి బలపడుతున్నాయనడానికి సంకేతంగా కీలక పరిణామం చోటుచేసుకోనుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్, ఆ దేశ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సందర్భంగా వచ్చే వారం సెప్టెంబర్ 25న ఈ ఉన్నత స్థాయి సమావేశం జరిగే అవకాశం ఉందని పాకిస్థాన్‌కు చెందిన 'ఖైబర్ న్యూస్' విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఒక కథనాన్ని ప్రచురించింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. పాకిస్థాన్‌లో సంభవించిన వరదలు, ఖతార్‌పై ఇజ్రాయెల్ దాడి తర్వాత నెలకొన్న పరిస్థితులు, భారత్‌పాకిస్థాన్ మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కూడా వీరి చర్చల ఎజెండాలో ఉన్నాయని ఆ కథనం పేర్కొంది. అయితే, ఈ సమావేశం గురించి పాకిస్తాన్ ఆర్మీకి చెందిన ఇంటర్‌సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) గానీ, వాషింగ్టన్‌లోని పాక్ రాయబార కార్యాలయం గానీ ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇటీవలి కాలంలో అమెరికా పాక్ సంబంధాలు మెరుగుపడుతున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ కొద్ది నెలల వ్యవధిలోనే రెండుసార్లు వాషింగ్టన్‌లో పర్యటించారు. గత జూన్‌లో మునీర్‌తో సమావేశమైన ట్రంప్ వాణిజ్యం, ఆర్థికాభివృద్ధి, క్రిప్టోకరెన్సీ వంటి అంశాలపై చర్చించారు. ఆ తర్వాత జూలైలో పాకిస్థాన్‌తో వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించిన ట్రంప్ ప్రభుత్వం, ఆ దేశంలోని భారీ చమురు నిల్వలను వెలికితీయడంలో సహాయపడతామని హామీ ఇచ్చింది. గత మే నెలలో భారత్‌తో సైనిక ఘర్షణ సమయంలో ట్రంప్ జోక్యం చేసుకొని శాంతిని నెలకొల్పారని పాకిస్థాన్ ప్రశంసించడంతో ఇరు దేశాల మధ్య సాన్నిహిత్యం పెరిగింది. వాణిజ్యపరమైన హెచ్చరికలతో తానే ఇరు దేశాల మధ్య సంధి కుదిర్చానని ట్రంప్ పేర్కొనగా, ఆ వాదనను భారత్ తీవ్రంగా ఖండించింది. ఇటీవల పాకిస్థాన్‌లోని కీలకమైన ఖనిజ రంగంలో 500 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టేందుకు అమెరికా ముందుకొచ్చిన విషయం తెలిసిందే.

## హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను వణికించిన 'క్లౌడ్ బరస్ట్'

* వరద నీటిలో కొట్టుకుపోయిన 20కి పైగా బస్సులు, ఇతర వాహనాలు
* ధ్వంసమైన రోడ్లు, ఇళ్లు, దుకాణాలు.. అస్తవ్యస్తమైన జనజీవనం
* సీఎంలతో మాట్లాడిన ప్రధాని మోదీ, అమిత్ షా.. సహాయక చర్యలు ముమ్మరం
* ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రులు, అధికారులు

**హిమాచల్ ప్రదేశ్, సెప్టెంబర్ 16, :** ఉత్తర భారతంలోని హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను క్లౌడ్ బరస్ట్ వణికించింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు కురిసిన కుండపోత వర్షాలు, ఆకస్మిక వరదలు ఈ రెండు రాష్ట్రాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఈ ప్రకృతి బీభత్సానికి హిమాచల్ ప్రదేశ్‌లో ముగ్గురు మృతి చెందగా, రెండు రాష్ట్రాల్లోనూ భారీ ఆస్తి నష్టం సంభవించింది. వంతెనలు, రోడ్లు కొట్టుకుపోవడంతో రవాణా వ్యవస్థ స్తంభించి, జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ జిల్లాలో ఈ వర్షాల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంది. జిల్లాలోని నిహ్రీ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి ఒక ఇంటిపై పడటంతో ముగ్గురు అక్కడికక్కడే మరణించారని, మరో ఇద్దరిని సహాయక బృందాలు సురక్షితంగా కాపాడాయని జిల్లా ఎస్పీ సాక్షి వర్మ తెలిపారు. ఇక ధర్మపూర్ పట్టణంలోని బస్ స్టాండ్ పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. వరద ప్రవాహానికి 20కి పైగా ప్రభుత్వ బస్సులు, ఇతర వాహనాలు కొట్టుకుపోయాయని, సమీపంలోని వర్క్‌షాప్‌లు, పంప్ హౌస్‌లు, దుకాణాలు కూడా ధ్వంసమయ్యాయని ఉప ముఖ్యమంత్రి ముఖేశ్ అగ్నిహోత్రి ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు. అటు రాజధాని సిమ్లాలోనూ పలుచోట్ల కొండచరియలు విరిగిపడటంతో ప్రధాన రహదారులు మూసుకుపోయాయి. ఇక, ఉత్తరాఖండ్‌లోనూ పరిస్థితి భిన్నంగా ఏమీ లేదు. ముఖ్యంగా రాజధాని డెహ్రాడూన్‌లోని సహస్రధార, రాయ్‌పూర్, మాల్దేవతా ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సహస్రధార నది ఉప్పొంగి ప్రవహించడంతో హోటళ్లు, దుకాణాల్లోకి వరద నీరు, బురద చేరి తీవ్ర నష్టం వాటిల్లింది. మాల్దేవతా ప్రాంతంలో ఏకంగా 100 మీటర్ల పొడవైన రోడ్డు వరద ప్రవాహానికి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రకృతి విపత్తుపై రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు వేగంగా స్పందించాయి. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి మంగళవారం ఉదయం ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించి, అధికారులతో సమీక్షించారు. సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని, రహదారులను పునరుద్ధరించే పనులు ముమ్మరం చేశామని ఆయన తెలిపారు. సహస్రధార నదిలో చిక్కుకుపోయిన ఐదుగురిని రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్), పోలీసులు కలిసి రక్షించారని వెల్లడించారు. మరోవైపు, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామితో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రం నుంచి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లోనూ సహాయక బృందాలు నిరంతరాయంగా పనిచేస్తున్నాయి.

## సాంప్రదాయ యుద్ధాలు ముగిశాయి.. కొత్త సవాళ్లకు సిద్ధంగా ఉండండి: రాజ్‌నాథ్ సింగ్

* సాంప్రదాయ యుద్ధాలకు కాలం చెల్లిందన్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
* సమాచార, జీవ, సైద్ధాంతిక యుద్ధాలకు సిద్ధం కావాలని సైన్యానికి పిలుపు
* మోదీ 'సుదర్శన చక్ర' దార్శనికతపై దృష్టి సారించాలని కమాండర్లకు సూచన
* ఆత్మనిర్భరత నినాదం కాదు, వ్యూహాత్మక అవసరం అని స్పష్టం
* కొత్త రక్షణ కొనుగోలు మాన్యువల్ 2025కు ఆమోదం తెలిపిన మంత్రి
* రక్షణ రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం పెంచాలని ఉద్ఘాటన

**ఢిల్లీ, సెప్టెంబర్ 16, (భారత శక్తి):** సాంప్రదాయ యుద్ధ పద్ధతులకు కాలం చెల్లాయని, ఇకపై దేశం ఎదుర్కోబోయేది సమాచార, సైద్ధాంతిక, పర్యావరణ, జీవ సంబంధిత యుద్ధాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఈ సరికొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు సాయుధ దళాలు సర్వసన్నద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం కోల్‌కతాలో జరిగిన కంబైన్డ్ కమాండర్స్ కాన్ఫరెన్స్ 2025లో ఆయన ప్రసంగించారు. ప్రస్తుత కాలంలో యుద్ధాలు ఎప్పుడు, ఎలా మొదలవుతాయో ఊహించడం చాలా కష్టమని రాజ్‌నాథ్ అన్నారు. "యుద్ధం రెండు నెలలు జరగొచ్చు, ఏడాది లేదా ఐదేళ్లయినా కొనసాగవచ్చు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు మన సైనిక సామర్థ్యం సరిపడా ఉండేలా చూసుకోవాలి" అని ఆయన సూచించారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న సంఘర్షణల నేపథ్యంలో, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న సైన్యం యొక్క ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికత అయిన 'సుదర్శన చక్ర' వ్యూహాన్ని నిర్మించేందుకు కమాండర్లు చొరవ తీసుకోవాలని రాజ్‌నాథ్ కోరారు. ఈ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు వాస్తవిక కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే ఐదేళ్లకు మధ్యకాలిక, పదేళ్లకు దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన 'జై' (జాయింట్‌నెస్, ఆత్మనిర్భరత, ఇన్నోవేషన్) మంత్రం ప్రాముఖ్యతను ఆయన పునరుద్ఘాటించారు. ఆత్మనిర్భరత అనేది కేవలం నినాదం కాదని, అది మన దేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి అత్యంత కీలకమైన అవసరమని ఆయన పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్' విజయం మన బలం, వ్యూహం, స్వావలంబనకు నిదర్శనమని కొనియాడారు. రక్షణ రంగంలో భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి కోసం ప్రైవేటు పరిశ్రమలు, విద్యాసంస్థలతో మరింత లోతైన భాగస్వామ్యం అవసరమని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా 'డిఫెన్స్ ప్రొక్యూర్‌మెంట్ మాన్యువల్ 2025'కు తాను ఆమోదం తెలిపినట్లు రాజ్‌నాథ్ వెల్లడించారు. కొనుగోలు ప్రక్రియను సులభతరం చేసి, జాప్యాన్ని తగ్గించేందుకు 'డిఫెన్స్ అక్విజిషన్ ప్రొసీజర్ 2020'ను సవరిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాధిపతులు జనరల్ ఉపేంద్ర ద్వివేది, అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి, ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి. సింగ్, డీఆర్‌డీఓ ఛైర్మన్ సమీర్ వి. కామత్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మెడికల్ కౌన్సిలింగ్ లో అవకాశం కల్పించాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 16, (భారత శక్తి):** ప్రభుత్వం 2024 జూలై నెలలో తీసుకొచ్చిన జీవో నెంబర్ 33 ద్వారా 2024 వరకు చదువు పూర్తి చేసి, మంచి ర్యాంకులు సాధించిన పిల్లలు (విద్యార్థుల) స్థానికత పేరుతో తీవ్రంగా నష్టపోతున్నారని, వారి భవిష్యత్తు ఆగమ్య గోచరంగా మారిందని, నాన్ లోకల్ కింద పరిగనింపబడి నష్టపోతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కౌన్సిలింగ్ 2025 లో అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతున్నామన్నారు. హైదరాబాద్, ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులు జాకీర్ అహ్మద్, నవీన్ కుమార్, లక్ష్మి, విగ్నేశ్వర రావు, అశోక్ లు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 33 ను పూర్తిగా సమర్థిస్తున్నామన్నారు. ప్రభుత్వ శాఖలలో ఏదైనా జీవో జారీ అయినప్పటి నుండే నిబంధనలు అమలవుతాయని, కానీ కొంతమంది ఉన్నతాధికారుల బాధ్యత రాహిత్యం వల్ల వెసులుబాటు ఉన్నా సరే బంగారు భవిష్యత్తు కలిగిన విద్యార్థులను వైద్య విద్యకు నిరాకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో నంబర్ 33 ను 2024 లో ప్రభుత్వం జారీ చేసిందని, జీవో జారీ చేయబడిన తేదీ కంటే ముందే పక్క రాష్ట్రాల్లో చదువు పూర్తి చేశారని, పిల్లలు కేవలం రెండు సంవత్సరాలు పక్క రాష్ట్రంలో విద్యను అభ్యసించినంత మాత్రాన నాన్ లోకల్ గా పరిగణించడం భావ్యం కాదని, అలా పరిగణించడం వల్ల 2025 నీట్ పరీక్షలో మంచి ర్యాంకులు సాధించిన 50 మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారిని లోకల్ క్రింద పరిగణించాలని, మెడికల్ కౌన్సిలింగ్ లో పాల్గొనే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. తమ పిల్లలందరూ స్థానికులు కానప్పుడు ఎలక్షన్లలో తమవి ,పిల్లల ఓట్లు ఎలా పరిగణిస్తారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. వారి స్థానికత ఎక్కడో, వారి భవిష్యత్తు ప్రభుత్వమే నిర్ణయించాలన్నారు. రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న గ్రామాల విద్యార్థులు తల్లిదండ్రులు దగ్గరగా ఉన్న మంచి కాలేజీలో పిల్లలని చేర్పించాలని కోరుకుంటారని, మేము అలాగే చేశామన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన జరిగినప్పుడు 10 సంవత్సరాల ఏ రాష్ట్రంలో చదివినా వారి స్థానికత కోటకు అర్హులేనని ప్రభుత్వాలు ప్రకటించాయన్నారు. కాబట్టి తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని నీట్ కౌన్సిలింగ్ విషయంలో లోకల్, నాన్లోకల్ సమస్యపై సడలింపు ఇచ్చి నష్టపోతున్న విద్యార్థులను ఆదుకోని కౌన్సిలింగ్లో పాల్గొనే అవకాశం కల్పించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు బతుకమ్మ కానుక

**హైదరాబాద్, సెప్టెంబర్ 16, (భారత శక్తి):** కామారెడ్డి : మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జీ) సభ్యులకు బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చీరలను రేవంతన్న కానుకగా అందించనున్నది. ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు సంవత్సరానికి రెండు చీరల చొప్పున పంపిణీ చేసేందుకు సిద్ధం చేసింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ పండుగను పురస్కరించుకొని 18 సంవత్సరాలు నిండిన, తెల్ల రేషన్ కార్డు కలిగిన వారందరికీ బతుకమ్మ చీరెలను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వం రేషన్ కార్డులో పేరున్న ప్రతీ మహిళకు రేషన్ డీలర్ల ద్వారా బతుకమ్మ చీరలను పంపిణీ చేసింది. ఈ పథకం కింద అందించిన చీరలు నాణ్యతగా లేవని మహిళలు వీటిని ధరించడం లేదని భావించి కాంగ్రెస్ ప్రభుత్వం గత బతుకమ్మ పండగకు చీరల పంపిణీని నిలిపి వేసింది. దీంతో కొంత వ్యతిరేకత వస్తుందని భావించి తిరిగి ఈ పథకాన్ని కొనసాగించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు చీరెలు అందించడం ద్వారా చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన ఉద్దేశంగా ఈ పంపిణీ ప్రక్రియను చేపట్టింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది చీరెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**మహిళలకు రేవంతన్న కానుక**

అక్కాచెల్లెళ్లకు మీ రేవంతన్న కానుక పేరిట చేనేత చీరలను ఇందిరా మహిళ శక్తి పథకం కింద పొదుపు సంఘాల మహిళలకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. మహిళా సంఘాల సభ్యులకు మాత్రమే డ్రెస్ కోడ్ లో భాగంగా వారికి దసరా పండును పురస్కరించుకొని రెండేసి చీరెలను పంపిణీ చేయాలని నిర్ణ యించింది. నాణ్యత విషయంలో ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. చీరల పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. చీరెలను జిల్లాలోని మండలాలకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో విడతల వారీగా చీరెలు రానున్నాయి. అయితే చీరెలను ఎక్కడ భద్రత పరిచేది స్టాక్ పాయింట్ల వివరాలను ప్రభుత్వం ముందే తెప్పించుకుంది. జిల్లాలోని 7 మండల సమాఖ్యలను చీరలను నిల్వ చేసేందుకు ఎంపిక చేశారు. ఇక్కడి నుంచి మండలాల్లోని స్టాక్ పాయింట్లకు తరలిస్తారు. మండలాల్లో చీరలను నిల్వ చేసే స్టాక్ పాయింట్లను ఇప్పటికే గుర్తించారు. ఇక్కడి నుంచి గ్రామాల వారీగా ఎస్ హెచ్ జీ సభ్యులకు అందించనున్నారు. గతంలో రేషన్ కార్డు ఆధారంగా అందించగా ప్రస్తుతం స్వశక్తి సభ్యుల వారీగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**జిల్లాలో మహిళా సంఘ సభ్యులు ఇలా...**

ఇప్పటికే నియోజకవర్గాల వారీగా ఎన్ని సంఘాలు ఉన్నాయి.? ఎంత మంది సభ్యులు ఉన్నారు.? అనే లెక్కలు తీశారు. అంతే గాకుండా మెప్మా సిబ్బందికి పంపిణీ బాధ్యతలను అప్పగించారు. కామారెడ్డి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 1,79,417 మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో 24,272 మంది సభ్యులు ఉన్నారు. మొత్తం 2,03,689 మంది మహిళా సంఘ సభ్యులు ఉన్నారు. వీరందరికి చీరల పంపిణీ జరగనుంది. డ్రెస్ కోడ్ లో భాగంగా అన్నీ ఒకే రంగుతో ఒకే విధంగా ఉంటాయి. మహిళా సంఘాల సభ్యులకు సంవత్సరానికి రెండేసీ చీరలు ఇస్తారు. కానీ ఈ సారి మాత్రం ప్రస్తుతం ఒక చీర నే పంపిణీ చేయనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళా సంఘాలకు చీరలను ఇవ్వడం ఇదే మొదటి సారి. గత సంవత్సరం ఇవ్వలేదు. అంతకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు కూడా చీరెలను పంపిణీ చేసేది. మెప్మా సభ్యులకు కూడా చీరెలను పంపిణీ చేస్తారు. మహిళకు రెండు రకాల చీరలను అందిస్తుండగా... ఇందులో ఆరున్నర మీటర్ల చీరలు, 9 మీటర్ల చీరలు ఉంటాయి.

# బతుకమ్మ ఉత్సవాలకు బతుకమ్మ కుంట సిద్ధం..

**ఈనెల 25 నాడు హైదరాబాద్ మహానగరంలో చరిత్రలో లిఖించదగిన ఒక అపురూప దృశ్యం కనువిందుచేయబోతోంది.. ఎందుకూ పనికిరాదు అనుకున్న ఒక నీటి కుంట మహోన్నత కార్యక్రమానికి వేదిక కాబోతోంది.. అంబర్ పేట్ లో మురికికూపంగా మారిన బతుకమ్మ కుంటాను తిరిగి ఒక అద్భుతమైన వేదికగా మలచారు.. ఈ ఘనత హైడ్రా తన ఖాతాలో వేసుకుంది.. అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారిన బతుకమ్మ కుంట పేరు ఈరోజు దేశ వ్యాప్తంగా మారుమోగిపోతోంది.. ఈ నెల 25 కోసం నగర ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.. బతుకమ్మ ఆటలో పాల్గొని ఆనందహేళను అందుకోవడానికి సిద్ధంగా ఉన్నారు..**

**హైదరాబాద్, సెప్టెంబర్ 16, (భారత శక్తి):** బతికే ఉన్నాను అని నిరూపించుకున్న బతుకమ్మ కుంట.. పేరును సార్ధకత చేసుకుంటూ ఇప్పుడు బతుకమ్మ ఉత్సవాలకు సిద్ధమౌతోంది. ఈ నెల 25వ తేదీన బతుకమ్మ ఉత్సవాలకు బతుకమ్మ కుంట వేదిక కాబోతోంది.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఉత్సవాలకు హాజరౌతున్నారు. అదే రోజు పండగ వాతావరణంలో బతుకమ్మకుంటను నగర ప్రజలకు ముఖ్యమంత్రి అంకితం చేయనున్నారు. బతుకమ్మ కుంట వద్ద ఈ ఉత్సవ ఏర్పాట్లను ముఖ్యమంత్రి సలహాదారుడు వేంనరేందర్ రెడ్డి, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి సమీక్షించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, జలమండలి ఎండీ కె. అశోక్‌రెడ్డితో పాటు ఇతర అధికారులు పాల్గొని అక్కడి ఏర్పాట్లను వివరించారు. జాతీయ స్థాయిలో బతుకమ్మ కుంటకు గుర్తింపు వచ్చేలా ఇక్కడ బతుకమ్మ ఉత్సవాలు జరగాలని సమీక్ష సమావేశంలో వేంనరేందర్ రెడ్డి అధికారులకు సూచించారు. బతుకమ్మ కుంట చుట్టూ రాబోతున్న ఆకర్షణలను అడిగి తెలుసుకున్నారు.

**హైడ్రా కృషి అభినందనీయం :**

ఆక్రమణలకు గుర్రై నిర్మాణ వ్యర్థాలతో నిండిపోయి పిచ్చి మొక్కలతో అటువైపు వెళ్లాలంటే కాదు.. కనీసం చూడాలంటే భయపడే విధంగా బతుకమ్మ కుంట మారిపోయింది. కబ్జాల చెర నుంచి విముక్తి చేసి.. సర్వాంగ సుందరంగా బతుకమ్మ కుంటగా తీర్చడంలో హైడ్రా కృషి అభినందనీయం అని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు అన్నారు. కబ్జాల చెర నుంచి విముక్తి చేయడానికి రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ ఎంసీ శాఖలతో సమన్వయం చేసుకుంటూ.. కోర్టుకు వాస్తవాలు వివరించి బతుకమ్గకుంటకు జీవం పోసిన ఘనత హైడ్రాదే అని కొనియాడారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇదో యజ్ఞలా చేశారంటూ అభినందించారు. బతుకమ్మ కుంట ఆక్రమణలను తొలగించి.. చెరువుగా అభివృద్ధి చేయాలని తాము కోరగానే ముఖ్యమంత్రి ఈ పనిని హైడ్రాకు అప్పగించారు.

**అందరూ రావాలి.. బతుకమ్మ ఆడాలి :**

బతుకమ్మ కుంట పరిసరాలు ఎంతో ఆహ్లాదంగా ఉన్నాయి. ఇక్కడ ఈ నెల 25న జరగనున్న బతుకమ్మ ఉత్సవాలకు అందరూ రావాలి.. బతుకమ్మ ఆడాలి అని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, శ్రీ వి హనుమంతరావు కోరారు. నగరంలో మొదటి విడతగా చేపట్టిన 6 చెరువులలో బతుకమ్మకుంట ప్రథమంగా సిద్ధమవ్వడం ఎంతో ఆనందంగా ఉందని వి. హనుమంతరావు అన్నారు. ఉత్సవాలకు కూడా ముఖ్యమంత్రి వస్తానని చెప్పడం.. ఎంతో ఆనందంగా ఉందన్నారు. పార్టీలకతీతంగా అందరూ వచ్చి.. నగరంలో మరిన్ని చెరువుల అభివృద్ధికి ప్రోత్సహకంగా ఈ ఉత్సవాలు జరగాలని కోరారు. ఇప్పటికే జాతీయ స్థాయిలో చర్చగా మారిని బతుకమ్మ కుంట అభివృద్ధి.. ఉత్సవాలతో మరోమారు దేశవ్యాప్తంగా మారుమోగాలని కోరారు.



## ఎల్బీనగర్ ప్రజలకు శుభవార్త : మధు యాష్కిగౌడ్..

* **మూడు నాలుగు నెలల్లో రిజిస్ట్రేషన్ ల సమస్య పరిష్కారానికి పాలసీని రూపొందించబోతున్నాం: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**
* **కాలనీ సంక్షేమ సంఘాలతో మంత్రిని కలిసిన మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్**
* **118 జీవో బాధిత కాలనీవాసుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి హామీ**

**మూడు నాలుగు నెలల్లో హైదరాబాద్, హెచ్‌ఎండిఏ పరిధి పాటు అన్ని జిల్లాల్లో నెలకొన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ల సమస్యకు పరిష్కారం చూపుతామని రెవెన్యూ మరియు గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు పేర్కొన్నారు..**

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (భారత శక్తి) : ఎల్బీనగర్ నియోజకవర్గంలో జీవో నం. 118 బాధిత కాలనీలలలో నెలకొన్న రిజిస్ట్రేషన్ల సమస్యలపై టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ గారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారిని ఈరోజు సెక్రటేరియట్ లోని వారి ఛాంబర్ లో కలిశారు. బియన్ రెడ్డి నగర్ డివిజన్, నాగోల్ డివిజన్, హస్తినాపురం డివిజన్, చంపాపేట్ డివిజన్ లలోని బాధిత కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి మంత్రి గారితో సమావేశమై సమస్య ను వివరించారు. హుడా అప్రూవల్ తో పాటు గతంలో గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ అనుమతులు తీసుకుని ఇళ్లు నిర్మించుకున్న కాలనీలలో 2007 నుంచి రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో కష్టపడి కొనుక్కున్న ఇళ్లు, ప్లాట్ల యజమానులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం హడావుడిగా, తప్పులు తడకతో జీవో 118 తీసుకురావడంతో.. కట్టుకున్న ఇళ్లకు విలువ లేకుండా, బ్యాంకు లోన్లు రాకుండా ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ సమస్యకు శాశ్వత పరిష్కారంగా నిషేధిత జాబితాలో ఉన్న 22ఏ నుంచి బాధిత కాలనీలను తొలగించాలని కోరారు. స్పందించిన మంత్రిగారు మాట్లాడుతూ.. హైదరాబాద్ తో పాటు హెచ్‌ఎండిఏ పరిధి, పలు జిల్లాలోనూ ఇలాంటి సమస్యలు ఉన్న విషయం తమ దృష్టికి వచ్చింది అన్నారు. ప్రభుత్వ భూముల్లో చాలాచోట్ల ఇళ్ల నిర్మాణాలు జరిగాయని, ప్రభుత్వం ప్రయివేట్ భూముల వివాదాలు చాలా ఉన్నాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గారితో ఇప్పటికే ఈ విషయాలపై చర్చించామని.. త్వరలోనే పరిష్కార మార్గం చూపేలా ఒక పాలసీని రూపొందించి అందరికీ విముక్తి కల్పించే ఆలోచనతో ముందుకు వెళుతున్నట్లు పేర్కొన్నారు. 34 నెలల్లోనే దీనిపై ఒక నిర్ణయం తీసుకొని, అసెంబ్లీలో చర్చించి ఒక పాలసీని రూపొందిస్తామని పేర్కొన్నారు. ప్రజలను ప్రభుత్వం ఇబ్బంది పెట్టదని, వారు కష్టపడి నిర్మించుకున్న ఇళ్లను ఎవరు ఇబ్బందులకు గురి చేయబోరన్నారని.. వారికి శాశ్వత పరిష్కారం చూపేలా ఒక పరిష్కారం మార్గంతో ప్రభుత్వం శుభవార్త చెప్పబోతుందని పేర్కొన్నారు. ప్రజలకు పూర్తి ఆస్తి హక్కు పత్రాలమే అందజేస్తామన్నారు. ప్రజలకు మేలు చేసేందుకే తమ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్ రెడ్డి గారు, బానోతు సుజాత నాయక్ గారు, హస్తినాపురం డివిజన్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు గారు, నాయకులు పి గణేష్ రెడ్డి గారు, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి గారు, మెరుగు రమేష్ రెడ్డి, దుర్గా రెడ్డి గారు, రమాకాంత్ గారు, భవాని శంకర్, కొండోజు శ్రీనివాస్ గారు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు వైదేహి నగర్ దామోదర్ రెడ్డి గారు, బి.ఎన్.రెడ్డి నగర్ కాలనీ ప్రదీప్ రెడ్డి గారు, పురుషోత్తం రెడ్డి గారు, శ్రీపురం కాలనీ శ్రీధర్ రెడ్డి, సార్ కాంప్లెక్స్ మహేందర్ రెడ్డి రవీందర్ రెడ్డి, కోపరేటివ్ బ్యాంక్ కాలనీ శరత్ రెడ్డి గారు, సాయి నగర్ మల్లేష్, అశోక్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ధాతు నగర్ కాలనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఏ.ఐ.తో ఛిద్రమవుతున్న జీవితాలు

* **జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నిర్వహణకు సర్వ సన్నద్ధంగా ఉండాలి..**
* **నోడల్ అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ ఆదేశం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 16, (భారత శక్తి):** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికను సజావుగా, సమర్థవంతంగా నిర్వహించడానికి వీలుగా నోడల్ అధికారులు సర్వ సన్నద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్ ఆదేశించారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నిర్వహణ పై జిల్లా ఎన్నికల అధికారి నోడల్ అధికారులతో ప్రాథమిక సన్నాహక సమావేశం నిర్వహించారు. మ్యాన్ పవర్, ఈవిఎం, వివి ప్యాట్ రవాణా, శిక్షణ, మెటీరియల్ మేనేజ్మెంట్, ప్రవర్తన నియమావళి, శాంతి భద్రతలు, వల్నరబులిటీ మ్యాపింగ్, జిల్లా సెక్యూరిటీ ప్లాన్, వ్యయ పర్యవేక్షణ, మీడియా కమ్యూనికేషన్, ఫిర్యాదుల పరిష్కారం, లైవ్ వెబ్ కాస్ట్, ఎస్.ఎం.ఎస్ మానిటరింగ్, కమ్యూనికేషన్ ప్లాన్, స్వీప్ యాక్టివిటీస్, పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాల కల్పన తదితర అంశాలపై సన్నద్ధతను సంబంధిత నోడల్ అధికారులను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఓటర్లను మ్యాన్ పవర్ జాబితాలో ఉండకుండా చూడాలన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం వ్యాప్తంగా ఓటర్ల అవగాహన కార్యక్రమాల కోసం ఈవీఎం, వీవీప్యాట్ లను సిద్ధం చేయాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రాథమిక సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. స్వీప్ కార్యకలాపాలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. జోనల్ కమిషనర్లను స్వీప్ కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేయాలన్నారు. మీడియా కమ్యూనికేషన్ కోసం మీడియా సెంటర్ ను ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నోడల్ అధికారులు తమ విధులు నిర్వర్తించాలని కమిషనర్ తెలిపారు. వారం రోజుల తర్వాత మరోసారి నోడల్ అధికారులతో సమావేశం నిర్వహిస్తానని, నోడల్ అధికారులు తమ సన్నద్ధతను తెలిపే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తో సమావేశానికి హాజరు కావాలని తెలిపారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, అపూర్వ్ చౌహాన్, శ్రీనివాస్ రెడ్డి, హేమంత్ కేశవ్ పాటిల్, హేమంత్ బోర్ఖడే, రవి కిరణ్, అదనపు కమిషనర్లు అలివేలు మంగతాయారు, కె.వేణు గోపాల్, గీతా రాధిక, విజిలెన్స్ ఏ.ఎస్.పి సుదర్శన్, CVO డాక్టర్ అబ్దుల్ వకీల్, పి.ఆర్.ఎం. దశరథం తదితరులు హాజరయ్యారు.

## ఎస్.ఎన్.డి.పి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి..

* **అధికారులకు సూచించిన కమిషనర్ ఆర్.వి కర్ణన్..**



**హైదరాబాద్, సెప్టెంబర్ 16, (భారత శక్తి):** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చేపడుతున్న ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ లు, ఎస్.ఎన్.డి.పి పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ ఆర్.వి కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జీహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్‌లో కమిషనర్ ఆర్ వి కర్ణన్ నగరంలోని అన్ని జోన్లలో చేపడుతున్న ఇరిగేషన్ ప్రాజెక్ట్ లు, ఎస్.ఎన్.డి.పి పనుల పై జోనల్ కమిషనర్ లు , ప్రాజెక్ట్స్ ఇంజనీర్ లు, ప్లానింగ్ , భూ సేకరణ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంజనీరింగ్ అధికారులు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఒక్కో ప్రాజెక్ట్ పురోగతిని కమిషనర్ కు వివరించారు. క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న ప్రతిబంధకాలు, సవాళ్లు, పెండింగ్ పనులు, అందుకు గల కారణాలను తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పనుల వేగంగా పూర్తికి కమిషనర్ ఆర్ వి కర్ణన్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రాజెక్ట్ ల పూర్తికి నిధుల కొరత లేదన్నారు. యుటిలిటీ షిఫ్టింగ్, పెండింగ్ భూసేకరణ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. హెచ్ సిటీ కింద చేపడుతున్న పనులను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను కమీషనర్ ఆదేశించారు. సమావేశంలో జోనల్ కమిషనర్ లు అనురాగ్ జయంతి , బోర్కడే హేమంత్ సహదేవ్ రావు, హేమంత్ కేశవ్ పాటిల్, శ్రీనివాస్ రెడ్డి, రవి కిరణ్, ప్రాజెక్ట్స్ చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ జోతిర్మయి (ఎస్.ఎన్.డి.పి, లేక్స్), చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, ప్రత్యేక ఉప కలెక్టర్ రాములు నాయక్, ఎస్.ఈ, ఈఈ లు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత బస్సు ప్రయాణంపై దుష్ప్రచారం..

### మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 16, (భారత శక్తి):** తమ ప్రభుత్వం మహిళా ఉద్యోగులకు అండగా ఉంటుందని, ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తమతో పంచుకోవచ్చని మంత్రి సీతక్క మహిళా ఉద్యోగులకు భరోసా ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వ గౌరవాన్ని కాపాడే విధంగా మహిళా ఉద్యోగులు పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులుగా ఎన్నికైన మహిళల ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం సచివాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళలు ప్రభుత్వ ఉద్యోగంలో రాణించడం ఒక పెద్ద సవాల్ అని అన్నారు. కుటుంబ బాధ్యతలు, వృత్తి బాధ్యతలు రెండింటినీ ఏకకాలంలో సమర్థంగా నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగులను ఆమె అభినందించారు. కుటుంబ భారం మోస్తూ, తమ ఆరోగ్యాన్ని సైతం పట్టించుకోకుండా మహిళలు ఉద్యోగాలు చేస్తున్నారని, భర్త సహకారం ఉన్న మహిళా ఉద్యోగులు అదృష్టవంతులని ఆమె పేర్కొన్నారు. సమానత్వం, మహిళా సాధికారత పై దృష్టి మహిళల పట్ల గౌరవాన్ని పెంపొందించేలా పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలని మంత్రి సీతక్క సూచించారు. "హౌ టు రెస్పెక్ట్ ఉమెన్" అనే అంశాన్ని పిల్లలకు బోధించడం ద్వారానే సమానత్వం సాకారమవుతుందని అన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించేందుకు ఈ నెల 22న ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ఈ సమావేశానికి మహిళా ఉద్యోగులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

## హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకు కృషి చేస్తున్నాం..

- **హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్, సెప్టెంబర్ 16, (భారత శక్తి):** భారత శక్తి. పౌర సదుపాయాల మెరుగుపరచడం ద్వారా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు . మంగళవారం లక్డికాపూల్ నుండి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు రూ.17.93 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో జీహెచ్‌ఎంసీ నిర్మించనున్న వరద నీటిని తరలించే కాలువలకు నాంపల్లి లో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ , మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచడానికి నగరంలో రోడ్లు, నాళాలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వరదనీటి కాలువల పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్,నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ ,ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ అసన్ ఎఫండీ , జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.